

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 15-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 330 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 10.11 తదుపరి సప్తమి; నక్షత్రం: కృత్తిక సా. 4.09 తదుపరి రోహిణి; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 8.50-9.38, మ. 12.48-1.36; అమృతఘడియలు: మ. 1.49-3.22; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 6.22 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పెట్రో ధరలు తగ్గాయ్



లీటరు పెట్రోల్, డీజిల్‌పై 2 చొప్పున..
నేటి ఉదయం 6 నుంచి అమల్లోకి..
దాదాపు రెండేళ్ల తర్వాత తగ్గిన ధరలు
'లోక్‌సభ' షెడ్యూల్‌కు ముందు ప్రజలకు ఊరట
ఇటీవలే వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.100 తగ్గింపు

2

విషయం దాచి..

సమాచారం ఇచ్చింది కానీ.. అసలు సంగతి వెల్లడించలేదు

ఐదేళ్లలో రూ.16,518 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు
అత్యధికంగా బీజేపీకి రూ.6,560 కోట్లు
మొత్తం బాండ్లలో దాదాపు సగం ఆ పార్టీకే
తర్వాత స్థానాల్లో తృణమూల్, కాంగ్రెస్, బీఆర్ఎస్
ఏడు, ఎనిమిది స్థానాల్లో వైసీపీ, టీడీపీ
ఎస్‌బీఐ ఇచ్చిన డేటాను వెబ్‌సైట్లో పెట్టిన ఈసీ
ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చిందో వివరాల్లేవు
పార్టీలు, కంపెనీల మధ్య 'బాండ్' ప్రుడెంట్ ట్రస్టు
కంపెనీలిచ్చే నిధుల్ని పార్టీలకు మళ్లించటమే పని
11 ఏళ్లలో పార్టీలకు రూ.2,256 కోట్ల విరాళాలు
వీటిలో 75% బీజేపీకే.. వెల్లడించిన రాయిటర్స్
ప్రశ్నలకు స్పందించని ప్రుడెంట్ ట్రస్టు

న్యూఢిల్లీ, మార్చి 14: అనుకున్నంతా అయ్యింది. సుప్రీంకోర్టు గద్దింపులతో దిగి వచ్చిన ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్ల వివరాలను మాత్రం తాను అనుకున్నట్లుగానే బయటపెట్టింది. ఏ కంపెనీ ఏ రాజకీయ పార్టీకి నిధులిచ్చిందనే వివరాలు కనుక్కొనే అవకాశం లేని విధంగా సమాచారాన్ని విడుదల చేసింది. ఎస్‌బీఐ మంగళవారం సమర్పించిన రెండు జాబితాలను ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గురువారం తన వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసింది. అందులో ఒక జాబితాలో ఏయే కంపెనీలు ఎంతెంత విలువైన ఎలక్టోరల్ బాండ్స్ కొన్నాయో వివరాలు ఉన్నాయి. మరో జాబితాలో ఏయే పార్టీలకు ఎంతెంత విలువైన బాండ్స్ అందాయో వివరాలు ఉన్నాయి. 2 జాబితాల్లో ఎక్కడా బాండ్ల సీరియల్ నంబర్లను ప్రస్తావించక పోవడం గమనార్హం. ప్రస్తుతం ఇచ్చిన జాబితాల్లో ఏ కంపెనీ ఎస్‌బీఐ నుంచి కొన్న బాండ్లు ఏ పార్టీకి అందాయో తెలుసుకొనే అవకాశమే లేదు. ఎస్‌బీఐ అందించిన జాబితా సుప్రీంకోర్టు తీర్పు స్ఫూర్తికే విరుద్ధంగా ఉందని న్యాయకోవిదుడు ప్రశాంత్ భూషణ్ విమర్శించారు. ఏ కంపెనీ నుంచి ఏ రాజకీయ పార్టీ లబ్ధి పొందిందో

మిగతా 2వ పేజీలో...

ఈసీ కమిషనర్లుగా సుఖ్‌బీర్, జ్ఞానేశ్‌కుమార్



ఇద్దరూ 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారులే
370 అధికరణం రద్దు సమయంలో
కేంద్ర హోం శాఖలో జ్ఞానేశ్‌కుమార్ బాధ్యతలు
ఉత్తరాఖండ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సంధూ
ఎంపిక కమిటీ నుంచి సీజేఐను తప్పించడంపై
నేడు సుప్రీంకోర్టులో విచారణ



2029లో జమిలి!

మూడంచెల ఎన్నికలు 2 దశల్లో జరపాలి
తొలుత లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు
తర్వాత వంద రోజుల్లో స్థానిక సంస్థలకు
'ఒక దేశం.. ఒకే ఎన్నిక..'కు పచ్చజెండా!
రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫారసు
రాష్ట్రపతి ముర్ముకు 18 వేల పేజీల నివేదిక
హంగ్ ఏర్పడినా.. అవిశ్వాసం నెగ్గినా..
లోక్‌సభకు మళ్లీ ఎన్నికలు
సర్కారు పదవీకాలం ఆ టర్మ్ ముగిసేదాకే
అసెంబ్లీలు మధ్యలో రద్దయి, ఎన్నికలు వస్తే
వాటి గడువు లోక్‌సభ టర్మ్ పూర్తయ్యేదాకే
ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించాలి
దేశమంతా ఒకే ఓటర్ల జాబితా, ఐడీ కార్డు
ఉన్నత స్థాయి కమిటీ కీలక సిఫారసులు
ఇక ఎన్నికలే ఉండవు.. కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో జమిలి ఎన్నికలు జరపాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి ప్యానెల్ సిఫారసు చేసింది. 'ఒక దేశం-ఒకే ఎన్నిక' కింద 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంది. మూడంచెల విధానంలో.. లోక్‌సభ, అసెంబ్లీలు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని స్థానిక సంస్థలకు.. రెండు దశల్లో ఎన్నికలు జరపాలని పేర్కొంది. చట్టసభల ఎన్నికలు ముగిసిన తర్వాత వంద రోజుల్లో దేశంలోని స్థానిక సంస్థలన్నిటికీ ఎన్నికలు జరపాలని సూచించింది. సుపరిపాలనకు, శీఘ్ర అభివృద్ధికి జమిలి ఎన్నికలు మంచి వంటూ పలు కీలక సిఫారసులతో


మిగతా 9వ పేజీలో...

టీడీపీ కూటమి సూపర్ హిట్!



రాష్ట్రంలో 20 లోక్‌సభ సీట్లలో ఎన్డీయే విజయభేరి

అధికార వైసీపీకి ఐదు స్థానాలే
సీ-వోటర్-ఏబీపీ సర్వేలో వెల్లడి
నెట్‌వర్క్-18 సర్వేలో వైసీపీకి 7 సీట్లు
టీడీపీ కూటమికి 18 స్థానాలు
జగన్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత!



అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించబోతోందని తాజా సర్వేలు వెల్లడించాయి. సీ-వోటర్ సంస్థతో కలిసి ఏబీపీ చానల్ ఓ సర్వే నిర్వహించగా.. నెట్‌వర్క్18 (న్యూస్18) మెగా ఒపీనియన్ పోల్ జరిపింది. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ రెండు చానళ్లు దేశవ్యాప్తంగా చేపట్టిన సర్వేల ఫలితాలను గురువారం విడుదల చేశాయి. సీ-వోటర్-ఏబీపీ చానల్ సర్వే ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని 25 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ కూటమి 20 సీట్లు గెలుచుకోనుంది. వైసీపీకి 5 సీట్లు మాత్రమే వస్తాయని తెలిపింది. టీడీపీ కూటమికి 44.7 శాతం ఓట్లు.. వైసీపీకి 41.9 శాతం ఓట్లు.. కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమికి మూడు శాతం ఓట్లు వస్తాయని విశ్లేషించింది. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 10వ తేదీ మధ్యలో ఈ సర్వే జరిగింది. టీడీపీ-జనసేన కూటమి, బీజేపీ మధ్య మార్చి మొదటివారంలో పొత్తు ఖరారైన విషయం తెలిసిందే. నెట్‌వర్క్ 18 సర్వే కూడా టీడీపీ కూటమికి ఘన విజయం దక్కబోతోందని అంచనా వేసింది. ఈ కూటమికి ఏకంగా 50 శాతం ఓట్లు లభిస్తాయని తెలిపింది. వైసీపీకి 41 శాతం ఓట్లు, కాంగ్రెస్ కూటమికి ఆరు శాతం ఓట్లు, ఇతరులకు మూడు శాతం రావచ్చని

మిగతా 2వ పేజీలో...

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!



17 లోక్‌సభ స్థానాల్లో
10 ఆ పార్టీ ఖాతాలోకే..
బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1
ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్
ఏబీపీ-సీ ఓటర్ సర్వే అంచనా
తెలంగాణలో బీజేపీ 8 సీట్లు
గెలుస్తుందని న్యూస్18 సర్వే వెల్లడి

2

పట్టున్నవారికే పట్టం!

జనాదరణ ఉన్న నేతలకే టీడీపీ టికెట్లు
మైనారిటీలకు మరో రెండు సీట్లు
వైసీపీ నుంచి వచ్చిన
ఆనం, ఆదిమూలానికీ సీట్లు
జనసేన, బీజేపీతో పొత్తులో భాగంగా
144 స్థానాల్లో పోటీచేయనున్న టీడీపీ
ఇప్పటికే 128 మంది అభ్యర్థుల ప్రకటన
మిగిలిన 16 సీట్లపై ఇంకా కసరత్తు
నేడు ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదల?



34 మందితో టీడీపీ రెండో జాబితా విడుదల

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థుల ఎంపికలో ప్రజల్లో పట్టున్నవారికే తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేస్తోంది. 94 మందితో ఇదివరకే విడుదల చేసిన మొదటి జాబితాలోనేగాక 34 మంది అభ్యర్థులతో గురువారం ప్రకటించిన రెండో జాబితాలో కూడా ఇదే కోణం ప్రధానంగా ప్రతిఫలించింది. ఈ 34 మంది అభ్యర్థుల పేర్లను ఆ పార్టీ అధినేత చంద్రబాబు

మిగతా 11వ పేజీలో...

పిఠాపురం నుంచి నిలబడుతున్నా



ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉంది
ఎంపీగా పోటీపై త్వరలోనే నిర్ణయం

11

ఆంధ్రుల భవిత కోసం సీట్ల త్యాగం తప్పలేదు: పవన్

టీడీపీలో చేరిన కర్నూలు వైసీపీ ఎంపీ సంజీవ్

ఇంటర్వ్యూలోనే తిరకాసు!

వాటితో అవినీతి
జరుగుతోందన్న జగన్
మొదట ఇంటర్వ్యూలు రద్దు
ఏడాదిలోనే మళ్లీ పునరుద్ధరణ
ఎవరి కోసం మళ్లీ పెట్టారు?
గ్రూప్1 మెయిన్స్‌పై అబద్ధాలు
ఆధారాలతో సహా
నిరూపించిన అభ్యర్థులు
ఇక కిక్కురుమనని ఏపీపీఎస్సీ

12

రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం

ఛత్తీస్‌గఢ్‌లో పైలట్ ప్రాజెక్టు
ప్రారంభించనున్న కేంద్రం

2

నాది ఉత్తుత్తి నొక్కుడే!

జగనే స్వయంగా సెలవిచ్చిన వైనం



వారం దాటాకే ఖాతాల్లోకి ఈబీసీ నేస్తం డబ్బులు
బనగానపల్లెలో బటన్ నొక్కుతూ సీఎం వెల్లడి
బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడేంతవరకు
ఆ పేపర్లు, చానళ్లు చూడవద్దని ఉచిత సలహా

11

కానీ, తన రోత పత్రికకు రూ.కోటికి పైగా ప్రకటనలు
పేటీఎం బ్యాచ్‌ను పోషించే డిజిటల్ కార్పొరేషన్ అడగ్గానే
అదనంగా రూ.20 కోట్లు ఆగమేఘాలపై విడుదల
పేదలకు మాత్రం వారం, పది రోజులు అంటూ గడువులు
ఉసూరుమన్న లబ్ధిదారులు.. ఇదేం తీరంటూ అసహనం

హూ కిల్డ్ బాబాయ్?



వివేకా హత్యకు నేటితో ఐదేళ్లు

కడపలో నేడు సునీత ఆత్మీయ సమావేశం

గొడ్డలివేటు కథలో అబ్బాయే విలన్.. గత ఎన్నికల్లో ప్రచారాస్త్రం చేసుకున్న జగన్
నారాసుర రక్తచరిత్ర అంటూ బాబుపై నెపం.. అధికారంలోకొచ్చాక కేసు అటకపైకి
సునీత పోరాటం, సీబీఐ విచారణతోనే గుట్టు రట్టు.. తొలిసారి వైఎస్ కాంపౌండ్ పాత్ర వెలుగులోకి.. వైఎస్ అవినాశ్, వైఎస్ భాస్కర్‌రెడ్డిలపై కేసు
అన్నకు ఓటు వేయొద్దని ఇటీవల సునీత ప్రకటన.. రాజకీయ ప్రవేశంపై వార్తలు!

2

పార్టీలకు, కంపెనీలకు మధ్య 'బాండ్'.. ప్రుడెంట్ ట్రస్టు

- కంపెనీలు ఇచ్చే నిధులను పార్టీలకు మళ్లించటమే ట్రస్టు పని
- గత 11 ఏళ్లలో రాజకీయ పార్టీలకు రూ.2,256 కోట్ల విరాళాల పంపిణీ
- వీటిలో 75% బీజేపీకే: రాయిటర్స్ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: అక్కడున్న ఆ ఆఫీసులో పని చేసే సిబ్బంది ఇద్దరే. బయటి నుంచి చూస్తే ఏదో చిన్న పాటి కంపెనీ కార్యాలయంలా అది కనిపిస్తుంది. కానీ, లోగుట్టు తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే, గత 11 ఏళ్లలో ఆ ఆఫీసు నుంచి రూ.2,256 కోట్ల 'ఆర్థిక లావాదేవీలు' జరిగాయి. అది దేశంలోనే అతిపెద్ద ఎలక్టోరల్ ట్రస్టు ప్రుడెంట్ కార్యాలయం. రాయిటర్స్ వార్తాసంస్థ పరిశోధనాత్మక కథనంతో దీని గురించి తాజాగా ప్రపంచానికి తెలిసింది. 2013లో భారతీ ఎయిర్‌టెల్ కంపెనీ ప్రుడెంట్ ట్రస్టును నెలకొల్పింది. మరుసటి ఏడాది దానిని స్వతంత్ర ఆడిటర్లు ముకుల్ గోయల్, వెంకటాచలం గణేష్‌లకు అప్పగించింది. ఈ ట్రస్టు పని ఏమిటంటే.. వివిధ కార్పొరేట్ కంపెనీలు తనకు ఇచ్చే నిధులను రాజకీయపార్టీలకు విరాళాలుగా అందించటం. ఈ విధంగా గత 11 ఏళ్లలో రూ.2,256 కోట్ల విరాళాలు ఇచ్చింది. దీంట్లో 75 శాతం బీజేపీకే లభించాయి. అయితే, ఈ వివరాల్ని ప్రుడెంట్ వెల్లడించలేదు. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా రాయిటర్స్ పరిశోధన జరిపి.. ఈ వివరాలను గుర్తించింది. దీని ప్రకారం 2019-23 మధ్య ఈ ట్రస్టుకు 8 భారీ భారతీయ కంపెనీలు దాదాపు రూ.414 కోట్ల నిధులను అందించాయి. ఈ మొత్తాన్ని ప్రుడెంట్ ట్రస్టు చెక్కుల రూపంలో బీజేపీకి బదిలీ చేసింది. రాయిటర్స్ గుర్తించిన కంపెనీలలో ఎస్సార్ మిట్టల్ నిప్పన్ స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, జీఎమ్మార్, ఎస్సార్ ఉన్నాయి. దీని గురించి రాయిటర్స్ ప్రతినిధి ఆయా కంపెనీలను ప్రశ్నించగా.. ప్రుడెంట్ ట్రస్టు తన పైన నిబంధనల ప్రకారమే విరాళాల్ని పంపిణీ చేస్తుందని, దాని గురించి తమకు తెలియదని జీఎమ్మార్, భారతీ ఎయిర్‌టెల్ ప్రతినిధులు చెప్పారు. మిగిలిన రెండు కంపెనీలు స్పందించటానికి నిరాకరించాయి. ప్రుడెంట్ ట్రస్టు కూడా రాయిటర్స్ ఈ మెయిల్ ప్రశ్నలపై స్పందించలేదు. అయితే, ఆ ట్రస్టుకు చెందిన ముకుల్ గోయల్‌ను రాయిటర్స్ ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించి.. ట్రస్టు ఎలా పని చేస్తుందని ప్రశ్నించగా.. 'ఆ వివరాల్ని బహిరంగంగా మేం చర్చించం' అని మాత్రమే చెప్పారు. కాగా, దేశంలోని 18 ఎలక్టోరల్ ట్రస్టుల్లో ప్రుడెంట్ అతి పెద్దది. చట్టప్రకారం ఎలక్టోరల్ ట్రస్టులు తమకు లభించిన నిధుల గురించి, వివిధ పార్టీలకు వాటిని ఏ మేరకు పంపిణీ చేశామన్న దాని గురించి వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది.

రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం

- ఛత్తీస్‌గఢ్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించనున్న కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 14: రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన వారికి వారం రోజుల పాటు ఏ ఆసుపత్రిలోనైనా రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించాలని నిర్ణయించింది. చికిత్స తర్వాత ఆసుపత్రులు రీఎంబర్స్‌మెంటును క్లెయిమ్ చేసుకోవచ్చని పేర్కొంది. దీనిని మోటార్ వెహికల్ యాక్సిడెంట్ ఫండ్ ద్వారా చెల్లించనున్నట్లు తెలిపింది. దేశంలో ఎక్కడైనా, ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా ఉచిత చికిత్స ఉంటుందని వెల్లడించింది. మొదట ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఛత్తీస్‌గఢ్‌లో ప్రారంభించనున్నట్లు గురువారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ ప్రకటించింది. అనంతరం దీనిని దేశం మొత్తం విస్తరించనున్నట్లు వెల్లడించింది.



ఈడీ, సీబీఐలను ఉసిగొల్పి బీజేపీకి రూ.400 కోట్లు

- కేంద్ర సంస్థలతో బెదిరించి భారీగా నిధుల సేకరణ: ఖర్గే



న్యూఢిల్లీ, మార్చి 14: కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఈడీ, సీబీఐలను ఉపయోగించుకుని, బడా కంపెనీలను బెదిరించి రూ.400 కోట్లను బీజేపీ వసూలు చేసిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా 45 కంపెనీల నుంచి ఈ మొత్తం బీజేపీకి చేరిందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ నిధులకు సంబంధించిన శ్వేతపత్రాన్ని బీజేపీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర సంస్థలతో దాడులు చేయించడంతో 15 కంపెనీలు బీజేపీకి భారీఎత్తున నిధులు సమర్పించుకున్నాయని ఖర్గే ఆరోపించారు. బెదిరించడం, దోచుకోవడం, బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా బీజేపీ భారీ ఎత్తున నిధులు సమకూర్చుకుంటుందని ఆయన మండిపడ్డారు. నాలుగు షెల్ కంపెనీల నుంచి కూడా బీజేపీకి నిధులు వచ్చాయని ఆరోపించిన ఖర్గే... కాంగ్రెస్ ఖాతాలను సీజ్ చేయిస్తున్న బీజేపీ, తాను మాత్రం కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేసి నిధులు సమకూర్చుకుంటుందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యం మీద బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే తాను సేకరించిన నిధులపై స్వతంత్ర విచారణకు ఆదేశించుకోవాలని ఖర్గే సవాలు విసిరారు. ఐటీ, ఈడీ దాడుల తర్వాత 30 సంస్థలు బీజేపీకి రూ.335 కోట్ల నిధులు అందజేశాయని ఆయన వ్యాఖ్యానించారు. నిర్ణీత వ్యవధిలోపు ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బయటపెడతామని ప్రధాన ఎన్నికల కమిషనర్ చేసిన ప్రకటనపై తమకు విశ్వాసముందని పూర్తి పారదర్శకతతో ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించాలని ఖర్గే కోరారు.

రూ.2 తగ్గిన పెట్రో ధరలు

న్యూఢిల్లీ, మార్చి 14: ఇంధన ధరలు తగ్గాయి. పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.2 చొప్పున ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు తగ్గించాయి. తగ్గించిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి 6 గంటల నుంచి అమల్లోకి వస్తాయని గురువారం సాయంత్రం చమురు శాఖ తెలిపింది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడానికి ముందు పెట్రో ధరల తగ్గింపునకు సంబంధించిన ప్రకటన వెలువడటం గమనార్హం. దీంతో వాహనదారులకు కాస్త ఉపశమనం లభించనుంది. తాజాగా తగ్గించిన ధరతో దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం నుంచి లీటరు పెట్రోల్ ధర రూ.96.72 నుంచి రూ.94.72కు తగ్గనుంది. అలాగే లీటరు డీజిల్ ధర రూ.89.62 నుంచి రూ.87.62కు చేరనుంది. ముంబైలో లీటరు పెట్రోల్ ధర రూ.104.21కు, చెన్నైలో రూ.100.75కు తగ్గనుంది. అలాగే ముంబైలో లీటరు డీజిల్ రూ.92.15, కోల్‌కతాలో రూ.90.76, చెన్నైలో రూ.92.34కు చేరనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ.109.66, డీజిల్ ధర రూ.97.82గా ఉంది. వీటిపై మరో రూ.2 చొప్పున తగ్గనుంది. స్థానిక పన్నులు, దూరాన్ని బట్టి ఇంధనాల రేట్లు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉంటాయి. 2022 ఏప్రిల్ 6నుంచి పెట్రో ధరల్లో ఎలాంటి మార్పు లేదు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇటీవలే వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.100 తగ్గింపు ప్రకటన వెలువడింది. వారంలోనే పెట్రో ధరల తగ్గింపు ప్రకటన వెలువడటం గమనార్హం.

ఎలక్టోరల్ బాండ్స్‌లో వైసీపీ టాప్

- 2019 నుంచి ఇప్పటివరకు 337 కోట్లు.. టీడీపీకి 219 కోట్లు

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో చేరిన విరాళాల గుట్టు వీడింది. దేశవ్యాప్తంగా 2019 నుంచి ఈ ఏడాది జనవరి వరకు రాజకీయ పార్టీలకు రూ.12,769 కోట్లు బాండ్స్ రూపంలో వెళ్లాయి. ఇందులో అధికార బీజేపీ రూ.6,060 కోట్లమేర నిధులు పొందింది. ఈ జాబితాలో కాంగ్రెస్ ఖాతాలో రూ.1,123 కోట్లు చేరాయి. బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ రూ.1,092 కోట్లు పొందింది. తెలంగాణకు చెందిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)దే. ఆ పార్టీకి బాండ్ల రూపంలో రూ.1,215 కోట్లు అందాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే అత్యధికం. అయితే ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వైసీపీకి అత్యధికంగా రూ.337 కోట్లు వచ్చాయి. ఇది ఎలక్టోరల్ బాండ్స్‌లో 2.68 శాతంగా ఉంది. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి రూ.219 కోట్ల మేర నిధులు సమకూరాయి. మొత్తం బాండ్ల విలువలో ఇది 1.77 శాతం. ఇదిలా ఉంటే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీకి 2019లో స్వల్పంగానే నిధులు సమకూరాయి. కానీ 2020 నుంచి ఆ పార్టీకి నిధులు బాండ్ల రూపంలో వెల్లువెత్తాయి. ఇక 2022, 2023 సంవత్సరాల్లో వందల కోట్లు చేరాయి. ప్రతిపక్ష టీడీపీకి 2019 నుంచి 2022 వరకు తక్కువ నిధులు సమకూరాయి. కానీ, 2023 నుంచి ఈ ఏడాది జనవరి వరకు భారీగా బాండ్స్ రూపంలో నిధులు వచ్చాయి. కాగా, జనసేన పార్టీకి ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో ఇప్పటి వరకూ రూ.21 కోట్లు వచ్చాయి. వాటిలో ఆ పార్టీ ఇప్పటివరకూ రూ.19 కోట్లు ఎన్‌క్యాష్ చేసుకుంది.

విషయం దాచి..



(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకోవడానికి బాండ్ల సీరియల్ నంబర్లు తప్పనిసరి అని వ్యాఖ్యానించారు. లబ్ధిదారులెవరో తెలుసుకోవడానికే జాబితాను వెలువరించాలన్నది సుప్రీంకోర్టు తీర్పు ఉద్దేశమని చెప్పారు. బాండ్ నంబర్ల సమాచారం విడిగా వేరే సైలోస్‌లో(విడిగా ఉండే డేటాబేస్) ఉందని ఎస్‌బీఐ చెబుతోందని ప్రస్తావించారు. ఓటర్ స్వేచ్ఛగా సమర్థంగా ఓటేయాలంటే ఒక రాజకీయ పార్టీకి ఎక్కడి నుంచి నిధులు వస్తున్నాయనే సమాచారం అతనికి తెలిసి ఉండాలని స్వయంగా సుప్రీంకోర్టే చెప్పిందని గుర్తు చేశారు. ఫలానా కంపెనీ విడుదల చేసిన నిధులకు, ఫలానా పార్టీకి అందిన నిధులకు సంబంధం ఉందో లేదో ధ్రువీకరించుకొనేందుకు ఓటర్‌కు అవకాశం కలగాలంటే బాండ్ల సీరియల్ నంబర్లు కూడా జాబితాలో చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అయితే, సుప్రీంకోర్టు ఇటీవల ఎస్‌బీఐకి గడువు విధించినపుడు అనుకున్న అన్ని వివరాలు అందాలంటే సమయం పడుతుందని ఎస్‌బీఐ బదులిచ్చింది. కుదరదని, ఉన్న జాబితాను వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఒకవిధంగా కుంటి సాకులకు అవకాశం లేకుండా ఎంతోకొంత డేటా ప్రజల్లోకి వచ్చేందుకు ఈ ఆదేశం ఉపయోగపడింది. మొత్తం మీద ఎన్నికల సంఘానికి ఎస్‌బీఐ ఇచ్చిన డేటా పాక్షికమే. బాండ్ల సీరియల్ నంబర్లు ఇస్తే కానీ సంపూర్ణంకాదు.

ఐదేళ్ల డేటా

ఎస్‌బీఐ 2019 ఏప్రిల్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 15 వరకు బాండ్లకు సంబంధించిన డేటాను ఎన్నికల సంఘానికి ఇచ్చింది. అంటే, దాదాపు ఐదేళ్ల కాలానికి సంబంధించిన డేటా అన్నమాట. కంపెనీలు ఇచ్చిన 22,030 బాండ్లను రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్నాయి. వాటి విలువ రూ.16,518 కోట్లు. ఎస్‌బీఐ ఇచ్చిన రెండు జాబితాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం దేశంలోని దిగ్గజ కంపెనీలు అన్నీ ఎలక్టోరల్ బాండ్ల మీద భారీ ఎత్తున ఖర్చు పెట్టాయి. 2022లో ఈడీ విచారణను ఎదుర్కొన్న ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ ఏకంగా రూ.1,368 కోట్లను బాండ్ల రూపంలో చెల్లించింది. అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ సంస్థ 966 కోట్ల విలువైన బాండ్లు రాజకీయ పార్టీల కోసం కొనుగోలు చేసి, రెండో స్థానంలో ఉంది. హిందూ పత్రికలో పేర్కొన్న వివరాల ప్రకారం బాండ్ల రూపంలో అత్యధికంగా నిధులు అందుకున్న రాజకీయ పార్టీల్లో బీజేపీ అగ్రస్థానంలో ఉంది. ఆ పార్టీకి ఏకంగా 8633 బాండ్ల రూపంలో రూ.6,560 కోట్ల నిధులు అందాయి. తృణమూల్ 1609 కోట్లతో(12%) రెండో స్థానంలో ఉంది. కాంగ్రెస్ 3,146 బాండ్లతో 1421 కోట్లు అందుకొని మూడో స్థానంలో నిలిచింది. మొత్తం ఎలక్టోరల్ బాండ్లలో 47 శాతం బీజేపీకే దక్కాయి. కాంగ్రెస్‌కు 11 శాతం అందాయి. బీఆర్ఎస్ నాలుగో స్థానంలో, వైసీపీ, టీడీపీలు ఏడు, ఎనిమిది స్థానాల్లో ఉన్నాయి

బాండ్లు అందుకున్న పార్టీలు

పార్టీ	అందిన సొమ్ము రూ.కోట్లలో	శాతం
బీజేపీ	6060	47
తృణమూల్	1609	12
కాంగ్రెస్	1421	11
బీఆర్ఎస్	1215	9
బీజేడీ	775	6
డీఎంకే	639	5
వైసీపీ	337	2
టీడీపీ	219	1
శివసేన	159	1
ఆర్జేడీ	72	-
జనసేన	21	-

బాండ్లు ఇచ్చిన కంపెనీలు

కంపెనీలు - సొమ్ము రూ.కోట్లలో		కంపెనీలు - సొమ్ము రూ.కోట్లలో	
ఫ్యూచర్ గేమింగ్	1368	రెడ్డీ ల్యాబ్స్	80
మేఘా ఇంజనీరింగ్	966	పిరామల్	60
క్విక్ సప్లయ్ చైన్	410	నవయుగ	55
వేదాంత	400	శిర్డీసాయి ఎలక్ట్రికల్స్	40
హల్దియా ఎనర్జీ	377	సిప్లా	39
భారతి టెలికం	247	ఇంటర్‌గ్లోబ్-స్పైస్‌జెట్	36
ఎస్సెల్ మైనింగ్	224	మిట్టల్ కంపెనీలు	246
వెస్టర్న్ యూపీ పవర్	200	గ్రాసిమ్	33
కేవెంటర్ ఫుడ్ పార్క్	194	జిందాల్ స్టెయిన్‌లెస్	30
మదన్‌లాల్	185	బజాజ్ ఆటో	25
డీఎల్ఎఫ్	170	సన్ ఫార్మా	25
యశోద హాస్పిటల్స్	162	మ్యాన్‌కైండ్ ఫార్మా	24
ఉత్కళ్ అల్యుమినా	145	బజాజ్ ఫైనాన్స్	20
జిందాల్ స్టీల్	123	సుజుకీ	20
బిర్లా కార్బన్	105	అల్ట్రాటెక్	15
రుంగ్టా సన్స్	100	టీవీఎస్	10

హూ కిల్డ్ బాబాయ్?

- గొడ్డలివేటు కథలో అబ్బాయే విలన్!
- వివేకానంద హత్య జరిగి నేటికి ఐదేళ్లు
- నేడు కడపలో ఆయన కుమార్తె సునీత ఆత్మీయ సమావేశం

(కడప-ఆంధ్రజ్యోతి)



సంఘటన స్థలంలో వైఎస్ వివేకానందరెడ్డి మృతదేహం (ఫైల్)

> "మా నాన్న వివేకానందరెడ్డి హత్యకు ప్రజాతీర్పుతోనే నిజమైన న్యాయం జరుగుతుంది. జగన్ ప్రభుత్వంలో హత్యారాజకీయాలు ఎక్కువ. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే మా కుటుంబానికి న్యాయం జరగదు. వంచన, మోసాలకు పాల్పడిన మా అన్న జగన్ పార్టీకి ఓటు వేయవద్దు"
>
> - ఇటీవల ఢిల్లీ ప్రెస్‌మీట్‌లో సునీత వ్యాఖ్యలు

సరిగ్గా ఎన్నికలకు నెల ముందు జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్యను నాటి విపక్ష నేత జగన్ గత ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వాడుకున్నారు. చంద్రబాబే హత్య చేయించారంటూ జగన్ శిబిరం తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసింది. 'నారాసుర రక్తచరిత్ర' అంటూ కట్టుకథలు వండి వార్చింది. వివేకా హత్య జగన్‌కు సానుభూతి అస్త్రంగా మారి గెలుపులో కీలకపాత్ర పోషించింది. దీంతో జగన్ సీఎం అయిన తరువాత తన చిన్నాన్న హత్య కేసు కుట్రను ఛేదించడంతోపాటు నిందితులను అరెస్టు చేయిస్తారని రెండు రాష్ట్రాల ప్రజలూ ఎదురుచూశారు. కానీ ఏమీ జరగలేదు. వివేకా హత్యకు గురై నేటికి సరిగ్గా ఐదేళ్లు. 2019 మార్చి 15న పులివెందులలోని ఆయన స్వగృహంలో అత్యంత దారుణంగా గొడ్డలితో నరికి హత్య చేశారు. మళ్లీ ఎన్నికలు కూడా వచ్చేశాయి. కానీ హంతకులను జగన్ ప్రభుత్వం బోనెక్కించలేకపోయింది. పైగా సొంత బాబాయి హత్యకేసునే అటకెక్కించే ప్రయత్నం జరిగింది. హత్య వెనుక వైఎస్ కాంపౌండ్ హస్తం ఉండటమే దీనికి కారణమనేది బహిరంగ రహస్యం. వివేకా హంగులు, ఆర్భాటాలకు దూరంగా. చాలా సాదాసీదా జీవనాన్ని గడిపేవారు. తన అన్న రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినా ఎన్నడూ అధికారాన్ని తలకెక్కించుకోలేదు. తమ్ముడిని రాజశేఖర్‌రెడ్డి గౌతమబుద్ధుడుగా పిలుచుకునేవారు. వివేకాను పార్టీలకతీతంగా అందరూ అభిమానించేవారు.

హత్య కేసులో ఎన్నెన్ని ట్విస్టులో....

వివేకా హత్యకు చంద్రబాబు, లోకేశ్ సూత్రధారులని, అప్పటి మంత్రి ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవితో హత్య చేయించారంటూ అప్పట్లో వైఎస్ జగన్... గవర్నరుకు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని, సీబీఐతో దర్యాప్తు చేయించాలని జగన్ అండ్ కో డిమాండ్ చేశారు.జగన్ సీఎంగా అదే ఏడాది మే 30న ప్రమాణం చేశారు. నాటి నుంచి.. ఈ కేసు అనూహ్య మలుపులు తిరుగుతూ పోయింది. దర్యాప్తు కోసం టీడీపీ హయాంలో ఏర్పాటుచేసిన సిట్‌ను మార్చివేశారు. అభిషేక్ మహంతి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయగా.. ఆయన సెలవుపై వెళ్లారు. 2019 సెప్టెంబరులో కడప ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అన్బురాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసినా కేసు ముందుకు పోలేదు. ప్రతిపక్ష నేత హోదాలో సీబీఐ విచారణ కోరిన జగన్.. సీఎం అయ్యాక కోర్టులో పిటిషన్ ఉపసంహరించుకున్నారు. ఆయన తీరులో తేడా రావడంతో వివేకా కుమార్తె డాక్టరు సునీత సీబీఐ విచారణ కోరారు. సీబీఐ కేసు దర్యాప్తు చేపట్టిన తర్వాత కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్, హత్యకు ఎక్కడ నుంచి ఫాలో అప్ చేశారు లాంటివన్నీ బయటపడ్డాయి. వివేకా హత్యకు ఉపయోగించిన గొడ్డలి స్కెచ్ వైఎస్ కాంపౌండులోనే జరిగిందని సీబీఐ తేల్చింది. గూగుల్ టేకౌట్ ఇతర సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులను బాహ్య ప్రపంచానికి చూపించింది. జగన్‌కు వరుసకు తమ్ముడు కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి, వైసీపీ రాష్ట్ర నేత దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు పేర్కొంటూ వారిపై కేసు నమోదు చేసింది. ఇది పెను సంచలనంగా మారింది. కడప ఎంపీ సీటు, ఆధిపత్యం కోసమే వివేకాను లేపేశారని విచారణలో తేలింది.

వేధించినా.. వేటాడినా.. వెనుదీయని దస్తగిరి..

ఈ కేసులో సీబీఐ 8 మందిని అరెస్టు చేసింది. వారిలో ఏ-4గా ఉన్న దస్తగిరి అప్రూవర్‌గా మారాడు. దస్తగిరి వివేకా వద్ద డ్రైవర్‌గా పనిచేసేవాడు. హత్యకేసు విచారణ ఇంతవరకు వచ్చిందంటే కారణం దస్తగిరి. ఇతను అప్రూవర్‌గా మారడంతో హత్యకు సంబంధించి ఒక్కో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో పులివెందుల వైసీపీ నేతలు ఇతనిపై గురిపెట్టారంటారు. ఎలాగైనా ఇతడిని దారికి తెచ్చుకోవాలని పోలీసులతో కేసులు పెట్టించారంటారు. ఎర్రగుంట్లలో ఇతనిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి దాదాపు నాలుగు నెలలు జైలులో ఉంచారు. చివరకు హైకోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నాడు. ఒక కేసులో బెయిల్ తెచ్చుకున్నా మరోకేసు నమోదు చేశారు. దానికీ బెయిల్ రావడంతో ఇంటికి వచ్చాడు. అయితే తాను జైలులో ఉన్నప్పుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి జైలుకు వచ్చి తనను బెదిరించాడని, రాజీకి రావాలంటూ రూ.20 కోట్లు ఆఫర్ చేశాడని దస్తగిరి ఇటీవల వెల్లడించడం పెను సంచలనం రేపింది. తనను నేరస్థుడిగా కాకుండా సాక్షిగా పరిగణించాలంటూ దస్తగిరి వేసిన పిటిషన్‌పై ఇటీవల తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీనిపై సీబీఐ ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. తీర్పు రిజర్వ్‌లో ఉంది.

అవినాశ్ అరెస్టును ఆపడానికి...

అవినాశ్‌రెడ్డి అరెస్టు దాకా వ్యవహారం రావడంతో అప్పటి సీబీఐ దర్యాప్తు అధికారిపైనే కేసు పెట్టించారు. అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయకుండా ఉండేందుకు దాదాపు నాలుగు రోజులు వైసీపీ శ్రేణులను మోహరించారు. సోషల్ మీడియాలో కామెంట్లు పెడితేనే అర్ధరాత్రి పూట వెళ్లి గోడలు దూకి తలుపులు బద్దలు కొట్టి మరీ అరెస్టు చేసే పోలీసులు.. అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయకపోవడంతో.. దీని వెనక ఎవరున్నారనేది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిపోయింది. చివరకు అవినాశ్‌రెడ్డిని హైదరాబాద్‌లో సీబీఐ వారు అరెస్టు చేసి అదేరోజు బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో అప్రూవర్ దస్తగిరి, వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్‌పై బయట ఉన్నారు. రెండు రోజుల క్రితం ఏ-5 దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

సునీత అలుపెరగని పోరాటం

తండ్రి హత్యకేసులో నిందితులు ఎవరో తేలేందుకు సునీత అలుపెరగని పోరాటం చేశారు. కేసు విచారణకు సొంత అన్న అయిన సీఎం జగన్ సహకరించకపోవడంతో ఒంటరి పోరు మొదలుపెట్టారు. విచారణ ముందుకు వెళ్లకుండా జగన్ అడుగడుగునా అడ్డుకుంటున్నారని ఆమె భావించారు. అయినా మొక్కవోని ధైర్యంతో కడప బిడ్డగా ముందుకు వెళ్లిన తీరు హ్యాట్సాఫ్ అంటున్నారు. ఈ కేసును ఇంతటితో వదులుకోలేదంటే నీ ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించినా, డోంట్ కేర్ అంటూ ముందుకు అడుగులు వేశారు. తన తండ్రి స్మారకార్థం ఆమె శుక్రవారం కడప జయరాజ్ గార్డెన్స్‌లో ఆత్మీయ సమావేశం సునీత ఏర్పాటుచేశారు. ఇప్పటికే వివేకా అనుచరులకు ఆహ్వాన పత్రికలు వెళ్లాయి. ఈ కార్యక్రమానికి సునీతతోపాటు భార్య సౌభాగ్యమ్మ, వివేకానంద కుటుంబసభ్యుల ముఖ్యులు హాజరు కానున్నారు. వివేకా కుటుంబం నుంచి ఒకరు వచ్చే ఎన్నికల్లో పోటీకి దిగుతున్నారన్న వార్తల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎన్నికల సంఘం కొత్త కమిషనర్లుగా..

సుఖ్‌బీర్ సంధూ, జ్ఞానేష్‌కుమార్!

- ఇద్దరూ 1988 బ్యాచ్ ఐఏఎస్‌లే
- కేరళ, ఉత్తరాఖండ్ కేడర్‌కు చెందినవారు



జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూ

న్యూఢిల్లీ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కమిషనర్లుగా మాజీ ఐఏఎస్ అధికారులు సుఖ్‌బీర్‌సింగ్ సంధూ జ్ఞానేశ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ గురువారం సమావేశమైంది. దీనిలో ఓ కేంద్ర మంత్రి, లోక్ సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్‌చౌదరి సభ్యులు. కేంద్ర మంత్రి కోటాలో హోం మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. కమిషనర్ల నియామకం కోసం కేంద్రం న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఆధ్వర్యంలోని సెర్చ్ కమిటీ ప్రతిపాదిత పేర్లతో జాబితాను రూపొందించింది. ఈయన కూడా సమావేశానికి హాజరయ్యారు. జాబితాపై చర్చ అనంతరం పంజాబ్‌కు చెందిన సంధూ, కేరళకు చెందిన జ్ఞానేశ్‌లను ఎన్నికల సంఘం కమిషనర్లుగా ఎంపిక చేశారు. కమిషనర్‌గా ఉన్న అరుణ్ గోయెల్ గత శుక్రవారం అనూహ్యంగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మరో కమిషనర్ అనూప్ చంద్ర పాండే ఫిబ్రవరిలో పదవీ విరమణ చేశారు. కాగా, ప్రభుత్వం నుంచి ప్రకటన రాకముందే.. ఢిల్లీలోని తన నివాసంలో అధిర్ మీడియా సమావేశం నిర్వహించి కొత్త కమిషనర్ల నియామకం వివరాలు తెలపడం గమనార్హం.

ఒకటే బ్యాచ్..

కేరళకు చెందిన జ్ఞానేశ్‌కుమార్, పంజాబ్‌కు చెందిన సుఖ్‌బీర్‌సింగ్ సంధూ 1988 బ్యాచ్ ఐఏఎస్‌లు. జ్ఞానేశ్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా, యూపీఏ ప్రభుత్వ హయాంలో 2007-12 మధ్య రక్షణ మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. సుఖ్‌బీర్ 2019-21 మధ్య ఉత్తరాఖండ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న లోక్‌పాల్ కార్యదర్శిగా నియమితులయ్యారు.

నేడు సుప్రీం కోర్టులో విచారణ

కేంద్ర ఎన్నికల ప్రధానకమిషనర్ (సీఈఐ), ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి ప్రధాన న్యాయమూర్తిని తప్పించడంపై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఇటీవల దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఈ అంశంపై గతంలోనే మధ్యప్రదేశ్ మహిళా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి జయ ఠాకూర్, మరికొందరు సుప్రీంను ఆశ్రయించారు.

తుది జాబితా అడిగితే 212 పేర్లిచ్చారు

ఎన్నికల కమిషనర్ల ఎంపికకు అనుసరించిన ప్రక్రియపై అధీర్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఏకపక్షంగా ఎంపిక చేశారని చెప్పడం లేదని, అయితే.. లోపాలు ఉన్నాయన్నారు. కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. 'కుదించిన జాబితాను అడిగితే బుధవారం రాత్రి 212 మంది పేర్లిచ్చారు. భేటీకి 10 నిమిషాల ముందు ఆరుగురి పేర్లు చెప్పారు. వీరందరి పూర్తి నేపథ్యం గురించి సమాచారం ఇవ్వలేదు. అయినా ఇద్దరి నియామకం జరిగిపోయింది. భర్తీ ప్రక్రియలో లోపాలను ప్రశ్నిస్తూ, నిరసన వ్యక్తం చేశా. నేను ఎవరి పేర్లను సూచించలేదు' అని మండిపడ్డారు.

టీడీపీ కూటమి సూపర్ హిట్!

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేసింది. ఈ ప్రకారం టీడీపీ కూటమికి 18 ఎంపీ సీట్లు, వైసీపీకి ఏడు వస్తాయని వివరించింది. కాంగ్రెస్ సహా మిగిలిన పార్టీలకు ఒక్క సీటు కూడా రాదని పేర్కొంది. ఈ రెండు సర్వేల్లో ప్రజాభిప్రాయం ఇంచుమించుగా ఒకే విధంగా ఉండడం విశేషం. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత బలంగా ఉండడం వల్లే టీడీపీ కూటమి ఘన విజయం దిశగా వెళ్తోందని విశ్లేషించాయి. గత కొంతకాలంగా పలు సర్వేలు వచ్చినా టీడీపీ కూటమికి 20 సీట్లు వస్తాయని వెల్లడించిన తొలి సర్వే సీ-ఓటర్-ఏబీపీదే. గత లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీకి 22 ఎంపీ సీట్లు రాగా.. టీడీపీకి మూడే వచ్చాయి (వేర్వేరుగా పోటీచేసిన జనసేన, బీజేపీ, కాంగ్రెస్‌లకు ఒక్కటి కూడా రాలేదు). వైసీపీ 49.1 శాతం, టీడీపీ 39.2 శాతం ఓట్లు పొందగా.. ఒక్క సీటూ గెలవని కాంగ్రెస్ 1.29%, బీజేపీ 0.96% ఓట్లు సాధించాయి. నోటాకు వీటి కంటే ఎక్కువగా 1.49 శాతం ఓట్లు రావడం విశేషం.

పార్టీ/కూటమి	సీట్లు	ఓట్ల శాతం
సీ-వోటర్-ఏబీపీ సర్వే..		
ఎన్డీయే	20	44.7
వైసీపీ	5	41.9
కాంగ్రెస్/ఇతరులు	0	3
నెట్‌వర్క్ 18 సర్వే..		
ఎన్డీయే	18	50
వైసీపీ	7	41
కాంగ్రెస్ కూటమి	0	6

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీపార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది.

లంచం తీసుకుంటూ ఒకరు..

- పోలీస్ స్టేషన్‌లోనే సెటిల్‌మెంట్
- అందుకోసం రూ.30 వేలు డిమాండ్
- 10 వేలు తీసుకుంటుండగా పట్టివేత

ఏసీబీకి చిక్కిన ఆరిలోవ ఎస్ఐ

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని ఆరిలోవ ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. విజయనగరం జిల్లా బొండపల్లికి చెందిన ఒకరు ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద కారు కొనుగోలు చేశారు. కారుపై ఉన్న ఫైనాన్స్‌ను ప్రతి నెలా కొనుగోలుదారే చెల్లించుకునేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా కారు కొనుగోలు చేసిన వ్యక్తి కొన్ని నెలలుగా ఫైనాన్స్ వాయిదాలను చెల్లించలేకపోయారు. కారు విక్రయించిన వ్యక్తికి బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి పెరగడంతో వారం క్రితం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేయకుండా ఇరువర్గాలను కూర్చోబెట్టి సెటిల్‌మెంట్ చేశారు. ఇప్పటివరకూ పెండింగ్‌లో ఉన్న వాయిదాలకు సంబంధించిన మొత్తంతోపాటు కారును కూడా వెనక్కి ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. కేసు సెటిల్ చేసినందుకు తనకు రూ.30 వేలు ఇవ్వాలని బొండపల్లికి చెందిన వ్యక్తిని ఎస్ఐ హరికృష్ణ డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బుల్లేవని, ఇప్పటికే అప్పుల పాలైపోయానని బాధితుడు చెప్పడంతో కేసు కట్టకుండా వివాదాన్ని సెటిల్ చేశానని, కనీసం రూ.పది వేలు అయినా ఇవ్వాల్సిందేనని ఎస్ఐ స్పష్టంచేశారు. ఆ మొత్తం కూడా లేదని బాధితుడు చెప్పడంతో అతనితోపాటు స్టేషన్‌కు వెళ్లిన అతని స్నేహితుడు శ్రీకాంత్ వద్ద సెల్‌ఫోన్ లాక్కొని, రూ.30 వేలు ఇచ్చిన తర్వాత సెల్‌ఫోన్ తీసుకువెళ్లాలని చెప్పారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు 1440 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు పథకం ప్రకారం గురువారం బాధితుడికి రూ.పది వేలు ఇచ్చి స్టేషన్‌కు పంపించారు. ఆ మొత్తాన్ని ఎస్ఐ హరికృష్ణ స్వయంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్ఐ హరికృష్ణ

మసాజ్ సెంటర్‌లో మరొకరు..

- ఎస్ఐ సహా ఏడుగురు విటులు అరెస్టు.. విశాఖలో పోలీసుల దాడులు

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోలీసులు ఆకస్మికంగా నిర్వహించిన దాడుల్లో మసాజ్ సెంటర్‌లో యువతులతో అభ్యంతరకరమైన స్థితిలో ఓ సబ్ ఇన్‌స్పెక్టర్ పట్టుబడడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. స్పాల ముసుగులో చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో సీపీ రవిశంకర్ అయ్యన్నార్ బుధవారం రాత్రి ఆకస్మిక సోదాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో నగరంలోని 64 స్పా/మసాజ్ సెంటర్లలో 200 మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మసాజ్ సెంటర్లలో యువతులతో మగవారికి మసాజ్ చేయిస్తుండడం, అభ్యంతరకరమైన రీతిలో మరికొందరు కనిపించడంతో పోలీసులు ఆయా సెంటర్లపై కేసులు నమోదుచేశారు. ఏడుగురు పురుషులను అరెస్టు చేశారు. అలాగే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 17 మంది యువతులను స్వధార్‌హోమ్‌కు అప్పగించారు. పోలీసులు కేసు నమోదుచేసిన నాలుగు మసాజ్ సెంటర్లు కూడా జోన్-2 పరిధిలో ఉండడం విశేషం. అయితే జోన్-1 పరిధిలో దాదాపు 60 వరకూ మసాజ్ సెంటర్లు ఉన్నప్పటికీ ఒక్క కేసు కూడా నమోదుచేయకపోవడంపై పోలీస్ వర్గాల్లో సైతం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంచరపాలెం స్టేషన్ పరిధిలోని ఒక మసాజ్ సెంటర్‌లో సోదాలు నిర్వహించేందుకు వెళ్లిన పోలీసులకు అభ్యంతరకరమైన రీతిలో ఒకరు పట్టుబడ్డారు. అతడిని విచారించగా తాను నగర పోలీస్ కమిషనరేట్‌లోని కంట్రోల్‌రూమ్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నట్టు వెల్లడించాడు. పోలీసులు ఆ సమాచారం ఆధారంగా పోలీసులు ఆరా తీయగా 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐగా తేలడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాల మేరకు అతనిపై కూడా విటుడిగా కేసు నమోదుచేశారు. పోలీసులే మసాజ్ సెంటర్లకు వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఓడించాలని సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీపీ కార్పొరేటర్లకు ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. సర్పంచుల 16 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కర్నూలు కలెక్టరేట్ ముందు సర్పంచులు ఉరితాళ్లు బిగించుకుని గురువారం నిరసన చేపట్టారు.

తిరుపతి జిల్లా నాయుడుపేటలోని పలు ప్రాంతాలు, తడ మండలంలోని మాంబట్టు, ఎస్ఎం కండ్రిగ, వెండ్లూరుపాడు, సూళ్లూరుపేట పట్టణంతో పాటు మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం రాత్రి 8.42 గంటల సమయంలో భూమి రెండు నుంచి 3 సెకన్లపాటు కంపించింది. దొరవారి సత్రం మండలం రోశనూరు వద్ద రిక్టర్ స్కేల్‌పై 3.9గా భూకంపం నమోదైనట్టు సమాచారం.

అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయండి

- ఆయన షరతులను ఉల్లంఘించారు..
- సాక్ష్యం చెప్పకుండా ఉండేందుకు నా కుటుంబీకులపై దాడులు చేయిస్తున్నారు
- నన్నూ జైల్లో చంపించేందుకు ప్రయత్నం
- రూ.20 కోట్లు ఇస్తామంటూ ప్రలోభపెట్టారు
- తెలంగాణ హైకోర్టులో దస్తగిరి పిటిషన్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో షరతులు ఉల్లంఘించిన కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి (ఏ8) బెయిల్ రద్దు చేయాలంటూ.. అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి (ఏ4) తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను సాక్ష్యం చెప్పకుండా ఉండేందుకు అవినాశ్‌రెడ్డి అన్ని రకాలుగా ఒత్తిడి తెస్తున్నారని.. తన కుటుంబీకులపై దాడులకు పురిగొల్పడంతో పాటు తనను కూడా చంపించేందుకు యత్నిస్తున్నారని దస్తగిరి పిటిషన్‌లో వెల్లడించారు. గతేడాది మే 31న కోర్టు అవినాశ్‌కు బెయిల్ మంజూరు చేసిందని.. దాన్ని రద్దు చేయాలని అభ్యర్థించారు. త్వరలో ఈ పిటిషన్ జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చే అవకాశముంది.

నేరుగా జగన్‌తో ఫోన్‌లో మాట్లాడిస్తానన్నాడు..

అవినాశ్ బెయిల్ ఎందుకు రద్దు చేయాలో వివరిస్తూ పలు కారణాలను దస్తగిరి పిటిషన్‌లో పేర్కొన్నారు. 'నిందితుడు (అవినాశ్‌రెడ్డి) బెయిల్ షరతులను ఉల్లంఘించారు. ప్రాసిక్యూషన్ విట్‌నెస్ అయిన నా కుటుంబీకులను భయాందోళనకు గురిచేసేలా ప్రవర్తించారు. నా తండ్రిపై దాడి చేయించడానికి ముగ్గురు వ్యక్తులను పంపారు. ఈ కేసులో నేను ఎలాంటి సాక్ష్యం చెప్పకుండా ఒత్తిడి చేసేందుకు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. మరో కేసులో కడప సబ్ జైల్లో ఉండగా అవినాశ్‌రెడ్డి అనుచరులు నన్ను హత్య చేయడానికి యత్నించారు. తప్పుడు ఆరోపణలతో 120 రోజులు జైల్లో పెట్టించారు. నేను జైల్లో ఉండగా మరో నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి జైలు అధికారులను మేనేజ్ చేసి.. హెల్త్ క్యాంప్ పేరిట జైలు లోపలికి రూ.20 కోట్లు తీసుకొని వచ్చాడు. నిందితులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దంటూ ప్రలోభానికి గురిచేశాడు. అవినాశ్‌రెడ్డి, జగన్, ఆయన భార్య భారతి తన వెనక ఉన్నారని.. వారు ఏమైనా చేయగలరని చెప్పాడు. సాక్షిగా తప్పుకుంటే నా పిల్లలు, కుటుంబ భవిష్యత్తును అవినాశ్, జగన్ చూసుకుంటారని చెప్పాడు. తన మాటలపై నమ్మకం లేకపోతే నేరుగా అవినాశ్, జగన్‌తో ఫోన్‌లో మాట్లాడిస్తానన్నాడు. ప్రాసిక్యూషన్ విట్‌నెస్‌గా విత్‌డ్రా చేసుకోకపోతే నీ కుటుంబం ఉండదు అని చైతన్య రెడ్డి బెదిరించాడు' అని పిటిషన్‌లో వివరించారు. ఆధారాలను ట్యాంపర్ చేయడం, సాక్షులను బెదిరించడం తీవ్రమైన అంశాలని.. సీఆర్పీసీ నిబంధనల ప్రకారం అవినాశ్ బెయిల్ రద్దు చేయాలని కోరారు.

నేటి నుంచి ఈసెట్ దరఖాస్తుల స్వీకరణ

- మే 8న పరీక్షల నిర్వహణ

అనంతపురం సెంట్రల్, మార్చి 14: ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈసెట్-2024) ద్వారా బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సర ప్రవేశాలకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని సెట్ నిర్వాహక కమిటీ ఛైర్మన్, అనంతపురం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు తెలిపారు. వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ భానుమూర్తితో కలిసి ఈసెట్ నిర్వహణ వివరాలను వెల్లడించారు. ఉమ్మడి ఏపీ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 15 వరకు ఈసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఆ తరువాత ఏప్రిల్ 22 వరకు రూ.500, 29 వరకు రూ.2 వేలు, మే 2వ తేదీ వరకు రూ.5 వేల అపరాధ రుసుముతో దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మే 1వ తేదీనుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. మే 8న పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, బీఎస్సీ(గణితం), సెరామిక్ టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మెటలర్జికల్, మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. అదే నెల 10న ప్రాథమిక కీ విడుదల చేస్తామని, 12వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. https://cets.apsche.ap.gov.in/ECET వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిప్లమోలో ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఎస్సీలో గణితం కోర్సులు పూర్తిచేసిన వారు ఈసెట్ రాసేందుకు అర్హులని తెలిపారు. పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, నమూనా పరీక్షలు రాయొచ్చని తెలిపారు. సందేహాల నివృత్తికోసం 08554-232622 నంబర్‌కు ఫోన్‌చేయాలని సూచించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాసరావు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

హైకోర్టు హెచ్చరిక

తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ముంచుకు వస్తున్న నీటి ఎద్దడి ముప్పును రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గుర్తించి అధికార యంత్రాంగాన్ని హెచ్చరించడం సకాలంలో వెలువడిన మేలుకొలుపు. పోయిన వర్షాకాలంలో తగినంత వర్షపాతం లేనందువల్ల, ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయన్న సూచనల వల్ల, రానున్న రోజులలో మంచినీటి ఎద్దడి, విద్యుచ్ఛక్తి కొరత కూడా తెలంగాణను బాధించవచ్చునని భావిస్తున్నారు. జలసంరక్షణ చర్యలు తీసుకోవాలని, ఇంకుడుగుంతలు లేని నిర్మాణాల మీద చర్యలు తీసుకోవాలని, తెలంగాణ జల, భూ, వృక్ష చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు దీర్ఘకాలికంగా దుర్భిక్ష పరిస్థితులను, తాగునీటి ఎద్దడిని నివారించడానికి అనుసరించవలసినవి. సామాజిక బాధ్యతను నెరవేర్చని నిర్మాణ సంస్థలను, పౌరులను ఈ కొరతల సమయంలో అయినా మందలించడం అవసరం.

వర్షాభావ పరిస్థితుల కారణంగా దాదాపుగా దుర్భిక్షమనదగ్గ పరిస్థితి నెలకొన్నదని, అందువల్ల తీవ్రమైన నీటి ఎద్దడి ఎదురుకానున్నదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా అంగీకరించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల రైతులు వ్యవసాయ అవసరాల కోసం రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయమని డిమాండ్ చేస్తున్నా, సానుకూలంగా స్పందించగలిగే పరిస్థితులు లేవు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో పోయిన ఏడాది ఇదే సమయంలో సుమారు 200 టిఎంసిల నీరు విడుదలకు అందుబాటులో ఉండగా, ఇప్పుడు 140 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో పోయిన సంవత్సరం ఇదే సమయంలో 42 టిఎంసిలు విడుదలకు వీలుగా ఉండగా, ఇప్పుడు కేవలం 36 టిఎంసిలు మాత్రమే అందుబాటులో ఉంది. శ్రీశైలం నీటి విడుదల విద్యుత్ అవసరాలతో ముడిపడి ఉంటుంది. ఉభయ రాష్ట్రాలకు చెందిన జల అవసరాలను తీర్చవలసి వచ్చే ఆ రెండు రిజర్వాయర్ల నీటిని ఆచితూచి వినియోగించుకోవలసి ఉంది. జంటనగరాలకు మంచినీరు అందించే ఐదు ప్రధాన రిజర్వాయర్లలో నీటి అందుబాటు పోయిన సంవత్సరం కంటె రెండు టిఎంసిలు తక్కువగా ఉంది. ఇంకా తీవ్రమైన ఎండాకాలం ముందే ఉన్నది. నీటి అవసరాలు, ఉష్ణోగ్రతలు కలిసి చెరువులు త్వరత్వరగా ఖాళీ అవుతాయి. మార్చి మొదటి వారంలో ఒకరోజు 30 కోట్ల యూనిట్ల విద్యుత్ వినియోగాన్ని ఉత్తర, దక్షిణ తెలంగాణ డిస్కమ్‌లు నమోదు చేశాయి. బోర్ల వినియోగం, గృహ విద్యుత్ వినియోగం పెరిగిపోతున్నాయి. తగినంతగా విద్యుత్‌ను సమీకరించి, అవసరాలను తీర్చవచ్చును కానీ, నిర్వహణా క్రమంలో అయినా కొన్ని సరఫరా అంతరాయాలు లేకుండా ఉండవు. జలసంరక్షణలో దీర్ఘకాలికమైన అలక్ష్యానికి తోడు, ఇటీవలి వర్షాభావ పరిస్థితులను రాజకీయాలకు ఆపాదించడం వాంఛనీయం కాదు. తాము అధికారంలో ఉంటే పరిస్థితి ఇట్లా ఉండేది కాదని ప్రతిపక్ష నాయకుడు వ్యాఖ్యానించడం సరికాదు. చేయగలిగినంత చేస్తామని, కొద్దిపాటి అసౌకర్యాలను రైతాంగం, నగరపౌరులు అర్థం చేసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నది.

ఎన్నికల సీజన్‌లో నీటికి కరెంటుకు కొరతలు కోతలు ఎదురుకావడం ప్రభుత్వాలకు పెద్ద పరీక్ష. బెంగుళూరు మహానగరంలో నీటి కటకట వల్ల ఐటి పరిశ్రమ ఆఫీసులు మూతబడే పరిస్థితి నెలకొన్నది. గ్రామీణ ప్రాంతాల పరిస్థితి కొంత మెరుగే కానీ, అక్కడా ఎంతో కాలం ఉదారంగా నీటివినియోగం కుదరదు. కర్ణాటకలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఈ నీటి ఎద్దడికి ముడిపెట్టి చూడడం సహజం. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం ఎలాగైనా కొరతలు తగ్గించాలని ప్రయత్నం చేయడమూ సహజం. రాజకీయమైన పోటీలో, ఉద్వేగపూరితమైన ప్రకటనలు కూడా వింటుంటాము. తమిళనాడుకు కావేరి నీరు ఒక్కచుక్క కూడా ఇచ్చేది లేదని కర్ణాటక నేతలు చేస్తున్న ప్రకటనలు, ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నమే. నిజానికి హైదరాబాద్‌లో లాగానే బాధ్యతారహితమైన పట్టణీకరణ, పర్యావరణ విలువలను ఖాతరు చేయని నిర్మాణాలు బెంగుళూరు పరిస్థితికి కూడా కారణాలు. దీర్ఘకాలికంగా బెంగుళూరు చూపిన నిర్లక్ష్యమే దాని ప్రస్తుత దుస్థితికి కారణమని తెలంగాణ హైకోర్టు భావించడం అందుకే.

పరిపాలనలో కానీ, విధాన నిర్ణయాలలో కానీ తాత్కాలిక వాదం పనికిరాదు. సుస్థిరమైన అభివృద్ధి విధానాలు, సమర్థవంతమైన వినియోగం ఉండేవిధంగా వివిధ వనరుల వాడకం, దీర్ఘకాలిక ప్రభావాల గురించిన అవగాహన ప్రభుత్వాలకు అవసరం. వరదలు, కరువులు వచ్చినప్పుడు మాత్రమే గుండెలు బాదుకుంటే ఉపయోగం లేదు. ప్రతి వర్షాకాలం మహానగరాలలో నివాసప్రాంతాలు మునిగిపోతున్నాయి. ప్రతి దుర్భిక్ష సందర్భంలోనూ నోళ్లు చేలూ ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితి మారాలి. జవాబుదారీతనం లేని పట్టణీకరణను నియంత్రించాలి. అధికంగా నీరు, విద్యుత్ అవసరమయ్యే పంటలను నిరుత్సాహపరచాలి. రైతులైనా, వ్యాపారులైనా, సాధారణ పౌరులైనా తమ తమ బాధ్యతను తెలుసుకుని నేలను, నీటిని, అన్ని ప్రకృతి వనరులను సంరక్షించాలి.

పురావస్తు ప్రయాణంలో మన రామకథే వేరు!

ప్రతి దేశానికి విషమ పరీక్షలు ఉంటాయి. సుదీర్ఘ చరిత్ర కలిగిన భారత్‌కు అవి ఇంకా ఎక్కువ. చరిత్ర గతిని మార్చిన ఘటనలు ఎప్పుడు జరిగాయి? రాజ్య వ్యవస్థ ఎప్పుడు ప్రారంభమైంది? ఏ మతం ఎప్పుడు ఉనికిలోకి వచ్చింది? మత గ్రంథాల సంకలనం ఎప్పుడు జరిగింది? కులం ఎప్పుడు మొదలైంది? దేవాలయాలకు బీజం ఏ శతాబ్దిలో పడింది? వ్యవసాయం ఎప్పుడు ఆరంభమైంది? వేద కాలం నాటి ప్రముఖ దేవుళ్ల ప్రాభవం ఎప్పుడు కొడిగట్టింది? యజ్ఞయాగాదుల ప్రాధాన్యం ఎప్పుడు పోయింది? విగ్రహారాధన ఎప్పుడు మొదలైంది? కర్మ సిద్ధాంతానికి పునాదులు ఎప్పుడు పడ్డాయి? ఇలాంటి ప్రశ్నలన్నీ కాల నిర్ణయాన్ని కోరతాయి. అంటే.. ఏది ఎప్పుడు మొదలైందో.. ఆధునిక సామాజిక శాస్త్రాల ఆసరాతో నిర్ణయించటం అన్నమాట. అది సహేతుకంగా, చారిత్రక దృష్టితో జరిగితే తర్వాతి పరిణామాలు కాస్త తేలికగా అర్థం అవుతాయి.


మన చరిత్రలో కాల నిర్ణయమే ఒక విషమపరీక్ష. కీలక సంఘటనలను సంవత్సరాల వారీగా నమోదు చేయటం చాలా అరుదు. హర్షచరిత్ర ఆధారంగా అతని రాజ్య సరిహద్దులను తెలుసుకోలేం. పాలనా సంగతులను కచ్చితంగా పసిగట్టలేం. కావ్య రచనలు చేసిన రాజులు కూడా లౌకిక రచనలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. కొన్నేళ్లనాటి సంప్రదాయాలను వేలయేళ్ల నాటివిగా భావించటం మనకు అలవాటు. కొబ్బరికాయ లేని పూజలను ఊహించలేం. కాని అదెప్పుడు మనదేశంలోకి వచ్చిందో ఏ గ్రంథంలోనూ నిర్దిష్టంగా ఉండదు. మలేసియా నుంచి 2000 ఏళ్లనాడు ఇక్కడకు వచ్చిందనే అంచనాలు ఉన్నాయి. ఎక్కడ నుంచో వచ్చిన కొబ్బరికాయకు పూజా కార్యక్రమాల్లో అంత ప్రాధాన్యత ఎందుకు వచ్చిందన్న ప్రశ్నకు జవాబులు వెతకటానికి చారిత్రక దృక్పథం ఉండాలి. అన్నిటికీ మనమే మూలకర్తలమనే దుర్భ్రమను వదులుకునే విశాలత కావాలి. మన గురించి మనకు సమగ్రంగా అర్థం కావాలన్నా, మన సంప్రదాయాల పుట్టుపూర్వోత్తరాలు తెలియాలన్నా కాలనిర్ణయమే కీలకం. ఇప్పుడది కూడా రాజకీయాల్లో పావుగా మారిపోతోంది. హిందూ 'స్వర్ణయుగం'లో కాలనిర్ణయం చేయాల్సిన సంగతులే లేవనే వాతావరణం నెలకొంటోంది. పురావస్తుశాస్త్ర తవ్వకాల ఆధారంగా జరిగే కాలనిర్ణయాన్ని మసీదులకు, దర్గాలకు మాత్రమే పరిమితం చేసి, అక్కడ ఒకనాడు ఆలయాలు ఉండేవో లేవో తేల్చితే సరిపోతుందన్న వాదనలు బలపడుతున్నాయి. కోర్టుల్లో పిటిషన్లూ అందుకోసమే పడుతున్నాయి.

పురావస్తు తవ్వకాలతో అనేక దేశాల చరిత్రలు సమగ్రంగా తెలిశాయి. మహాకావ్యాల్లో వర్ణించిన సంఘటనల నిజానిజాలు వెల్లడయ్యాయి. మత గ్రంథాల్లో పేర్కొన్న ప్రళయాలపై కొత్త వెలుగులు ప్రసరించాయి. బైబిల్‌లో పేర్కొన్న ఘటనల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో తవ్వకాలను చేపట్టి వాటిల్లో వాస్తవికత ఎంతో తెలుసుకోటానికి ప్రయత్నాలు జరిగాయి. మన దేశంలో అలాంటి ప్రయత్నాలు జరగలేదా? అంటే కొన్ని జరిగాయని చెప్పుకోవచ్చు. రామాయణ సంఘటనల గురించి జరిగిన ప్రయత్నం అందులో ఒకటి. 50 ఏళ్ల క్రితం ఆ దిశగా కృషిచేసిన వారిలో హెచ్.డి.సంకాలియా ఒకరు. పురావస్తు పరిశోధనల్లో సంకాలియాది అగ్రస్థానమనే చెప్పాలి. ఆయన రచనలు చదవకుండా భారత పురావస్తు విజ్ఞానం గురించి ఓనమాలు తెలుసుకోలేం. 1972లో 'రామాయణ ఎ మిత్ ఆర్ రియాలిటీ' అన్న చిన్న పుస్తకాన్ని తీసుకువచ్చారు. ఆ తర్వాత మరో పదేళ్లకు పరిశోధనను విస్తరించి 'ద రామాయణ ఇన్ హిస్టారికల్ పర్‌స్పెక్టివ్' మరో గ్రంథాన్ని ప్రచురించారు. మహాకావ్యాన్ని సృష్టించిన మహాకవి సైతం తననాటి కాల ప్రభావం నుంచి తప్పించుకుని అన్నీ వర్ణనలూ చేయలేరన్న భావనతో రామాయణాన్ని సంకాలియా విశ్లేషించారు. దేశంలో నలుమూలల నుంచి సేకరించిన రామాయణ ప్రతులను (సంస్కృత, ప్రాంతీయ భాషల్లోనివి) పరిశీలించి, సరిపోల్చి బరోడాలో పండితులు మౌలికప్రతిని (క్రిటికల్ ఎడిషన్) రూపొందించారు. దానితో పాటు ఇతర భాషల్లోని రామాయణాలను సంకాలియా అధ్యయనం చేశారు. పురావస్తు శాస్త్ర ఆధారాలతో రామాయణంలోని సంఘటనల వాస్తవికతను అంచనా వేశారు. రామాయణ గాథలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కానీ 1020 కంటే ముందునాటి రామాయణ ప్రాచీన ప్రతి ఏదీ దొరకలేదు. ఆ ప్రతి ప్రకారం చూస్తే రామాయణంలోని ప్రధాన వర్ణనలన్నీ క్రీ.శ. 500ల నాటికి నిశ్చిత రూపాన్ని సంతరించుకున్నాయి. ఆ తర్వాత కూడా చాలా విషయాలు రామాయణంలో చేరాయి. 'ద రామాయణ ట్రెడిషన్ ఇన్ ఏషియా' అన్న పుస్తకంలో ఈ విశేషాలన్నీ దొరకుతాయి. సంస్కృతంలో లేని ఎన్నో ఉపకథలు తెలుగు రామాయణాల్లో చేరాయి. రాముడి పుట్టిన రోజును కూడా కొన్ని భిన్నంగా పేర్కొన్నాయి.

సంకాలియా పరిశీలనలు చాలా ఉన్నా వాటిల్లో కొన్నిటిని మాత్రమే చెప్పుకోగలం. అవేంటో చూద్దాం.. రామాయణంలో అయోధ్య, కిష్కింధ, లంకా నగరాల గురించి వర్ణనలు వివరంగా ఉన్నాయి. త్రికూట పర్వతం మీద లంక ఉంది. అది సాగరంలో ఉన్నట్టు వర్ణించారు. లంక చుట్టూ రక్షణ ప్రాకారం, కందకాలు ఉన్నాయి. లోపల తోరణ ద్వారాలూ ఉన్నాయి. ప్రాకారం, తోరణాలను స్వర్ణమయంగా వర్ణించారు. ఏడెనిమిది అంతస్తుల భవనాలు ఉన్నట్లు కూడా పేర్కొన్నారు. భవన స్తంభాలూ బంగారంతో చేసినవే. వాటికి ముత్యాలూ కూడా పొదిగారు. అశోకవనానికీ ప్రాకారం ఉంది. వేయి స్తంభాల మందిరమూ అందులో ఉంది. ఇలాంటి ఛాయలున్న నగరం ప్రపంచంలో ఏ తవ్వకాల్లోనూ బయటపడలేదు. లంకా వర్ణనను కాల్పనిక సృష్టిగానే భావించినా దానికీ నిజ జీవితంలో ఏదైనా ఆధారం ఉండాలి కదా? కుషాణులు–గుప్తుల కాలంనాటి నగరాలను ప్రేరణగా తీసుకుని ఊహలకు పదునుపెట్టి లంక, కిష్కింధలను ఎక్కడికో తీసుకువెళ్లారు. బళ్లారి ప్రాంతంలో కాకుండా వింధ్య పర్వత అటవీ ప్రాంతంలోనే కిష్కింధ ఉండేది. ఇక కిష్కింధ నగరం చిత్రణ కూడా అన్ని హద్దులూ దాటింది. రాజపథాలు, విపణి వీధులు, కైలాసాన్ని అంటే భవనాలు, స్వర్ణ సింహాసనాల్లాంటివి బోలెడున్నాయి. కిష్కింధ వాసులు సవరులై ఉండొచ్చు. భోపాల్ చుట్టుపక్కల సహజంగా ఉండే గుహల్లోనే వారు జీవించేవారు. కొన ప్రాణంతో ఉన్నప్పుడు వాలి అన్నమాటలు చూస్తే కిష్కింధ వర్ణన ఎంత అసహజమో అర్థం అవుతుంది. అడవుల్లో ఆహారాన్ని ఏరుకుంటూ బతికే నన్ను ఎందుకు చంపావు? అంటూ వాలి రాముడిని ప్రశ్నిస్తాడు. చెట్లకొమ్మలను, రాళ్లను మాత్రమే వానరులు ఆయుధాలుగా వాడారు. విల్లంబులు చేపట్టలేదు. మానవ నిర్మిత ఆయుధాలేవి వారు వాడలేదు. వాలి భౌతికకాయాన్ని ఆర్యకర్మలతో దహనం చేసినట్టు వర్ణించారు. గోదావరి నది ఇవతల ప్రాంతంలో శవాలను పూడ్చిపెట్టటమే అనాది సంప్రదాయం. దీని ప్రకారం చూసినా కిష్కింధ బళ్లారి ప్రాంతంలో ఉందని భావించలేం.

అయోధ్య పరిసర భౌగోళిక వర్ణన కాస్త సమంజసంగా ఉంది. సరయూనది, సమీప నగరాల ప్రస్తావనలు ఇందుకు ఉదాహరణలు. కానీ నగర జీవితాన్ని వాస్తవికంగా వర్ణించారని చెప్పలేం. అద్భుత శక్తులున్న దేవుళ్లు, రుషులు, మనుషుల విన్యాసాలకే ఆనాటి సాహిత్యంలో చోటు ఎక్కువ. రామాయణంలో ప్రస్తావనకు వచ్చిన ఆయుధాలన్నీ ఇనుంతో తయారైనవే. ఇనుం వాడకం క్రీ.పూ. 1000కు కాస్త అటూ ఇటూగా మొదలైంది. కైకేయిది ఆయస(ఇనుం) హృదయమన్న వ్యాఖ్యను చూస్తే ఇనుం వాడకం బాగా స్థిరపడిందని తెలుస్తుంది. రామాయణానికి స్పష్టరూపం ప్రధానంగా ఈ యుగంలోనే ఏర్పడింది. రాముడి వనవాస వార్త విని కౌసల్య మూర్ఛబోయి పడిపోతుంది. అప్పుడు ఆమె శరీరానికి దుమ్ముధూళి అంటుకుందన్న వర్ణనను చూస్తే ఆనాటి ఇళ్లు మట్టితో కట్టినవిగా భావించొచ్చు. సీత ధరించిన పట్టు వస్త్రం ప్రస్తావన బట్టి ఆ వర్ణన ఎప్పుడు చేరిందో మనకు తెలుస్తుంది. క్రీస్తుశకం తొలినాళ్లలోనే పట్టు వస్త్రాలు చైనా నుంచి వచ్చాయి. రామ అనే అక్షరాలున్న ఉంగరాన్ని హనుమంతుడికి రాముడు ఇచ్చిన సంఘటన కూడా ఒక కాలాన్ని చెబుతుంది. అక్షరాలు, గుర్తులు ఉండే ఉంగరాల వాడకం ఇండో–గ్రీకు పాలకుల కాలంలోనే వాడకంలోకి వచ్చాయి. సాల వృక్షాల ప్రస్తావన రామాయణంలో చాలా కీలకం. వీటి ఆధారంగా లంక, దండకారణ్య స్థల నిర్ధారణలను చేయగలం. ఏడు సాలవృక్షాలను చీల్చుకు వెళ్లిన రామబాణ ప్రయోగం అందరం విని ఉంటాం. దేశ వృక్ష జాతుల చరిత్రను పరిశీలిస్తే సాల వృక్షాలు చోటానాగ్‌పూర్ పీఠభూమిలో తప్ప మరెక్కడా ఉండని విషయం తెలుస్తుంది. లంకగా పేర్కొన్న ప్రాంతం కూడా చోటానాగ్‌పూర్ ప్రాంతంలోనే ఉండొచ్చు. జబల్‌పూర్‌కు దగ్గరలో ఉండేదే లంకా ప్రాంతం! అక్కడి సహజ తటాకాన్నే సముద్రంగా భావించి కల్పనచేసి ఉండొచ్చు. రామేశ్వరం దగ్గర సేతు నిర్మాణం కూడా కల్పనే! సేతు నిర్మాణం కోసం వానరులు తెచ్చిపడేసినట్లు పేర్కొన్న వృక్ష జాతులు ఆ ప్రాంతంలో ఎప్పుడూ లేవు. పెద్దరాళ్లు దొరికే అవకాశమూ రామేశ్వరంలో లేదు. అసలు వింధ్యను రాముడు దాటాడన్న విషయాన్ని భౌగోళికంగా నిర్ధారించలేం. రావణుడు గోండు జాతికి చెంది ఉండొచ్చు. ఇక్ష్వాకు వంశం తన పాలనను విస్తరించే క్రమంలో రావణుడితో గొడవవచ్చి ఉంటుంది. ఆ గొడవే సీతాపహరణకు కారణం కావొచ్చు. బహుభార్యాత్వం ఉన్న చోట వారసత్వ తగాదాలు సహజం. రాముడి వనవాసం అట్లా సంభవించిందే. రామాయణ మూల కథను అయోధ్య పరిసర ప్రాంతాల్లో స్థానిక కవులు గానం చేసేవారు. వాల్మీకి ఆ కథను మహాకావ్యంగా మలచాడు.

చరిత్ర పునర్నిర్మాణానికి ఎన్నో శాస్త్రాల సహాయం కావాలి. వాటి నుంచి వచ్చిన విజ్ఞానం, విశ్లేషణా పద్ధతులతో మహాకావ్యాల పరిణామాలు స్పష్టంగా తెలుస్తాయి. ఆది గ్రంథాలపై అవగాహనా పరిధి పెరుగుతుంది. వాటి ప్రయాణాల్లో జరిగిన చిత్రవిచిత్రాలు మనసుల్లో నాటుకుంటాయి. మహాకవుల కల్పనా చాతుర్య లోతులూ కనపడతాయి. మొత్తంగా మన వివేచనా శక్తే విస్తరిస్తుంది.



చరిత్ర పునర్నిర్మాణానికి ఎన్నో శాస్త్రాల సహాయం కావాలి. వాటి నుంచి వచ్చిన విజ్ఞానం, విశ్లేషణా పద్ధతులతో మహాకావ్యాల పరిణామాలు స్పష్టంగా తెలుస్తాయి. ఆది గ్రంథాలపై అవగాహనా పరిధి పెరుగుతుంది. వాటి ప్రయాణాల్లో జరిగిన చిత్రవిచిత్రాలు మనసుల్లో నాటుకుంటాయి. మహాకవుల కల్పనా చాతుర్య లోతులూ కనపడతాయి. మొత్తంగా మన వివేచనా శక్తే విస్తరిస్తుంది.



■ రాహుల్ కుమార్

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

బెంగళూరు 'జల' పాఠాలు

కొన్ని సంవత్సరాల క్రితం మేము (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ప్రచురించిన 'ఎక్స్‌క్రీటా మేటర్స్ ఇన్ బెంగళూరు' అనే నివేదిక విడుదల సందర్భంగా ఆ మహానగర నీటి సరఫరా, వ్యర్థ పదార్థాల నిర్వహణకు బాధ్యులైన ఉన్నతాధికారులతో సంబంధిత అంశాలపై చురుగ్గా చర్చించాను. ముఖ్యంగా ఆ నగరంలో నీటి సరఫరా నిర్వహణ విషయమై మా మధ్య తీవ్ర వాద ప్రతివాదాలు జరిగాయి. మా పరిశోధనలో బెంగళూరు నగరంలో నీటి సరఫరా వ్యయాలు భరించలేని విధంగా ఉన్నాయని, అంతేకాకుండా ప్రస్తుతమున్న సరఫరా సదుపాయాలు సుదీర్ఘ కాలం స్థిరంగా నిర్వహించలేని విధంగా ఉన్నట్టు వెల్లడయిందని నేను చెప్పాను. నా అభిప్రాయంతో ఆ ఉన్నతాధికారులు (సివిల్ ఇంజనీర్లు) ఏకీభవించలేదు. వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న కావేరీ నది నుంచి పైప్‌లైన్స్ ద్వారా నగరానికి నీటిని తీసుకువస్తున్నామని, కలవరపడాల్సిన అవసరమేమీ లేదని వారు వాదించారు. సరే, ఇప్పుడు ఈ హైటెక్ సిటీ తీవ్ర నీటి ఎద్దడితో సతమతమవుతోంది. ఈ సమస్య మరింతగా విషమించనున్నది. మరి భారతదేశ అత్యంత అధునాతన నగర నీటి సరఫరా బాధ్యత నిర్వహిస్తున్న ప్రాజ్ఞులు, తాము అమలుపరుస్తున్న నీటి సరఫరా పథకాలపై పునరాలోచించి, వాటికి ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందిస్తారా? బహుశా..! అని మాత్రమే అనుకోవల్సి వున్నది.

మహానగరాలలోని ప్రజలకు, పరిశ్రమలకు అవసరమైన నీటిని (బాగా ఖర్చుతో కూడిన) అధునాతన ఇంజనీరింగ్ పరిష్కారాల ద్వారా సమృద్ధిగా సరఫరా చేయవచ్చన్న విధానకర్తల కలలు కరిగిపోతున్నాయి; నిర్దేశిత విధానాలకనుగుణంగా పథకాలు రూపొందించి, అమలుపరిచే ప్రభుత్వాధికారుల కృషి ఫలించడం లేదు. ఈ విపత్కర పరిస్థితికి బెంగళూరు నగరం అద్దం పడుతోంది. ఈ జల సంక్షోభానికి ఆ నగరం మొదటిదీ కాదు, చివరిదీ కాబోదు.

బెంగళూరు మహానగరానికి సుదూర గతంలో అనేక సరస్సుల నుంచి నీటి సరఫరా జరుగుతూ ఉండేది. నగర పరిధిలోని ఆ సరస్సులనన్నిటినీ వాన నీటిని భద్రపరిచేందుకు, వరదలను నివారించేందుకు సృష్టించారు. కాలక్రమేణా నగరం విస్తరించింది. జనాభా పెరిగింది. నగర నీటి అవసరాలను సరస్సులు తీర్చలేని పరిస్థితి వచ్చింది. దీంతో 1974లో కావేరీ నదీ జలాల సరఫరా పథకాన్ని రూపొందించారు. ఈ పథకంలో భాగంగా తొలుత కావేరీ నది నుంచి నీటిని 490 మీటర్ల ఎత్తుకు పంపింగ్ చేస్తారు. అక్కడ నుంచి 100 కిలోమీటర్లకు పైగా ఆ నీటిని రవాణా చేసి నగర ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. నగర ఇంజనీర్లతో నేను జరిపిన చర్చల్లో ఆ ఇంజనీరింగ్ అద్భుతం నాల్గవ దశను అమలు పరచడంలో నిమగ్నమై ఉన్నారని అర్థమయింది. నేను ముందే చెప్పినట్టు నగరంలో సంభావ్య నీటి కొరత గురించి కలవరపడేందుకు సరైన కారణమేదీ వారికి కనిపించలేదు మరి.

ఇంజనీర్లు కొన్ని వాస్తవాలను నిర్లక్ష్యం చేస్తున్నారని కూడా నేను నిష్కర్షగా చెప్పాను. అవి: (1) బెంగళూరు నగరంలోనూ, పరిసర ప్రాంతాలలోనూ భూగర్భ జలాల వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. దీన్నిబట్టి నీటి సరఫరా సరైన విధంగా, సంపూర్ణంగా జరగడం లేదనేది స్పష్టమయింది; (2) నగరం భౌగోళికంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణతో పాటు జనాభా కూడా పెరుగుతోంది. గతంలో ఎన్నడో నిర్మించిన మురికి నీటిపారుదల వ్యవస్థలు విస్తరిస్తోన్న నగరం, పెరుగుతోన్న జనాభా అవసరాలకు అనుగుణంగా లేవు; (3) ఉత్పాదితమవుతోన్న మురుగునీరు, వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడం లేదని నగర పాలనాధికారులే ఒప్పుకుంటున్నారు. దీనివల్ల నగరంలోని సరస్సులు, చెరువులు, వివిధ నీటి వనరులు కలుషితమై పోతున్నాయి.

నేను ఎత్తి చూపిన ఈ వాస్తవాలను కూడా ఆ ఇంజనీర్లు సీరియస్‌గా తీసుకోలేదు. అవేమీ పెద్ద సమస్యలు కావని, కాబోవనే ధీమాను వారు వ్యక్తం చేశారు. భవిష్యత్తు అంతా చక్కగా ఉంటుందని పరిపూర్ణ ఆశాభావం వారిలో నిండుగా కనిపించింది. రోజుకు 720 మిలియన్ లీటర్ల (ఎమ్ఎల్‌డి) మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం నగర పాలనా వ్యవస్థకు ఉన్నదని వారు ఘనంగా చెప్పుకున్నారు. అత్యంత అధునాతన సాంకేతికతలు తమకు అందుబాటులో ఉన్నాయని, అవి పెద్ద ఎత్తున ఉత్పాదితమవుతోన్న వ్యర్థ పదార్థాలను పూర్తిగా శుద్ధి చేయగలుగుతాయని వారు గొప్పగా చెప్పారు.

సరే, ప్రస్తుత పరిస్థితులకు వద్దాం. 2010 సంవత్సరంలో బెంగళూరు నగర దినసరి అవసరాలు 1,125 మిలియన్ లీటర్లు కాగా ఇప్పుడది రోజుకు 2600 మిలియన్ లీటర్లకు పెరిగింది. ఈ అవసరాలలో సగభాగాన్ని కావేరీ నది తీరుస్తోంది. మిగతా సరఫరాలకు భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే నగర నీటి అవసరాలు పూర్తిగా తీరడం లేదు. దీంతో నగర వాసులు నీటిని సమకూర్చుకునేందుకు బోర్‌వెల్స్‌ను స్వయంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. వర్షపాతంలో అస్థిరత్వం బాగా పెరిగిపోవడంతో కొత్తగా ఏర్పాటు చేసుకున్న నీటి వనరులు శీఘ్రగతిన ఎండిపోతున్నాయి. అయినా ప్రాజ్ఞులైన నగర ఇంజనీర్లు సంక్షోభాన్ని అర్థం చేసుకున్నట్టుగా లేదు. వారు ఇంకా తమ పాత కలలే కంటున్నారు. త్వరలో ప్రారంభమవనున్న కావేరీ ప్రాజెక్టు ఐదవ దశతో నీటి సరఫరాకు సంబంధించిన సమస్త సమస్యలు పరిష్కారమైపోతాయని నగర చీఫ్ ఇంజనీర్ ఎంతో నమ్మకంగా చెప్పారు.

మురుగునీటి వ్యవస్థల కథ కూడా నీటి సరఫరా నిర్వహణకు భిన్నంగా లేదు. మురుగునీటి శుద్ధికి అవసరమైన సదుపాయాలను నిర్మించారు. బెంగళూరు నగరానికి రోజుకు 1,167.50 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉన్నదని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు 2021 నివేదిక పేర్కొంది. ఉన్న సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడం కూడా 75 శాతం మేరకు మెరుగుపడింది. అయితే ఉత్పాదితమవుతున్న మురుగు నీరు, దాని శుద్ధి చేయగల సామర్థ్యం మధ్య అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుత నీటి అవసరాలు పూర్తిగా తీరుతాయని భావిస్తే ఉత్పాదితమయ్యే మురుగు నీరు రోజుకు 2000 మిలియన్ లీటర్లుగా ఉంటుంది. అంటే అందులో సగానికి పైగా శుద్ధి చేయబడనిదిగా ఉండిపోతుంది. ఈ సమస్య నధిగమించేందుకు నగర అధికారుల మధ్య చాలాసార్లు చర్చలు జరిగాయి. అయినా పరిస్థితులు ఒక దశాబ్దం క్రితం ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలానే ఉన్నాయి!

మహా నగరాల నీటి సరఫరా ప్రణాళికల్లో ఇదొక నిజమైన సంక్షోభం. పెరుగుతున్న అవసరాలను, అందుకనుగుణంగా మార్పులు చేసేందుకు గల అవకాశాలను అవగాహన చేసుకోవడంలో మన అసమర్థత, అశక్తతే అసలు సంక్షోభం సుమా! వాస్తవమేమిటంటే బెంగళూరులో వర్షాలు బాగానే కురుస్తున్నాయి. ఆ వాననీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం చేయగల సరస్సులు కూడా నగరంలో చాలా పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

ప్రతి వాన బొట్టును కాపాడుకుని, తీవ్ర నీటి కొరత కాలంలో ఉపయోగించుకోవాలి. అప్పుడు మాత్రమే నగర మురుగునీటి పారుదల వ్యవస్థను సక్రమంగా, సమర్థంగా నిర్వహించుకోవచ్చు. అయితే ఇదెలా సాధ్యం? మురుగునీటిని పైప్‌లైన్ల ద్వారా రవాణా చేయడం కాకుండా వ్యర్థ పదార్థాలన్నిటినీ ట్యాంకర్ల ద్వారా సేకరించి శుద్ధి చేసి పునర్వినియోగించుకోవాలి. అయితే ఇందుకు మన నీటి వ్యవస్థల నిర్వహణ ఇంజనీర్లు తమ పగటి కలలకు స్వస్తి చెప్పి వాస్తవికంగా ఆలోచించాలి. లక్ష్యాలు, వాటి సాధనా మార్గాలపై పునరాలోచన చేయాలి పథకాలను పునః రూపొందించి, పటిష్ఠంగా అమలుపరచాలి. ఏమైనా ఇది నేటి బెంగళూరు కథ. రేపు ఇదే మీ నగర కథ కూడా కావచ్చు సుమా!



■ సునీతా నారాయణ్

మట్టివాసన



మహానగరాలలోని ప్రజలకు, పరిశ్రమలకు అవసరమైన నీటిని అధునాతన ఇంజనీరింగ్ పరిష్కారాల ద్వారా సమృద్ధిగా సరఫరా చేయవచ్చన్న విధానకర్తల కలలు కరిగి పోతున్నాయి; నిర్దేశిత విధానాల కనుగుణంగా పథకాలు రూపొందించి, అమలుపరిచే ప్రభుత్వాధికారుల కృషి ఫలించడం లేదు. ఈ విపత్కర పరిస్థితికి బెంగళూరు నగరం అద్దం పడుతోంది. ఈ జల సంక్షోభానికి ఆ నగరం మొదటిదీ కాదు, చివరిదీ కాబోదు. రేపు మీ నగరమూ ఓ బెంగళూరు కావచ్చు సుమా!

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఆంధ్ర భానుడు



ఆ పుణ్యపురుషుని సేవాచరితలోని
అన్ని ఋతువులూ పోరాట వీవనలే
ఆయన చూపులన్నీ సమసమాజపు
ఛత్రములైన శుభకామనలే
ఆయన బతుకంతా సమరమే
ఆయనదో అనితరసాధ్య మహాయజ్ఞం
ఆకలిని జయించిన అవిశ్రాంత సంగ్రామంలో
ఆంధ్రత్వం ఒళ్ళంతా నింపుకొన్న యోధుడు
తన హృదిలోనే యోగాగ్నిని పుట్టించి
ప్రాణాలను హవిస్సులుగా అర్పించిన జనహిత భానుడు
ఆత్మత్యాగం చేసి అచంచల దీక్షకు బాటై
సాగిన జీమూతవాహనుడు
ప్రాయోపవేశం తపోధనమైతే భాషాప్రయుక్త
రాష్ట్రాలకు ప్రాతిపదికయైన విధాత అతడు!
మార్దవంతో పాషాణాన్ని కరిగించిన
సమధికోత్సాహ మానసియై
బాపూజీ సత్యాగ్రహ సారథియైన/ అపర శిబిచక్రవర్తి
ఆ మహనీయుడు వెల్గించిందొక అజరామర త్యాగజ్యోతి
అతడొక మానవతాజ్యోతి ధృతికతడొక చిరాకృతి
సౌహార్దం, సామరస్యం ఆయుధాలుగా ధరించి
అలుపెరుగక పోరాడిన సామాజిక సేవా విరించి
తెలుగునేలకు వెలుగుజాడలు ప్రసాదించిన
'అమర గౌరవ'సిరి/ గాంధీయిజమే చైతన్యదీపికగా
ప్రకాశించిన బ్రతుకు తపస్వి!
ధరిత్రి చరిత్రలో విశ్వమానవకేతనమై
చరిత్రకే చరితార్థుడై వినుతికెక్కిన ధన్యజీవి!!

— చిన్ని నారాయణరావు

(రేపు కీ.శే. పొట్టి శ్రీరాములు 123వ జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

వైసీపీ పాలనలో విశాఖ విలవిల!

ఒక ప్రాంతంపై అణుబాంబు వేస్తే తిరిగి యథాతథ స్థితికి రావడానికి వందేళ్లకు పైగా సమయం పడుతుంది. ప్రశాంతతకు, అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన విశాఖలో వైసీపీ నేతల ఆగడాలు అణుబాంబు కంటే అత్యంత భయంకరంగా ఉన్నాయి. ఇచ్చింది పుచ్చుకోవడం, పెట్టమన్నచోట సంతకాలు పెట్టటం లేకుంటే అన్నీ గల్లంతే.. బెదిరించడం, లొంగకుంటే కూల్చేయడం, కేసులు పెట్టడం! ఇలా ఈ అయిదేళ్లలో విలువైన భూములనే కాదు కొండలను, గుట్టలను, సముద్ర తీరాన్ని కూడా మింగేసి తీరని నష్టాన్ని ఏర్పరిచారు. ఒకవైపు కలెక్టర్ కార్యాలయం, ప్రభుత్వ కాలేజీలు, తహసీల్దారు కార్యాలయాలు తనఖా పెట్టి వందల కోట్ల రూపాయలు రుణం తీసుకుంటూ మరోవైపు భూదందాలను కొనసాగిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖ అభివృద్ధికి పలు పటిష్ఠమైన చర్యలకు శ్రీకారం చుట్టి ఆ నగరాన్ని ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు బలమైన కృషి చేశారు. నవ్యాంధ్ర ఏర్పాటు తరువాత విశాఖపై పెరిగిన ఆశలతో ఆ నగర సమగ్రాభివృద్ధిపై పూర్తి దృష్టి కేంద్రీకరించారు. పలు అంతర్జాతీయ సమావేశాలను విశాఖలో నిర్వహించి ప్రపంచ దృష్టికి వచ్చేలా చేశారు. ఈ నేపథ్యంలో కొత్త రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ప్రజలకు విశాఖ ఒక కొత్త ఆశాకిరణమైంది. దశాబ్దాలుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు ప్రజలను విశాఖవాసులు అక్కున చేర్చుకుని తమతో సమానంగా పీట వేసి అభివృద్ధిలో భాగస్వాములు చేసుకున్నారు. అది నాటి విశాఖ ఘనకీర్తి.

2019లో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక విశాఖ నుదుటి రాత పూర్తిగా మారిపోయింది. జగన్‌రెడ్డి అస్మదీయులు ఆ మహానగరంపై వాలిపోయారు. కనిపించిన భూములను, భవనాలను ఆక్రమించుకోవటం ప్రారంభించారు. చంద్రబాబు హయాంలో భారీ పెట్టుబడులు పెడతామంటూ ఉత్సాహంతో ముందుకొచ్చిన పారిశ్రామికవేత్తలు జగన్ బృందం దెబ్బతో విశాఖను వదలి పారిపోయారు. అప్పటివరకు శాంతికి ఆలవాలమైన విశాఖ మహానగరం అశాంతికి గుర్రై, అరాచకాలకు నిలయమై ఆగమాగమైపోయింది. వేలాది ఎకరాల భూమి ముఖ్యమంత్రి అస్మదీయుల వశమైంది.

జగన్ బృందం సాగించిన దోపిడీకి సజీవ తార్కాణం ఉనికిని కోల్పోయిన రుషికొండ. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉత్తరాంధ్రలో గత ఐదేళ్లలో 72 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయి, 41 వేల ఎకరాలు చేతులు మారాయి. లక్షల కోట్ల ఆస్తులు జగన్‌రెడ్డి గ్యాంగ్ లూటీ చేసింది. ఉత్తరాంధ్రకు తలమానికమైన రుషికొండను బోడిగుండు చేశారు. దసపల్లా భూముల్లో విజయసాయిరెడ్డి తన బినామీలతో రూ.5 వేల కోట్లు దోపిడీ చేశారు. రైల్వే జోన్, మెట్రో ప్రాజెక్టులు గాలికొదిలేశారు. కేంద్రం ఇవ్వాల్సిన ఉత్తరాంధ్ర నిధులపై నోరెత్తడం లేదు. భోగాపురం ఎయిర్‌పోర్టు, ట్రైబల్ యూనివర్సిటీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పేరుతో స్టీల్ ప్లాంట్ భూములు కొట్టేసేందుకు ప్రయత్నించారు. ప్రపంచాన్ని ఆకర్షించే ఐకానిక్ సచివాలయం కన్వెన్షన్ సెంటర్, స్టేడియం నిర్మిస్తానని ఉత్తరాంధ్ర ప్రజలను మాటలతో మభ్యపెట్టారు.

రూపు రేఖలు కోల్పోయి విలవిలలాడుతున్న విశాఖకు ఒక కొత్త విజన్ రూపొందిస్తానంటూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మరో నాటకానికి తెర లేపారు. అతిత్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటమిని మూటగట్టుకోవడానికి సిద్ధమైన జగన్‌రెడ్డి ఇప్పుడు విశాఖను బాగుచేస్తాడట. రెండు నెలల్లో లండన్‌కో బెంగళూరుకో పారిపోయే జగన్‌రెడ్డికి అకస్మాత్తుగా 'విశాఖ విజన్' గుర్తుకొచ్చింది. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను అమ్మేయడం, మిగిలిన భూములు అధికారపక్ష నాయకులు కబ్జా చేయడం తప్ప ఉత్తరాంధ్రకు వైసీపీ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో చెప్పగలరా. విజన్ వైజాగ్ డాక్యుమెంట్ రిలీజ్ చేసిన జగన్‌కు విశాఖ మీద అంత చిత్తశుద్ధి ఉంటే ఇన్నిరోజులు ఏం చేశారు.


సముద్ర తీరప్రాంతంలో ఎటువంటి కట్టడాలకు అనుమతి లేదు. కానీ వైసీపీ నేతలు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనలను, పర్యావరణ చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘించి ఎటువంటి అనుమతులు లేకుండా కట్టడాలను నిర్మిస్తున్నారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కుటుంబసభ్యులు భీమిలి భోగాపురం బీచ్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున కట్టడాలు నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. తర్లువాడలో సర్వే నెం.1లో రూ.300 కోట్ల విలువ చేసే వంద ఎకరాల భూమిని కూడా విజయసాయిరెడ్డి కూతురికి కట్టబెట్టేందుకు ఫైలు కదుపుతున్నారు. దసపల్లా భూములు ప్రభుత్వ భూములని చెబుతూ 2015 నుంచి 22ఏ లో పెట్టి వాటిని కాపాడుతూ అక్కడ ఎటువంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం లేదు. కానీ వైసీపీ నేతలు ఆ భూములను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. బెంగుళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలకు పోటీగా విశాఖను ఐటీ రాజధానిగా నాటి ప్రభుత్వం అభివృద్ధి చేస్తే ఇప్పుడు ఉనికి కోల్పోయే పరిస్థితి నెలకొంది.

ప్లగ్ అండ్ పే విధానంతో పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తూ నాటి ప్రభుత్వం ఐటీ పరిశ్రమలను ఆకర్షించి రూ.500కోట్ల వ్యయంతో మిలీనియం టవర్స్, మధురవాడ, రిషికొండ ప్రాంతాల్లో ఐటీ టవర్స్ ఏర్పాటు చేసింది. ఇక్కడ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ఐటీ భవనాలను 50శాతం రాయితీ ఇస్తామన్న హామీని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయలేదు. రాయితీలను ఎత్తేయడంతో పాటు ప్రోత్సాహకాలు కూడా నిలిపేశారు. మిలీనియం టవర్స్ రిషికొండ, హిల్–1, హిల్–3 వంటి భవనాల్లోని ఐటీ కంపెనీలను ఖాళీ చేయించి ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించేందుకు పావులు కదుపుతున్నారు. ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, ఫిన్‌టెక్ వ్యాలీ, ఐబీయం వంటి ప్రఖ్యాత కంపెనీలను కూడా తరిమేశారు. రైల్వే జోన్, వాల్తేరు డివిజన్, మెట్రో రైలు, గిరిజన యూనివర్సిటీ వంటి విభజన హామీలు, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు కేంద్ర నుంచి రావాల్సిన నిధులు కోసం చేసిన ప్రయత్నం ఏమిటో వైసీపీ నేతలు చెప్పగలరా?

విశాఖలోని మధురవాడ, ఆనందపురం, పద్మనాభం, సబ్బవరం, భీమిలితోపాటు పలు ప్రాంతాల్లో ఈ అయిదేళ్లలో 15 వేల ఎకరాలకు పైగా భూములు వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లాయి. కార్తీకవనం, బేపార్క్, రామానాయుడు స్టూడియో, దసపల్లా భూములు, రేడియంట్, హయగ్రీవ వంటి కుంభకోణాలు కొన్ని మాత్రమే వెలుగులోకి వచ్చాయి. బాహ్య ప్రపంచానికి తెలియని వైసీపీ నేతల భూకుంభకోణాలు కోకొల్లలు.

ఇళ్లల్లోకి వెళ్లి తాళాలు బద్దలగొట్టి భూముల పాస్ పుస్తకాలు బలవంతంగా తీసుకురావడం, రాత్రికి రాత్రి రికార్డులు మార్చడం వంటి చర్యలతో పేద, మధ్యతరగతి ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, దేవాలయాలు, చర్చిల భూములు కూడా పెద్ద ఎత్తున అన్యాక్రాంతమయ్యాయి. ఇక్కడ వైసీపీ నాయకులు దందాలకు, అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజాలే. పరిపాలనా రాజధాని పేరుతో విశాఖలో వైసీపీ నేతలు పాగా వేసి నేర సంస్కృతిని పెంచి పోషిస్తూ నగర ప్రతిష్ఠకు మచ్చ తీసుకొస్తున్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం మత్తులో హత్యలు, దాడులు, రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ పరిస్థితుల్లో దోవ చూసేవారికి కాకుండా దోచుకునే వారికి అధికారం దక్కితే ఉత్తరాంధ్ర భవిష్యత్ అంధకారం అవుతుంది.

రూపు రేఖలు కోల్పోయి వికృతమైన విశాఖకు ఒక కొత్త విజన్ రూపొందిస్తానంటూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మరో నాటకానికి తెర లేపారు. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను అమ్మేయడం, మిగిలిన భూములు అధికారపక్ష నాయకులు కబ్జా చేయడం తప్ప ఉత్తరాంధ్రకు వైసీపీ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో చెప్పగలరా.



• గంటా శ్రీనివాసరావు
మాజీ మంత్రి





ఇంటర్

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు

- విద్యార్థులతో పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ కిటకిట
- 15 స్పెషల్స్ నడిపిన ఆర్టీసీ..
- నేటితో ముగియనున్న సెకండ్ ఇంటర్ పరీక్షలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ముగియటం, కళాశాలలకు అవుటింగ్ ప్రకటించడం ఒకేసారి జరగటంతో.. పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ గురువారం విద్యార్థులతో కిటకిటలాడాయి. షెడ్యూల్ బస్సులన్నీ నిండిపోవటంతో పాటు ప్రత్యేక బస్సులు నడపాల్సి వచ్చింది. విజయవాడ నుంచి రాయలసీమకు అదనంగా పది ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడపాల్సి వచ్చింది. వీటితో పాటు రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం వైపు కూడా అదనంగా ఐదు స్పెషల్ బస్సులను ప్రవేశపెట్టారు. గురువారం సాయంత్రం నాటికి 15 స్పెషల్ బస్సులు నడిపారు. తల్లిదండ్రులు వచ్చి విద్యార్థులను తీసుకెళ్తున్నారు. శుక్రవారం సెకండ్ ఇయర్ ఇంటర్ పరీక్షలు కూడా ముగియనున్నాయి. దీంతో పెద్దఎత్తున విద్యార్థులు తమ సొంత ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉంది. శుక్రవారం బస్సులు నడపటానికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు వేస్తున్నారు. రైళ్లు కూడా సాధారణం కంటే రద్దీగా నడిచాయి.

ఆటో.. ఇటో అయితే..



ఆటో నిండా కుక్కికుక్కి.. ఖాళీ లేక వెనుక కూడా ఒకరి ఒళ్లో ఒకరిని కూర్చోబెట్టి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ఈ ఆటో గురువారం నగరంలోని బందరు రోడ్డులో కనిపించింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో సాధారణ ప్రయాణమే ప్రమాదకరంగా ఉంటుంది. అలాంటిది గాల్లో తేలుతున్నట్టుగా విద్యార్థులను కూర్చోబెట్టి నడుపుతున్న ఈ ఆటోవాలాపై అటుగా వెళ్లేవారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాణ్యతలేని హెల్మెట్ల నిషేధం

- బీఐఎస్ హాల్‌మార్కులేని హెల్మెట్లు విక్రయిస్తే చర్యలు
- జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో నిర్ణయం

- 6లో..



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం): 6-19 (శుక్ర)
సహర్ (ఉదయం): 5-04 (శని)



మల్లవల్లిలో పేదలకు పంచాలనుకుంటున్న భూమి ఇదే..

ఉత్తుత్తి పట్టాలు

బాపులపాడులో పేదలకు ఇళ్ల పట్టాల పేరిట వైసీపీ మాయ

రెవెన్యూ అధికారుల సహకారంతో ఎన్నికల డ్రామా
బదిలీ అయినా రిమోట్ తిప్పుతున్న తహసీల్దార్
బాపులపాడులో స్థలాలు సేకరించకుండానే హడావిడి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/హనుమాన్ జంక్షన్ రూరల్) : రెవెన్యూ శాఖను పావుగా చేసుకుని అధికార వైసీపీ ఓట్ల డ్రామాకు తెర లేపింది. భూమి లేకుండానే ఇళ్ల పట్టాల పేరుతో బాపులపాడులో మళ్లీ రాజకీయం చేస్తోంది. ఇందుకోసం ఉత్తుత్తి ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ప్రజలకు ఆవాసయోగ్యం కాని స్థలాలు, కోర్టు వివాదాల్లో ఉన్నవి, మరొకరి ఆధీనంలోనివి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గన్నవరం, బాపులపాడులో జాయింట్ తహసీల్దార్‌గా పనిచేసిన అధికారి ఒకరు అధికార పార్టీపై స్వామిభక్తి చాటుతున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన ఏలూరు జిల్లాకు వెళ్లినా.. బాపులపాడు మండల కార్యాలయంలోనే చక్రం తిప్పుతున్నారు. ఈ కార్యాలయంలోని వీఆర్వోలు, ఆర్ఐలతో తనకున్న సంబంధాల కారణంగా అన్ని పనులు చక్కబెడుతున్నారు. ఈ ఇళ్ల పట్టాల వ్యవహారాన్ని కూడా ఆయనే పర్యవేక్షిస్తున్నారు. కోడ్ కూస్తుందేమోనని హడావిడిగా బాపులపాడు మండలంలో అనేక చోట్ల పట్టాలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఉత్తుత్తి స్థలాలే..

కిందటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మల్లవల్లి గ్రామంలో మోడల్ ఇండస్ట్రియల్ పార్క్, మెగా ఫుడ్‌పార్కుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం 1,200 ఎకరాలు కేటాయించారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం, పంచాయతీ కామన్ అవసరాల కోసం ఇదే పారిశ్రామికవాడ సమీపంలో 100 ఎకరాలు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల్లో పేదలకు నివేశన స్థలాలు ఇవ్వకుండా మైనింగ్ దోపిడీకి పాల్పడింది. దాదాపు 80 ఎకరాల్లో అక్రమ మైనింగ్ చేపట్టారు. భారీ ఎత్తున తవ్వేసిన చోట ఇప్పుడు ఇళ్ల పట్టాల కథ అల్లారు. అక్రమ మైనింగ్ జరిపిన 80 ఎకరాలు పోనూ మిగిలిన 20 ఎకరాలు గుట్టలు, గోతులతో స్థలాలకు అనుకూలంగా లేదు. ఇప్పుడు ఈ భూమిలో పట్టాలిస్తామని హడావిడి చేస్తున్నారు. ఓట్ల గేలం కోసం పెద్దసంఖ్యలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2,500 మందికి ఇక్కడ నివేశన స్థలాలు ఇస్తున్నామన్న స్కెచ్ వేశారు. ఇక్కడి నుంచి వెళ్లిపోయిన తహసీల్దార్ స్థానిక వీఆర్వోలు, ఆర్ఐలను రంగంలోకి దించి పనులు పురమాయించటం విశేషం. మల్లవల్లి పారిశ్రామికవాడలోని ఇదే స్థలాన్ని చూపించి సమీపంలోని ఓగిరాల పంచాయతీకి చెందిన 86 మందికి, రంగన్నగూడెం పంచాయతీకి చెందిన 147 మందికి పట్టాలు ఇవ్వడానికి సిద్ధం చేశారు. పది అడుగుల గోతుల భూముల్లో ఇళ్ల పట్టాల పేరుతో ఓట్ల డ్రామాను రక్తి కట్టిస్తున్నారు. వీటితో పాటు మండలంలోని బిళ్లనపల్లి, కొత్తపల్లిలో కూడా 239 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నారు. ఇక్కడ కూడా భూములు అందుబాటులో లేవు. ఇతర రైతుల ఆధీనంలో ఉన్న బంజరు భూముల్లో ఇళ్ల పట్టాల డ్రామాను తెరపైకి తెచ్చారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవటం కుదరదు, న్యాయ వివాదాలు తలెత్తుతాయి. అయినా ఇళ్ల పట్టాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇక ఓగిరాల గ్రామంలో స్థలం లేకుండానే పట్టాలు ఇవ్వడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెం శివారు సింగన్నగూడేనికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోతుల చెరువును ఇళ్ల పట్టాల కోసం ప్రతిపాదించారు. నీటిపారుదల శాఖ పరిధిలోని ఈ చెరువు ఇళ్ల స్థలాలకు పనికిరాదని, తమకు ఆమోదయోగ్యం కాదని చెరువు ఆయకట్టు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు స్టే విధించింది. దీంతో పట్టాల పంపిణీకి బ్రేక్ పడింది.



కన్నీరు పెడుతున్న బోడె ప్రసాద్

ఇండిపెండెంట్‌గానైనా బరిలో ఉంటా!

- సీటు గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇస్తా..
- ఓడిపోయినప్పుడూ ఇంత ఆవేదన చెందలేదు
- తీవ్ర మనస్తాపానికి గురైన బోడె ప్రసాద్
- పెనమలూరు టికెట్ లేదని కార్యకర్తల ఆవేదన
- బోడెకు సీటు కేటాయించాలంటూ నినాదాలు
- ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఇద్దరు కార్యకర్తలు

- 6లో..

కొండంత పెండింగ్..!

దుర్గగుడిలో కమీషన్ ఇస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కమీషన్ల రాజ్యం నడుస్తోంది. సరుకుల సరఫరా, నిర్మాణ పనుల టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టేస్తూ ఎవరు కమీషన్ ముట్టజెబితే వారికే చెల్లిస్తున్నారు. బిల్లులను 45 రోజుల్లో చెల్లించాలని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నా దుర్గగుడి అధికారులు బేఖాతరు చేస్తున్నారు.

- రూ.కోట్లలో పేరుకుపోతున్న బకాయిలు
- మంత్రి, దేవదాయ కమిషనర్ ఆదేశాలు బేఖాతరు
- 45 రోజుల్లో చెల్లింపులు చేయాలని ఉత్తర్వులు
- వాటిని కాదని.. నెలలు తరబడి పెండింగ్

లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు విషయమై దేవదాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఆ శాఖ కమిషనర్ పది రోజుల క్రితం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బిల్లుల చెల్లింపు విషయంలో రాష్ట్రంలో అన్ని దేవాలయ కార్యనిర్వహణాధికారులకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో పలు మార్గదర్శకాలు పేర్కొన్నారు. కాంట్రాక్టర్లను కొత్తగా ఆదాయపు పన్ను చట్టంలోకి తీసుకురావడం కోసం మూడు కేటగిరీలుగా విభజించారు. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)గా నమోదైన లేదా రిజిస్టర్ అయిన వ్యాపార సంస్థల నుంచి కొనుగోలు చేస్తే.. సదరు బిల్లులను 45 రోజుల్లో లేదా అగ్రిమెంట్ కాలంలోగా ఏది ముందయితే దాని ప్రకారం డబ్బు చెల్లించాలని సూచించారు. పెండింగ్ పెడితే కొనుగోలు చెల్లింపును ఖర్చుగా పరిగణించరని తెలిపారు. పైగా పెండింగ్ మొత్తాన్ని దేవాలయ ఆదాయానికి కలిపి దానికి కూడా పన్ను వేస్తారని స్పష్టం చేశారు. దీంతో పాటు దేవాలయాలకు వర్తించే ఆదాయపు పన్ను మినహాయింపును కూడా కోల్పోతామని పేర్కొన్నారు. కానీ, ఈ ఆదేశాలను ఎవ్వరూ అమలు చేయడం లేదు. ముఖ్యంగా దుర్గగుడిలో ఈ ఉత్తర్వులను తుంగలో తొక్కారు.

దుర్గగుడిలో పరిస్థితి ఇదీ..

దుర్గగుడిలో సరుకుల సరఫరా, అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు సంబంధిత విభాగాల అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల సుమారు రూ.10 కోట్ల పైచిలుకు బకాయిలు పేరుకుపోయాయి. ఇటీవల దేవస్థానంలో సరుకులు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ఆరు నెలల నుంచి సుమారు రూ.5 కోట్ల బకాయి పెట్టారు. గత ఏడాది బందరురోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రభుత్వం నిర్వహించిన యాగానికి వస్తువులు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు ఈ ఏడాది జనవరి వరకు కూడా బకాయిలు చెల్లించలేదు. ఈ విషయాన్ని పలువురు కాంట్రాక్టర్లు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి సంబంధిత విభాగ అధికారులను ప్రశ్నించి వెంటనే బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఓ విభాగంలో మహిళా అధికారిణి సుమారు రూ.5 కోట్ల వరకు బిల్లులను పెండింగ్‌లో పెట్టారు. ఈ సమస్యను మాజీ ఈవో భ్రమరాంబ దృష్టికి ఆ కాంట్రాక్టర్ తీసుకెళ్లగా, ఆమె ఆ అధికారిణి తన చాంబరుకు పిలిపించుకుని బిల్లులు ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ మందలించారు. దీంతో అప్పటికప్పుడు ఆ అధికారిణి సుమారు రూ.కోటిన్నరకుపైగా బిల్లులను చెల్లించారు. మిగిలిన బిల్లులను యథాప్రకారం పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుత ఈవో కేఎస్ రామారావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన నాలుగు రోజుల క్రితం ఆ మహిళా అధికారిణి బిల్లుల చెల్లింపులో జాప్యంపై వివరణ అడిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మహిళా అధికారిణి హడావుడిగా మరో రెండు కోట్ల రూపాయల బిల్లులను చెల్లించారు. కేవలం కాసుల కోసం కక్కుర్తిపడి బిల్లులను పెండింగ్‌లో పెడుతుండటంతో కొత్తగా టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ఇష్టపడట్లేదు. పాత కాంట్రాక్టర్లకు కొమ్ము కాసేందుకు కొన్ని విభాగాల అధికారులు బిల్లులు పెండింగ్ మంత్రాన్ని పఠిస్తుండటం గమనార్హం.

నాడు తప్పు.. నేడు ఒప్పా..

నందిగామ రామలింగేశ్వరస్వామి ఆలయ వివాదంలో మరో కోణం

- పారువేట మండప స్థల వివాదంలో రూటు మార్చిన దేవదాయ శాఖ
- శాశ్వత నిర్మాణాలు తప్పంటూ నాడు ఈవో సస్పెన్షన్
- అవే ఒప్పంటూ నేడు రహస్యంగా ఉత్తర్వులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

నందిగామ, మార్చి 14 : దేవదాయ శాఖ ధర్మం తప్పిందా..? నిన్న తప్పుగా భావించిన అంశం నేడు ఒప్పు ఎలా అయ్యింది. ఆలయాలకు, భక్తులకు జవాబుదారీగా ఉండాల్సిన ఉన్నతాధికారులు కాలానికి అనుగుణంగా నిర్ణయాలు మార్చుకోవచ్చా..? ఇదీ ప్రస్తుతం నందిగామలోని భక్తుల మదిలో మెదులుతున్న ప్రశ్నలు.

నందిగామ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన పారువేట మండపం వద్ద సర్వే నెంబర్‌లో 665లోని ఆరు సెంట్ల భూమికి గతంలో అధికారులు లీజు వేలం నిర్వహించారు. లీజుకు తీసుకున్న వారు శాశ్వత నిర్మాణం చేపట్టకూడదని పేర్కొన్నారు. తాత్కాలిక నిర్మాణం మాత్రమే చేపట్టాలన్నారు. ఆరు సెంట్లకు గాను రూ.96 వేలు అద్దె చెల్లించేలా పట్టణానికి చెందిన అన్నే నాగేంద్రకుమార్ అనే వ్యక్తి పాట దక్కించుకున్నాడు. ఇంతవరకు బాగానే ఉంది. దేవదాయ శాఖలోని కొందరి అధికారుల అండతో వేలం దక్కించుకున్న వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా శాశ్వత నిర్మాణం చేపట్టాడు. మునిసిపల్ అనుమతులు కూడా లేకుండానే సదరు వ్యక్తి ఆ నిర్మాణం చేపట్టాడు. అదనంగా మరో రెండు అంతస్తులు నిర్మించడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. ఏటా రామలింగేశ్వరస్వామి కల్యాణం జరిగిన మరుసటి రోజు స్వామివారు, అమ్మవారు ఊరేగింపుగా పారువేట మండపానికి వస్తారు. అక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి. అయితే, సదరు మండప స్థలాన్ని అధికారులు అనాలోచితంగా లీజుకు ఇవ్వడం వల్ల ఇప్పుడు ఆ క్రతువులు నిర్వహించడం కష్టంగా మారింది. పైగా అదనపు అంతస్తులు నిర్మించడానికి సిద్ధంకావడంపై భక్తులు మండిపడుతున్నారు. స్వామివారి కంటే ఎత్తులో ప్రజలు సంచరించడం సరికాదంటున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వరుస కథనాలతో స్పందించిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సదరు భవనాన్ని సందర్శించి శాశ్వత నిర్మాణంపై మండిపడ్డారు. ఆమె కమిషనర్‌కు నివేదిక అందించారు. నివేదిక అందుకున్న ఉన్నతాధికారులు ఆలయ ఈవో సుబ్రహ్మణ్యాన్ని సస్పెండ్ చేశారు. నిర్మాణాన్ని నిలిపివేయాలని లీజుదారుడికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో లీజుదారుడు హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన కోర్టు ఈ విషయంపై నిర్ణయాధికారాన్ని కమిషనర్‌కు ఇస్తూ తీర్పు వెలువరించింది. సుదీర్ఘకాలం దీనిపై నిర్ణయం తీసుకోని కమిషనర్ ఇటీవల నిర్మాణం కొనసాగించుకోవచ్చని లీజుదారుడికి అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణం తప్పు అంటూ ఈవోను సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులకు.. నేడు అదే నిర్మాణం ఎలా ఒప్పుగా మారిందని భక్తులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు లీజుదారుడికి అనుమతి ఇచ్చిన విషయాన్ని ఆ శాఖ గోప్యంగా ఉంచింది. ఇప్పటికీ కమిషనర్ ఆదేశాల ప్రతులను బయట పెట్టేందుకు ఈవో ఆసక్తి చూపడం లేదు. కమిషనర్ ఆదేశాలతో గురువారం అధికారుల సమక్షంలో లీజుదారుడు షాపులను ప్రారంభించాడు.



కమిషనర్ జారీచేసిన అనుమతి పత్రాన్ని లీజుదారుడికి అందిస్తున్న ఆలయ అధికారులు

లారీ ఢీకొని టీచర్ మృతి ఎయిర్‌పోర్టు మెయిన్ గేటు వద్ద దుర్ఘటన

కీచక తండ్రి అరెస్టు కుమార్తెపై లైంగికదాడి కేసులో..

- 6లో..



ఎంపీ కనకమేడల దంపతులకు వేదాశీర్వచనం చేస్తున్న పండితులు

తిరుపతమ్మను దర్శించుకున్న ఎంపీ కనకమేడల దంపతులు

పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేట, మార్చి 14 : రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్ సతీసమేతంగా గురువారం పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, గోపయ్య స్వామివార్లను దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, అధికారులు వారికి స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను, వేదాశ్వీరచనం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, శ్రీరాం సాయిప్రసాద్, రేపాల మోహనరావు, తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం తథ్యం

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమని కనక మేడల రవీంద్రకుమార్ చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాలపై దాడులు పెరిగిపోయాయని, తెనాలికి చెందిన గీతాంజలి మృతికి అధికార పార్టీయే కారణమన్నారు. ప్రతిపక్ష పార్టీలపై దుష్ప్రచారం చేసేందు కు గీతాంజలి ఆత్మహత్యను రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో పొత్తు అని, వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం అంటున్నారని చెప్పారు.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నిరసన ప్రదర్శన

గౌతమ్‌సవాంగ్‌ను సస్పెండ్ చేయాలి

- తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ధర్నా

మచిలీపట్నం టౌన్, మార్చి 14 : నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న ఏపీపీఎస్సీ చైర్మన్‌గా పనిచేసిన గౌతమ్‌సవాంగ్, కార్యదర్శిగా పనిచేసిన ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులును సస్పెండ్ చేయాలని, వీరిపై కేసులు నమోదు చేసి సీబీఐతో విచారణ జరిపించాలంటూ మచిలీపట్నం బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుయువత, తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఎండీ సలీం, డొక్కు సాయికృష్ణ, చిన్నం సురేశ్, పిన్నెంటి అయ్యప్ప, కట్టాదుర్గా, మణికుమార్, రవితేజ, నాగసాయి, నికిలేశ్, వెంకటరమణ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. నిరుద్యోగులను మోసగించిన సీఎం జగన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మట్టికరిపించాలని వారు డిమాండ్ చేశారు.

ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించిన జగన్ : దేవినేని ఉమా

గొల్లపూడి : ఏపీపీఎస్సీని సీఎం జగన్ భ్రష్టు పట్టించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థల విధ్వంసానికి ఏపీపీఎస్సీ బలయ్యిందన్నారు. రాజకీయ లబ్ధికి, అక్రమాలకు వేదికగా చేసి జగన్ లక్షలమంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారని మండిపడ్డారు. తమ వారిని పోస్టింగుల్లో కూర్చోబెట్టుకునేందుకు గ్రూప్-1 పోస్టులను అమ్ముకుని అర్హులకు అన్యాయం చేశారన్నారు. అక్రమాల వెనుక ఉన్న సర్వీస్ కమిషన్ పెద్దల పాత్ర నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత పరీక్షల నిర్వహణ విఫలం కావడం ఇదే తొలిసారి అన్నారు. హైకోర్టు తీర్పు వైసీపీ ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి : యార్లగడ్డ

గన్నవరం : ఏపీపీఎస్సీ పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడిన అధికారులను కఠినంగా శిక్షించాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్ష మూల్యాంకనంలో వైసీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. పరీక్ష పత్రాల మూల్యాంకనం మాన్యువల్‌గా చేయాల్సి ఉండగా వైసీపీ ప్రభుత్వం డిజిటల్ పద్ధతిలో నిర్వహించి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. ప్రభుత్వ అవినీతి కారణంగా 162 మంది డీఎస్పీలు, డిప్యూటీ కలెక్టర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ధ్వజమెత్తారు. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎం రాజీనామా చేయాలి : తాతయ్య

జగ్గయ్యపేట : మెయిన్స్‌లో అక్రమాలపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని, డిప్యూటి కలెక్టర్లు, డీఎస్పీ పోస్టులను అమ్ముకున్న సీఎం జగన్‌రెడ్డి రాజీనామా చేయాలని జాతీయ తెలుగుదేశం కోశాధికారి, జగ్గయ్యపేట టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్య డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, గ్రూప్-1 మెయిన్స్‌లో ప్రభుత్వ అక్రమాలపై హైకోర్టు తీర్పు చెంపపెట్టని అన్నారు. ఇదేనా జాబ్ కేలెండర్, ఇదేనా నియమించే విధానమని తాతయ్య ప్రశ్నించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, ఇర్రి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మరోసారి మోసగించేందుకే డ్రామాలు

- కొడాలి నానిపై వెనిగండ్ల ధ్వజం



గుడివాడ, మార్చి 14 : ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసే దళిత సోదరులను మరోమారు మోసం చేసేందుకు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేసాడని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెనిగండ్ల మాట్లాడుతూ, గుడివాడను అన్నివిధాలుగా నాశనం చేసి, అభివృద్ధికి ఆమడదూరంలో నిలిపిన వ్యక్తిగా నాని చరిత్రలో నిలిచిపోయాడన్నారు. నియోజకవర్గ ప్రజలు నమ్మే స్థితిలో లేకపోవడంతో కొత్తగా విగ్రహ డ్రామాలు ప్రారంభించాడన్నారు. గుడివాడ నడిబొడ్డున అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని తాను హామీ యిచ్చాక నానిలో చలనం కలిగిందన్నారు. ఎన్నికల కోడ్ రానున్న సమయంలో హుటాహుటిన విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశాడన్నారు. దళిత సోదరులు విగ్రహ ఏర్పాటుకు అనుమతుల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరుగుతుంటే కోడ్ సమయంలో భూమిపూజ చేయడం దళిత సంఘాలను మోసం చేయడమేనన్నారు. ఇచ్చిన హామీ మేరకు విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభిస్తానని వెనిగండ్ల స్పష్టం చేశారు.

అభ్యర్థులు ఎన్నికల ఖర్చుపై అవగాహన కలిగి ఉండాలి

- కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికలలో అభ్యర్థులు, వారి ప్రతినిధులు ఎన్నికల ఖర్చుపై కనీస అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ కృష్ణాజిల్లా పి.రాజాబాబు అన్నారు కలెక్టర్ కార్యాలయంలో గురువారం పలు రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఓటర్ల జాబితాలలో చేర్పులు తప్ప, మార్పులు చేయడానికి అవకాశం ఉండదన్నారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు నిర్వహించే సమావేశాలు, ర్యాలీలు, వస్తు సామాగ్రి కొనుగోలుకు సంబంధించిన అన్నింటినీ లెక్కలోకి తీసుకుంటామన్నారు. పత్రికలు, టీవీ ఛానల్, సోషల్ మీడియా, ఫ్లెక్సీలకు, హోర్డింగ్‌లు, కరపత్రాలు తదితరాల ఖర్చులన్నీ లెక్కించబడతాయన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, పౌరసంబంధాల డీడీ వెంకటేశ్వరప్రసాద్, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ భర్త దుర్భాష.. మునిసిపల్ చైర్మన్ మనస్తాపం

జగ్గయ్యపేట, మార్చి 14 : జగ్గయ్యపేటలో ఊరచెరువు సుందరీకరణ పనుల ప్రారంభోత్సవంలో బలహీనవర్గాలకు చెందిన మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రపై కౌన్సిలర్ భర్త దుర్భాషలాడటం వైసీపీలో కలకలం రేపింది. బుధవారం రాత్రి పట్టణంలో ఊరచెరువు సుందరీకరణ పనుల ప్రారంభోత్సవం ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, అల్ట్రాటెక్ కంపెని ప్రతినిధులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమానికి తనకు ఆహ్వానం లేదని ఆ ప్రాంతానికి చెందిన మహిళా కౌన్సిలర్ భర్త ఉదయభాను సమక్షంలోనే చైర్మన్‌ను దుర్భాషలాడాడు. దాంతో పార్టీ వర్గాలు విస్మయానికి గురయ్యాయి. పార్టీ నేతలు, ఉదయభాను వారించకపోవటంతో చైర్మన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. గురువారం ఆయన మునిసిపల్ కార్యాలయానికి రాలేదు. ఎవరు ఫోన్‌లను ఎత్తలేదు. ఊరచెరువు పనులు చేసిన కాంట్రాక్టర్ల మధ్య వ్యక్తిగత వివాదాలు, రియల్ ఎస్టేట్ వివాదాలు చైర్మన్ మీదకు మళ్లాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నకిలీ పట్టాల పంపిణీపై విచారణ జరిపించండి

- ఎన్నికల కమిషన్ సీఈవోకు రవీంద్ర పిర్యాదు

మచిలీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ఓట్లు వేయించుకునేందుకు ఎమ్మెల్యే పేర్నినాని ఓటర్లకు ఇంటిపట్టాలు ఇచ్చి ప్రలోభపెడుతున్నారని, ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణచేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీమంత్రి కొల్లు రవీంద్ర ఎన్నికల కమిషన్ సీఈవో ముకేష్‌కుమార్ మీనాకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ఇటీవల కాలంలో నియోజకవర్గంలో రహదారుల పక్కన నివాసముంటున్న వారికి ఎమ్మెల్యే పేర్నినాని, ఆయన కుమారుడు పేర్నికిట్టు ఇంటిపట్టాలను పంపిణీ చేశారని తెలిపారు. ఆ పట్టాలపై అధికారుల ఫోర్జరీ సంతకాలు ఉంటున్నాయని ఆరోపించారు. పట్టాల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం లేదన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా చేయగా తహసీల్దార్ కార్యాలయముద్ర లేని పట్టాలు చెల్లవని డెప్యూటీ తహసీల్దార్ స్వయంగా చెప్పారని అన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని సీఈవో హామీ ఇచ్చారని కొల్లు తెలిపారు. రవీంద్ర వెంట టీడీపీ నాయకులు, ఐ దిలీప్‌కుమార్, పిప్పళ్ల కాంతారావు ఉన్నారు.



ఎన్నికల కమిషన్ సీఈవో ముకేష్‌కుమార్ మీనాకు అర్జీ అందజేస్తున్న రవీంద్ర, టీడీపీ నాయకులు

ఫిర్యాదులు చేసినా ఆగని ఇళ్ల పట్టాల పంపిణీ..

నియోజకవర్గంలో వైసీపీకి ఓట్లు రాబట్టుకునేందుకు ఇంటిపట్టాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశారు. దొంగ పట్టాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా.. మునిసిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి ద్వారా ఆయా డివిజన్‌లలోని సచివాలయాల్లో సిబ్బందితో గుట్టు చప్పుడుకాకుండా గురువారం కూడా పంపిణీ చేయించడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఈబీసీ నేస్తం రూ.28.29 కోట్లు విడుదల

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 14 : ఎన్టీఆర్ జిల్లాలో 18861 అగ్రవర్ణ పేద మహిళలకు రూ.28.29 కోట్ల లబ్ధి చేకూరుస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ముఖ్యమంత్రి గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా మహిళలకు ఆర్థిక సహాయాన్ని



వైఎస్సార్ ఈబీసీ నేస్తం చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

బ్యాంకులకు నేరుగా జమచేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి కలెక్టర్, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు ఆర్థిక సహాయపు చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం జగన్మోహనరెడ్డి అగ్రవర్ణాలలోని నిరుపేదలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడేళ్ల పాటు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. మూడో విడతగా జిల్లాలో 18861 మంది మహిళలకు రూ.28.29 కోట్ల లబ్ధిని చేకూరిందన్నారు. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్‌లు, ఏపీఐడీసీ చైర్మన్ బండి పుణ్యశీల, వక్ఫ్ బోర్డు అధ్యక్షులు గౌస్ మొహిద్దీన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో రూ.14.90 కోట్లు లబ్ధి

మచిలీపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా లబ్ధిదారులు ఆర్థికంగా కొంతమేర నిలదొక్కుకోవాలని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి జేసీ, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి,



ఈబీసీ నేస్తం చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జేసీ

ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు కాకుండా మిగిలిన అన్ని సామాజిక వర్గాలలో ఆర్థికంగా వెనకబడిన వారికి ఈబీసీ నేస్తం ద్వారా లబ్ధిచేకూర్చడం జరుగుతోందన్నారు. జిల్లాలో 9938మందికి రూ. 14.90 కోట్లను జమ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 21725మందికి రూ.32.58కోట్లను జమచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌జిల్లా రిటర్నింగ్ అధికారుల నియామకం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్‌జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ ఢిల్లీరావును నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. రానున్న ఎన్నికలను ఎన్టీఆర్ జిల్లా పరిధిలో కలెక్టర్ ఢిల్లీరావు పర్యవేక్షిస్తారు. సహాయ రిటర్నింగ్ అధికారులుగా తిరువూరు నియోజకవర్గానికి ఆర్డీవో కె.మాధవి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, సెంట్రల్ నియోజకవర్గానికి మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, తూర్పు నియోజకవర్గానికి సబ్ కలెక్టర్ భవానీ శంకర్, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి జేసీ పి.సంపత్‌కుమార్, నందిగామకు ఆర్డీవో రవీంద్ర, జగ్గయ్యపేటకు డీఎం సివిల్ సప్లయిస్ ఎం.వెంకటేశ్వర్లును నియమించారు.

రంగా విగ్రహ ఏర్పాటుపై వివాదం

- అడ్డుకున్న వైసీపీ కీలక నేత, కార్పొరేటర్

విశాఖపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ తొమ్మిదోవార్డు పరిధిలో వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటు అంశం వైసీపీ నేతల మధ్య వివాదానికి దారితీసింది. శ్రీకృష్ణదేవరాయ సంఘం ఆధ్వర్యంలో ఆరిలోవలోని పెదగదిలి వద్ద వంగవీటి రంగా విగ్రహం ఏర్పాటుచేయాలని భావించారు. అందుకోసం వైసీపీకి చెందిన తొమ్మిదో వార్డు కార్పొరేటర్ కోరుకొంట వెంకటరత్నస్వాతిని సంప్రదించగా ఆమె పెదగదిలి కూడలి వద్ద విగ్రహ ఏర్పాటుకు అనుకూలమని గుర్తించారు. దానికోసం ఏర్పాట్లు చేస్తుండగా వైసీపీ కీలక నేత, పొరుగు వార్డుకు చెందిన కార్పొరేటర్ స్థానికులను పంపి విగ్రహం ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడకు సమీపంలోని సంజీవ్‌నగర్ వద్ద బీఆర్‌టీఎస్ గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటుచేయాలని ఈ మేరకు జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే సదరు వైసీపీ నేత, కార్పొరేటర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫోన్‌చేసి విగ్రహం ఏర్పాటుచేయడానికి అనుమతిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం రాత్రి అక్కడకు చేరుకుని విగ్రహం ఏర్పాటుచేయకుండా వార్డు సచివాలయం సిబ్బందిని కాపలాగా ఉంచారు. గురువారం ఉదయం విగ్రహాన్ని టౌన్‌ప్లానింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనంలోకి క్రేన్ సహాయంతో ఎక్కించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి తీసుకువెళ్లిపోయారు. తర్వాత ఏమైందోగానీ విగ్రహాన్ని తీసుకువెళ్లి సంజీవ్‌నగర్‌లో గ్రీన్‌బెల్ట్‌లో దింపేశారు. విగ్రహం ఏర్పాటుచేయవద్దని తొమ్మిదో వార్డు కార్పొరేటర్‌కు చెప్పినట్టు సమాచారం. ఏదిఏమైనా వంగవీటి రంగా విగ్రహం ఏర్పాటు అంశం తూర్పునియోజకవర్గంలోని వైసీపీ నేతల మధ్య వివాదానికి దారితీసినట్టయింది.



వంగవీటి రంగా విగ్రహాన్ని వ్యాన్‌లో తీసుకు వెళుతున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

నాణ్యతలేని హెల్మెట్ల నిషేధం

- జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం
- హెల్మెట్ల విక్రయదారులపై చర్యలు
- బ్లాక్ స్పాట్స్‌పై దృష్టి సారించాలి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బీఐఎస్ హాల్ మార్క్ లేని హెల్మెట్లపై జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. నగరంలో, జిల్లా వ్యాప్తంగా ఇకపై బీఐఎస్ హాల్ మార్క్ హెల్మెట్లనే వినియోగించేలా తప్పనిసరి చేయాలని భావిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం కలెక్టర్ అధ్యక్షతన వర్చువల్‌గా ఎన్టీఆర్ జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాల్లో ప్రధానంగా హెల్మెట్లపై చర్చ జరిగింది. హెల్మెట్లు ఉన్నా రోడ్డు ప్రమాదాలలో మరణిస్తుండటంపై చర్చ సాగింది. నాణ్యతలేని హెల్మెట్ల వినియోగం కారణంగానే మరణాలు సంభవిస్తున్నాయని రవాణాశాఖ, పోలీసు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. ఇకపై నగరంలోనూ, జిల్లా వ్యాప్తంగా బీఐఎస్ హాల్‌మార్క్ కలిగిన హెల్మెట్లను విక్రయించాల్సిందేనన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా రవాణా, పోలీసు శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో 373 మరణాలు

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 2023 ఆర్థిక సంవత్సరంలో 373 మరణాలు చోటు చేసుకున్నట్టు జిల్లా ఉపరవాణా కమిషనర్ (డీటీసీ) ఎం పురేంద్ర పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లావ్యాప్తంగా 2023 ఆర్థిక సంవత్సరంలో 1522 ప్రమాదాలు జరగ్గా.. 373 మంది మరణించారని తెలిపారు.

బ్లాక్‌స్పాట్స్‌పై ఆందోళన

జిల్లావ్యాప్తంగా 2022లో111 బ్లాక్ స్పాట్స్ ఉన్నట్టు గుర్తించారు. దీనికి అనుగణంగా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది బ్లాక్ స్పాట్స్‌పై ఎలాంటి నివేదికను తయారు చేయలేదు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రమాదాలను అరికట్టాలంటే బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించగలిగితేనే సాధ్యమని చెప్పారు. గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సైన్‌బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు, రంబల్ స్ట్రిక్కర్స్ వంటివి ఏర్పాటు చేయాలన్నారు.

హిట్ అండ్ రన్ క్లెయిమ్‌ల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు

ప్రమాదం చేసిన వాహనాల ఆచూకీ లభించని సందర్భాలలో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి క్షతగాత్రులు, మృతుల కుటుంబసభ్యులకు పరిహారం అందించేందుకు వీలుగా ఎన్టీఆర్ జిల్లా హిట్ అండ్ రన్ క్లెయిమ్స్ పరిష్కార కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేశారు. దీనికి అధ్యక్షుడిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. కమిటీలో పోలీసు కమిషనర్, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, ఆర్టీవోలు, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ స్టాఫ్, డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, వీహెచ్ఈఈడీయూ లు సభ్యులుగా ఉంటారు. ప్రమాద నివేదిక, పోస్టుమార్టం నివేదిక, ఇతర పత్రాలను పరిశీలించిన మీదట సెటిల్మెంట్ చేస్తారు. ప్రమాదాలు జరిగిన సందర్భాలలో బాధితులకు పరిహారం చెల్లించే విషయంలో పాత సొలాషియం స్కీమ్ స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన హిట్ అండ్ రన్ స్కీమ్-2022 ద్వారా పరిహారం పెరిగింది. పరిహారం క్లెయిమ్ చేసుకోవటానికి వీలుగా దరఖాస్తు చేసుకునే ప్రక్రియను కూడా సులభతరం చేయటానికి వీలుగా ఒక కమిటీని వేశారు.

ముగిసిన జాతీయ సదస్సు

విజయవాడ కల్చరల్, మార్చి 14: తెలుగు సాహిత్యం-సామాజిక స్పృహ అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఆంధ్ర లయోలా కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో సదస్సును ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో నిర్వహించారు. రెండోరోజు మొత్తం మూడు సదస్సుల్లో ప్రత్యక్షంగా పరిశోధక విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆచార్యులు కలిసి 26 పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఆన్‌లైన్‌లో మరో 26 పరిశోధనా పత్రాలను సమర్పించారు. సదస్సుకు అధ్యక్షుడిగా కళాశాల ప్రిన్సిపాల్ రెవ.ఫాదర్ జీఏపీ కిశోర్ వ్యవహరించగా, కన్వీనర్‌గా కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డాక్టర్ కోలా శేఖర్ వ్యవహరించారు. సభకు అధ్యక్షుడిగా కళాశాల తెలుగుశాఖ ఆచార్యుడు రవీంద్రబోస్, భారతీయ భాషా శాస్త్ర సమితి అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ రెవ.ఫాదర్ జీఏపీ కిశోర్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, రత్నశేఖర్, తెలుగు అధ్యాపకులు గోపాలరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం

గుంటూరు(విద్య), మార్చి 14: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం 48వ వార్షికోత్సవం గురువారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జీఎస్ అబ్దుల్ కరీమ్ (ఎమ్మిగనూరు), సెక్రటరీ జనరల్‌గా జి.ప్రభుదాసు, కోశాధికారిగా టీవీఎస్ఎస్ ఆర్పీ శర్మ, అర్గనైజింగ్ కార్యదర్శిగా బి పెద్దన్నగౌడ్ (అనంతపురం) ఎన్నికయ్యారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

ఇండిపెండెంట్‌గానైనా బరిలో ఉంటా!

- సీటు గెలిచి చంద్రబాబుకు కానుకగా ఇస్తా
- ఓడిపోయినప్పుడూ ఇంత ఆవేదన చెందలేదు
- తీవ్ర మనస్తాపానికి గురైన బోడె ప్రసాద్
- టికెట్ లేదని తెలిసి కార్యకర్తల ఆవేదన
- బోడెకు సీటు కేటాయించాలంటూ నినాదాలు..
- ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఇద్దరు కార్యకర్తలు

పెనమలూరు, మార్చి 14 : కృష్ణాజిల్లా పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఈసారికి టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ఇవ్వలేకపోతున్నామని టీడీపీ అధిష్టానం స్పష్టం చేసింది. గురువారం పార్టీ పెద్దలు స్వయంగా ఫోన్ చేసి ఈ విషయాన్ని బోడెకు తెలియజేశారు. తనకు టికెట్ నిరాకరించడంతో బోడె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ విషయంపై విలేకరులతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు, లేనప్పుడు కూడా నిజాయితీగా ఉంటూ నియోజకవర్గంలో పార్టీని పటిష్ఠపరిచే క్రమంలో కుటుంబాన్ని కూడా సరిగా పట్టించుకోలేదని కన్నీటిపర్యంతమయ్యారు. చంద్రబాబు, లోకేశ్ ఆశీర్వాదాలతో ఈ ఎన్నికల్లో తప్పకుండా పోటీచేసి గెలిచి పెనమలూరు సీటును చంద్రబాబుకు కానుకగా ఇస్తానని తెలిపారు. చంద్రబాబు కుటుంబం నుంచి ఎవరొచ్చి పోటీ చేసినా తాను ముందుండి వారిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తానన్నారు. వారు కాకుండా ఇతరులకు సీటు ఇచ్చే పక్షంలో తాను కూడా పోటీలో ఉంటానని స్పష్టం చేశారు.

పార్టీ సమావేశంలో ఉండగానే అధిష్టానం నుంచి ఫోన్

చిలకలూరిపేటలో 17వ తేదీన మూడు పార్టీల ఉమ్మడి సభను విజయవంతం చేసే విషయంపై గురువారం పోరంకిలోని పెనమలూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఉండగానే బోడెకు టీడీపీ అధిష్టానం నుంచి ఫోన్ వచ్చింది. పార్టీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ.. ఈసారికి అవకాశం ఇవ్వలేకపోతున్నట్టు తెలియజేయమన్నారని చెప్పడంతో బోడె ఒక్కసారిగా డీలాపడ్డారు. విషయం తెలిసిన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, మహిళా నేతలు భారీ సంఖ్యలో కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. బోడెకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇద్దరు కార్యకర్తలు ఒంటిపై పెట్రోలు పోసుకొని అంటించుకునే ప్రయత్నం చేయడంతో కార్యకర్తలు అప్రమత్తమై వారిని నిలువరించారు.

ఓడినా.. గెలిచినా ప్రజాసేవలోనే ఉన్నా..

అనంతరం బోడె మీడియాతో మాట్లాడుతూ.. తాను గెలిచినా.. ఓడినా గత పదేళ్లుగా ప్రజల్లోనే ఉన్నానన్నారు. సంవత్సరానికి రూ.కోటికిపైగా సొంత ఖర్చుతో పార్టీని బలోపేతం చేశానన్నారు. నియోజకవర్గంలో సర్వేలు తనకు అనుకూలంగా ఉన్నాయని, ఐవీఆర్ఎస్ సర్వేలో 86 శాతం ప్రజలు తనకు మద్దతు తెలిపారన్నారు. పార్టీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, షేక్ బుజ్జి, కుర్రా నరేంద్ర, దేవినేని రాజా, శొంఠి శివరాంప్రసాద్, సంగెపు రంగారావులు మాట్లాడుతూ.. బోడెకు పార్టీ టికెట్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బూత్‌లెవెల్, గ్రామస్థాయి, క్లస్టరు స్థాయి, యూనిట్ స్థాయి, రాష్ట్రస్థాయి నాయకులు రాజీనామాలు సమర్పించారు.

ఎన్టీటీపీఎస్ సీఈగా నాగరాజు



ఇబ్రహీంపట్నం, మార్చి 14 : ఎన్టీటీపీఎస్ నూతన సీఈగా నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కడప రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ సీఈగా పనిచేస్తూ ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఈగా పనిచేస్తున్న నవీన్ గౌతమ్ విద్యుత్ సౌధాకు బదిలీ అయ్యారు.

విమానరంగానికి డిమాండ్

విజయవాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం విమానయానరంగానికి మంచి డిమాండ్ ఉందని విజయవాడ విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. బెంజ్‌సర్కిల్‌లో జాన్ బెన్‌హర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏరో ఫాల్కన్స్ ఏవియేషన్ ట్రైనింగ్ అకాడమీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించింది. దీన్ని లక్ష్మీకాంతరెడ్డి ప్రారంభించారు. దేశంలో ప్యాసింజర్ ట్రావెలింగ్ వేగవంతమైందన్నారు. పైలట్ ఉద్యోగాల్లో చేరడానికి ఆసక్తి చూపుతున్న యువత పెరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెపై లైంగికదాడి ఘటనలో కీచక తండ్రి అరెస్టు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 14 : వీరవల్లి గ్రామంలో కన్నకూతురిపైనే అఘాయిత్యానికి ఒడిగట్టిన తండ్రిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సభ్యసమాజం తలదించుకునేలా చదువుకుంటున్న కుమార్తెపై పలుమార్లు లైంగిక అఘాయిత్యానికి పాల్పడి పరారీలో ఉన్న తండ్రిని డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో సీఐ నరసింహమూర్తి, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, ఎస్సై చిరంజీవి ముమ్మర గాలింపు తర్వాత సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని నూజివీడు కోర్టుకు తరలించారు.

లారీ ఢీకొని టీచర్ మృతి



గన్నవరం, మార్చి 14 : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి చెందింది. గన్నవరం బాలికల జడ్పీహైస్కూల్‌లో ఎస్ఎస్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.వరలక్ష్మి పోరంకిలో కుటుంబంతో ఉంటోంది. రోజు మాదిరిగానే గురువారం సాయంత్రం పాఠశాల అనంతరం ద్విచక్ర వాహనం(ప్లెజర్)పై ఇంటికి వస్తుండగా ఎయిర్‌పోర్టు మెయిన్ గేటు వద్ద ఫ్లైఓవర్ అండర్ పాస్ దగ్గర హర్యానాకు చెందిన కంటైనర్ లారీ ఆమె వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నుజునుజ్జయింది. వరలక్ష్మి కుడి కాలుపై లారీ టైర్లు ఎక్కడంతో బలమైన గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే అంబులెన్స్‌లో కామినేని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బూరగడ్డ వేదవ్యాస్‌కు అస్వస్థత



మచిలీపట్నం టౌన్, మార్చి 14 : మాజీ డిప్యూటీ స్పీకర్, పెడన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అస్వస్థతకు గురయ్యారు. మచిలీపట్నంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అధిక రక్తపోటు, ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరడం వల్ల అస్వస్థతకు గురయ్యారు. ఈయనను వివిధ రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.18

చిలకలూరిపేట సభకు బస్ సౌకర్యం కల్పించండి

బస్టేషన్, మార్చి 14: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో ఈనెల 17న జరగనున్న టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి సభకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని టీడీపీ పశ్చిమ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్, జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్‌లు ప్రజారవాణా అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ బస్టేషన్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎంవై దానంకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ సభ ద్వారా రాష్ట్రంలో సరికొత్త చరిత్రను సృష్టించనున్నట్లు తెలిపారు.



ప్రజారవాణా అధికారులకు వినతి

గద్దె భారీ మెజారిటీతో గెలుస్తారు

మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

పటమట, మార్చి 14 : తూర్పులో రాముడికి, రాక్షసుడికి మధ్య యుద్ధం జరుగుతోందని, ఈ యుద్ధంలో దేవినేని అవినాష్‌పై గద్దె 40వేల ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తెలిపారు. అశోక్‌నగర్‌లోని తూర్పు టీడీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవం గురువారం ఉదయం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విజయవాడ పార్లమెంట్ టీడీపీ నాయకులు కేశినేని శివనాథ్, నాగుల్ మీరా, అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, కొమ్మారెడ్డి పట్టాభి, పోతంశెట్టి నాగేశ్వరరావు, గద్దె అనురాధలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బుద్దా వెంకన్న మాట్లాడుతూ గద్దె రామ్మోహన్ అజాత శత్రువు అని, ఏనాడు దేవినేని అవినాశ్‌లా భూ కబ్జాలు, దౌర్జన్యాలు చేయలేరన్నారు. ఇక నుంచి గద్దె రామ్మోహన్‌ను కేశినేని నాని విమర్శిస్తే నాని ఎదుటికే వెళ్లి అతని బండారం బయటపెడతానని హెచ్చరించారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గద్దె భారీ మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. గద్దె మాట్లాడుతూ 17న చిలకలూరి పేటలో జరిగే సభకు తూర్పు నుంచి అధిక సంఖ్యలో ఉమ్మడి పార్టీల శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ● ఆరో డివిజన్‌కు చెందిన మైనార్టీ వైసీపీ నాయకులు షేక్ షకీలా గురువారం టీడీపీలో చేరారు. నాగుల్ మీరా ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ● జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గద్దె రామ్మోహన్ ఏర్పాటు చేసిన కేక్‌ను జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఈ కార్యక్రమంలో సుఖవాసి శ్రీనివాస్, గన్నే నారాయణ ప్రసాద్, ఎస్. సిరాజ్, చెన్నుపాటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుద్దా వెంకన్న



14వ డివిజన్‌లో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న గద్దె అనురాధ

గద్దె రాజేశ్ ఎన్నికల ప్రచారం

టీడీపీ-జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని కోరుతూ గురువారం సాయంత్రం 10వ డివిజన్ మారుతీ కో-ఆపరేటివ్ కాలనీ, గురునానక్ కాలనీ, ఉషోదయ పక్కరోడ్డులో టీడీపీ యువ నాయకుడు గద్దె రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, మండవ నాగేశ్వరరావు, మన్నె జయకృష్ణ, వాసు, బొర్రా రవీంద్రబాబులు పాల్గొన్నారు.

కలలకు రెక్కలకు స్పందన: గద్దె అనురాధ

14వ డివిజన్ ఎస్ఎస్ఎం స్కూల్ వెనుక సత్యనారాయణ నగర్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు విజయాన్ని కాంక్షిస్తూ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కలలకు రెక్కలు పథకం అమలు చేస్తామన్నారు. నర్రా కిషోర్, బద్రి, చెరుకూరి సాంబయ్య, డాంగేకుమారి, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఆర్థిక వితరణ

రామలింగేశ్వరనగర్: రామలింగేశ్వరనగర్ ఎర్రబోతువారి వీధికి చెందిన పుప్పాల కృష్ణమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఎన్నికల ప్రచారంలో ఉన్న గద్దె రాజేష్‌కు స్థానికులు విషయం తెలపగా గురువారం మృతుడి భార్య కృష్ణకుమారికి ఆర్థిక సహాయం అందజేశారు. నాగేశ్వరరావు, అమ్ములు పాల్గొన్నారు.

వైసీపీ విముక్త ఏపీ.. జనసేన లక్ష్యం

ఆవిర్భావం సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేసిన పోతిన మహేశ్

వన్‌టౌన్, మార్చి 14: వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ జనసేన లక్ష్యమని ఆ పార్టీ అధికార ప్రతినిధి పోతిన మహేశ్ అన్నారు. పార్టీ ఆవిర్భావం సందర్భంగా గురువారం 53వ డివిజన్‌లో పొట్నూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పతాకావిష్కరణ జరిగింది. పతాకాన్ని ఎగురవేసిన అనంతరం పోతిన మహేశ్ మాట్లాడుతూ జనసేనను అధికారంలో భాగస్వామ్యం చేసే దిశగా పార్టీ నాయకులు, వీరమహిళలు పనిచేయాలని కోరారు. పవన్‌కల్యాణ్ బలమైన ప్రతిపక్ష నాయకుడిగా నిలబడడం వల్లే జాతీయ స్థాయిలో పొత్తులకు అనుసంధానకర్తగా మారారని పేర్కొన్నారు. రేఖపల్లి శ్రీను, పాలేటి మోహనరావు, పిళ్ళా శ్రీకాంత్, భక్తిప్రసన్న, యుగంధర్, నాగూర్‌ఖాన్, సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు.

72 మందికి పెన్షన్‌ల పంపిణీ

వన్‌టౌన్: జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్ జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సొంత నిధుల నుంచి 72 మందికి రూ.45వేలను పెన్షన్‌లుగా పంపిణీ చేశారు. ఈ మొత్తాలను ఆయన కుమార్తె పోతిన చంద్రకీర్తి లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక డివిజన్ అధ్యక్షుడు కొరగంజి వెంకటరమణ, షేక్ అమీర్ బాషా, శింగంశెట్టి రాము, రమేష్, తమ్మిన రఘు, నమన్ కార్తీక్, దాసరి జగదీష్ పాల్గొన్నారు.

మధురానగర్: 29వ డివిజన్ మధురానగర్‌లో డివిజన్ పార్టీ అధ్యక్షుడు కెంబూరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవంలో జనసేన సమన్వయ కర్త బోలిశెట్టి వంశీకృష్ణ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. డివిజన్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నేత బోండా రవితేజ, కెంబూరి భవానీ, ఉపాధ్యక్షుడు వెంపటాపు శ్రీను, ప్రధాన కార్యదర్శి కాయల రవి, 31వ డివిజన్ అధ్యక్షుడు ఎపుగంటి లక్ష్మి అపర్ణ, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

పాయకాపురం: ప్రకాష్‌నగర్ సెంటర్‌లో జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవంలో నగర నాయకుడు బొప్పన శ్యాంసన్ ముందుగా కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జనసేన పార్టీ జెండాను ఎగురవేశారు. అప్పలరాజు, నాగేంద్ర, భాను, కుమార్, నాని, ప్రవీణ్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న పోతిన మహేశ్



జెండా ఆవిష్కరిస్తున్న బోలిశెట్టి వంశీకృష్ణ, కెంబూరి కృష్ణ తదితరులు

18వ డివిజన్‌లో టీడీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

రాణిగారితోట, మార్చి 14: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ 18వ డివిజన్ టీడీపీ నాయకులు గురువారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ గురువారం మంచి రోజు కావడంతో డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించామని తెలిపారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరుతున్నామని తెలిపారు. డివిజన్‌లోని రామాలయం నుంచి కరెంట్ ఆఫీసు రోడ్డు, ఆర్సీఎం వెనుక రోడ్డులలో డోర్ టూ రోడ్ ప్రచారం నిర్వహించగా స్థానికుల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు టీడీపీ ప్రకటించిన ఆరు పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. నాగేంద్ర రెడ్డి, మర్రి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి

● టాస్క్‌ఫోర్స్ డీసీపీ హరికృష్ణ

పాయకాపురం, మార్చి 14 : ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని టాస్క్‌ఫోర్స్ డీసీపీ హరికృష్ణ అన్నారు. నున్న రూరల్ పోలీసు స్టేషన్ పాయకాపురం పరిధిలో గురువారం ఫ్లాగ్ మార్చ్ జరిగింది. డీసీపీ హరికృష్ణ పలు ప్రాంతాల్లో 200 మంది సిబ్బందితో స్ట్రీట్ వాక్ చేశారు. కండ్రిక, రాజీవ్‌నగర్, ఎల్‌బీఎస్‌నగర్, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను ధైర్యంగా తమ దృష్టికి తీసుకురావాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సీఐలు దుర్గాప్రసాద్, గురుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.



స్ట్రీట్ వాక్ చేస్తున్న ఏడీసీపీ, ఏసీపీలు

టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మెరుగుమాల

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 14 : టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా 61వ డివిజన్‌కు చెందిన మెరుగుమాల సాంబశివరావు నియమితులయ్యారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో గురువారం బొండా ఉమా సాంబశివరావుకు నియామక పత్రాన్ని అందజేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కోశాధికారి ఆకుల సూర్యప్రకాష్, దాసరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సాంబశివరావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న బొండా ఉమా

టీడీపీలో చేరికలు

పాయకాపురం: 63వ డివిజన్ వైసీపీకి చెందిన కార్యకర్తలు, అభిమానులు గురువారం టీడీపీలో చేరారు. రాజీవ్‌నగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో 200 మందికి బొండా ఉమా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లబ్బా వైకుంఠం, తులసి, లబ్బా దుర్గ, శ్రీను పాల్గొన్నారు.

'పొట్టి శ్రీరాములు'లో క్లబ్‌ల ఆవిష్కరణ

వన్‌టౌన్, మార్చి 14 : స్థానిక పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కాలేజీలోని డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం పలు క్లబ్‌లను ఆవిష్కరించారు. డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ షేక్ అక్బర్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథి కళాశాల ప్రిన్సిపాల్ జే లక్ష్మీనారాయణ ఇంక్యుబేషన్- ఇన్నోవేషన్, సర్వీసెస్ స్పెక్ట్రమ్ ,నోవా వర్సిటీ క్లబ్‌లను ప్రారంభించారు. క్లబ్‌ల గురించి క్లబ్ అధ్యక్షులు వి.సాయి సాహిత్, ఏ.విశ్వసత్యేంద్ర కీర్తనలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పతంజలి శాస్త్రి, అధ్యాపకులు వి. నవ్యశ్రీ, ఎస్‌జీఎస్ ప్రియాంక, కే.సురేష్ పాల్గొన్నారు.



క్లబ్‌ల బోర్డులను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బీజేపీ-టీడీపీ-జనసేన కూటమితో రాష్ట్రానికి మేలు

● బీజేపీ యువమోర్చా కోశాధికారి రవ్వ హరీష్

వన్‌టౌన్, మార్చి 14: బీజేపీ-టీడీపీ-జనసేన కూటమితో రాష్ట్రానికి మేలు జరుగుతుందని బీజేపీ యువమోర్చా కోశాధికారి రవ్వ హరీష్ అన్నారు. పశ్చిమలోని ఒక కన్వెన్షన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమలో 50వేల మందికి పైగా ఆర్యవైశ్యులు, జైనులు, బ్రాహ్మణులు ఉన్నందున ఆర్యవైశ్య సామాజిక వర్గానికి పశ్చిమ సీటును కేటాయించాలని కోరుతున్నామన్నారు. పశ్చిమ కన్వీనర్ పొట్టి శ్రీహరి మాట్లాడుతూ పశ్చిమ ఓటర్లు విజ్ఞులు, ఆలోచనపరులని అందుకే ఆర్యవైశ్యులకు సీటు కేటాయించాలని కోరారు. పొత్తు ధర్మంలో భాగంగా ఎవ్వరికీ సీటు ఇచ్చినా వారి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

సత్యనారాయణపురం అభివృద్ధిపై టీడీపీ, వైసీపీ నిర్లక్ష్యం

● సీపీఎం నేత బాబూరావు

సత్యనారాయణపురం, మార్చి 14: సత్యనారాయణపురం ప్రాంతం అభివృద్ధిని వైసీపీ, టీడీపీలు నిర్లక్ష్యం చేశాయని, రాబోయే ఎన్నికల్లో అవసరానికి వాడుకొని వదిలి వేస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సత్యనారాయణపురం 33వ డివిజన్‌లో గురువారం మార్పు కోసం సీపీఎం పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. సత్యనారాయణపురం నుంచి అయోధ్యనగర్ వైపు కాలువపైన వంతెన నిర్మాణానికి ప్రతిపాదన ఉన్నా నిధులు కేటాయించ లేదన్నారు. సీపీఎం నేతలు రమణ, శ్రీనివాస్, ప్రవీణ్, మురళీ, సాగర్, చారి, సుప్రజ పాల్గొన్నారు.

కులగణన నివేదికను బహిరంగపరచాలి

● కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివాజీ

వన్‌టౌన్, మార్చి 14: కులగణన నివేదికను బహిరంగ పరచాలని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కులగణన చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిందని పూర్తి చేసి రెండు వారాలు గడుస్తున్నప్పటికీ నివేదికను బయటపెట్టలేదన్నారు. ప్రజల సొమ్ముతో కులగణన చేపట్టి ప్రజలకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. కేవలం వైసీపీ ప్రయోజనాలకే కులగణన చేపట్టారని, ఇది ప్రజల కోసం కాదని స్పష్టమవుతుందన్నారు. కులగణన వివరాలను తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కులగణన వివరాలను అందుబాటులోకి తీసుకురావాలని, ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే వివరాలను బయటపెట్టాలన్నారు.

గుండారపు సోమయ్య ట్రస్టు వితరణ

విద్యాధరపురం, మార్చి 14: గుండారపు సోమయ్య చారిటబుల్ ట్రస్ట్ తరఫున గురువారం 39వ డివిజన్‌లో పలు వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఒక ఇస్త్రీబండి, రెండు టిఫిన్ బండ్లు, 40 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు అంద జేశారు. టీడీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ గుండారపు హరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కేశినేని శివనాథ్, నాగుల్‌మీరా, కాండ్రేగుల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూపాబాయమ్మ ట్రస్టు డైరెక్టర్‌గా మహేంద్రరెడ్డి

భవానీపురం, మార్చి 14 : పశ్చిమలోని రూపాబాయమ్మ ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా 43వ డివిజన్ ఊర్మిళానగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు గట్ల మహేంద్రరెడ్డి నియమితులయ్యారు. మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి, పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు గదులు ప్రారంభం

గవర్నర్‌పేట, మార్చి 14: గోపాలరెడ్డి రోడ్డులోని సీవీఆర్ హైస్కూల్‌లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.50 కోట్లతో నిర్మించిన 10 అదనపు తరగతి గదులను సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, 23వ డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి, వైసీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 14 : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం సింగ్‌నగర్‌లోని డంపింగ్ యార్డ్ సమీపంలోని అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న పాల సాక్షి బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి వచ్చే సరికి బీరువాలో ఉండాల్సిన రూ. 40 వేలు, రెండు బంగారపు ఉంగరాలు కనబడలేదు. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్టు నిర్ధారించుకుని అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికురాలికి గాయాలు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 14 : గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని ముత్యాలంపాడు ప్రాంతానికి చెందిన ఎస్. నాగ దుర్గ గాయపడింది. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. ఆమె వీఎంసీలో కార్మికురాలిగా పని చేస్తుంది. బుధవారం మధ్యాహ్నం విధుల నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరి వెళుతుండగా బుడమేరు వంతెన వద్దకు వచ్చే సరికి గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడింది. ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ నాలెడ్జ్ సెంటర్ పరిశీలన

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 14 : ఆర్ఆర్ఆర్ నాలెడ్జ్ సెంటర్‌ను గురువారం నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ప్లాంట్ లో నిర్మాణ దశలో ఉన్న ఆర్ఆర్ఆర్ నాలెడ్జ్ సెంటర్ ను పరిశీలించి అవగాహన కల్పించే త్రీడీ సూక్ష్మ నమూనాలను, అవి పని చేసే విధానాలను అడిగి తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు.


మంచినీటి పైపులైన్ పనులు ప్రారంభం

వన్‌టౌన్, మార్చి 14: 51వ డివిజన్‌లో సుమారు 20లక్షల వ్యయంతో 600 మీటర్ల మేరకు తలపెట్టిన మంచినీటి పైపులైన్‌ల నిర్మాణ పనులను స్టాండింగ్ కమిటీ సభ్యుడు, డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ గురువారం ప్రారంభించారు. సెక్షన్ ఏఈ అహ్మద్, సచివాలయ సెక్రటరీలు, వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

విద్యాధరపురం, మార్చి 14: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని భవానీపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. భవానీపురం ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన డెక్కం శ్రీనివాసరావు మద్యం బాటిళ్లను అధిక ధరలకు విక్రయించడం ప్రారంభించాడు. తెలుసుకున్న పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. సుమారు రూ. 2850 విలువగల 9 లీటర్ల 750గ్రాముల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

అనుకున్న సమయానికే..



ప్రభాస్ హీరోగా నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ'. పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్ర ప్రసాద్, దీపికా పదుకొనే, దిశా పటానీ వంటి భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా మే 9న ప్రేక్షకులను కనువిందు చేస్తుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే సాంకేతికంగా ఎంతో ఉన్నతంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం రిలీజ్ పోస్ట్‌పోన్ కావచ్చని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తాజాగా బిగ్ బీ అమితాబ్ బచ్చన్ తన బ్లాగులో ఈ చిత్రం గురించి రాశారు. "కల్కి మూవీ షూటింగ్ నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి మళ్లీ ఆలస్యమైంది. చిత్రీకరణ దాదాపుగా పూర్తయ్యింది. ముందుగా అనుకున్న సమయానికే మే 9నే ఈ చిత్రం వస్తోంది. ప్రేక్షకులకు అనిర్వచనీయమైన అనుభూతిని అందించే విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చిత్ర బృందం అహర్నిశలు శ్రమిస్తోంది" అని తన బ్లాగులో పేర్కొన్నారు. దీంతో ఈ చిత్రం విడుదలపై వస్తున్న అసత్య ప్రచారాలకు చెక్ పడినట్లైంది.

మంచి సందేశంతో ది 100

ఎం.వెంకయ్యనాయుడు



'సినిమా అనేది శక్తిమంతమైన ఆయుధం. దాని ప్రభావం సమాజం మీద ఉంటుంది. 'ది 100' చిత్ర ఇతివృత్తం బాగుంది. ఇందులో మంచి సందేశం ఉంది. ఇంత చక్కని చిత్రాన్ని తీసిన దర్శకనిర్మాతలకు, హీరో సాగర్‌కు అభినందనలు. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. 'మొగలిరేకులు' ఫేమ్ ఆర్కే సాగర్ హీరోగా, ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో రూపొందిన 'ది 100' చిత్రం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, ప్రసంగించారు. 'ఇది ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్. కమర్షియల్ అంశాలతో పాటు ఓ సోషల్ ఇష్యూని చెప్పాం. అందరూ చూడదగ్గ చిత్రం' అని దర్శకుడు చెప్పారు. 'ది 100' అనేది ఒక వెపన్. ప్రతి మనిషికీ జీవితంలో ఈ ఆయుధం అవసరం అవుతుంది' అని సాగర్ చెప్పారు. మిషా నారంగ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని రమేశ్ కరుటూరి, వెంకీ పూషడపు, కె.తారక్‌రామ్ నిర్మించారు.

వెయ్ దరువెయ్ ప్రేక్షకులను మెప్పిస్తుంది



సాయిరామ్ శంకర్, యషా శివకుమార్ హీరో హీరోయిన్లుగా నటించిన 'వెయ్ దరువెయ్'. ఈ శుక్రవారం రిలీజ్ అవుతోంది ఈ సందర్భంగా హీరో సాయిరామ్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ "ఇందులో హీరో క్యారెక్టర్ జోవియల్‌గా ఉంటుంది. సమాజంలోని ఓ సమస్యపై హీరో చేసే చిన్నపాటి పోరాటాన్ని ఇందులో చూపించాం. 'బంపర్ ఆఫర్' మూవీ నా బాడీ లాంగ్వేజ్‌కి తగ్గట్లు ఉండే చిత్రం. ఆ తర్వాత ఈ కథ నాకు అలా అనిపించింది. కామెడీ నాకు బాగా ఇష్టం. 'వెయ్ దరువెయ్' విషయానికి వస్తే ఇందులో 80 శాతం కామెడీ ఉంటుంది" అని అన్నారు.

అజిత్ హీరోగా గుడ్ బ్యాడ్ అగ్లీ

తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు.




రాక్‌స్టార్ దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. గురువారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ "స్టార్ హీరో అజిత్‌తో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని అందించబోతున్నాం" అని అన్నారు. నిర్మాత వై రవిశంకర్ మాట్లాడుతూ "అధిక్ అద్భుత దర్శకత్వ ప్రతిభ అతని మునుపటి చిత్రాల్లో చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కొత్త చిత్రం నెక్స్ లెవల్‌లో వుండబోతుంది" అని చెప్పారు. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ "అజిత్‌తో కలిసి పనిచేయటం నా చిరకాల స్వప్నం. ఈ సినిమాతో అది నెరవేరబోతోంది" అని అన్నారు. ఈ చిత్రానికి అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రీకరణ జూన్ 2024లో ప్రారంభం అవుతుంది. 2025 సంక్రాంతి కానుకగా విడుదలవుతోంది.



శ్రుతీహాసన్ మ్యూజికల్ వీడియో

విశిష్ట నటుడు కమల్‌హాసన్ తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్న మ్యూజికల్ వీడియో 'ఇనిమెల్'. తండ్రి కమల్ రాసిన పాటను తనయ శ్రుతీహాసన్ స్వరపరిచి, కాన్సెప్ట్ తయారు చేశారు. ఇందులో దర్శకుడు లోకేశ్ కనగరాజ్ నటించడం ఓ విశేషం. ఆయనతో పాటు శ్రుతి కూడా ఇందులో నటించారు. త్వరలో విడుదల కానున్న ఈ మ్యూజికల్ వీడియోకు భువన్ గౌడ సినిమాటోగ్రాఫర్. ద్వారకేశ్ ప్రభాకర్ దర్శకుడు.



కాశీలో నివేదన

పాపాలు చేస్తే...

"కాశీ మోక్షదాయిని ఎలా అయింది?" అనే నా ప్రశ్నకు.. శ్రీ మహా విష్ణువుకు పరమశివుడు ఇచ్చిన వరమే దానికి కారణమని శ్రీ రామశాస్త్రి చక్కని వివరణ ఇచ్చారు. ఆయన కాశీలో తొమ్మిదినెలలపాటు నివసించడానికి వచ్చారు. భార్యాసమేతంగా వచా ఆంధ్రాశ్రమంలో ఉంటున్నారు. ఆయన సమాధానం నాకు సంతృప్తి కలిగించినా... నా మనసులో ఇంకా ఏదో సందేహం మెదులుతూనే ఉంది. కాశీలోనే మోక్షం ఎందుకు లభిస్తుంది? మరే నగరమూ మోక్షదాయని కాదా?... ఈ సందేహంతోనే కాశీ అంతటా తిరుగుతున్నాను. నాతోపాటు నా సహోద్యోగి అమిత్ కూడా ఉన్నాడు. మేము అస్సీ ఘాట్‌కు వెళ్లాం. కాశీ ముముక్షు భవన్‌లో ప్రవేశించాం. దాని మేనేజర్ మనీష్ పాండేని అమిత్ తీసుకొచ్చాడు. ఆయన ఆ ప్రాంగణమంతా మాకు చూపిస్తూ... మొదట ఈశ్వర మఠానికి తీసుకువెళ్లారు. అది సన్యాసులకోసం ఉద్దేశించినది. వారికి ఉచిత భోజన, వస్త్ర, వసతి సదుపాయం ఉంది. వైద్యం కూడా ఉచితం. ధ్యానం, జపం చేసుకోవడానికి సాధనా కేంద్రం సైతం ఉంది. మోక్షం కోసం కాశీలో బసచేసే దంపతుల కోసం కూడా నలభై గదులతో రెండతస్తుల భవనం ఉంది. అరవై అయిదేళ్లు పైబడినవాళ్లకే అక్కడ ప్రవేశం. సన్యాసులతో కలిసి ప్రస్తుతం మూడు వందల మంది అక్కడ ఉంటున్నారు.

అక్క రామకోటి అనే వ్యక్తిని కలుసుకున్నాం. ఆయనది హైదరాబాద్. అసలు పేరు సత్యనారాయణ. ఆయన రామకోటి రాస్తారు. అక్కడ ఉన్నవారితో రాయిస్తారు. "అందరం కలిసి 130 కోట్ల రామనామాలు రాశాం" అని చెప్పారు. అందుకే అందరూ ఆయనను రామకోటి అని పిలుస్తారు.

అనంతరం మేనేజర్ మనీష్ తన కార్యాలయంలోకి తీసుకువెళ్లి... మాకు టీ, బిస్కెట్లు ఇచ్చారు.

"ఈ ముముక్షు భవనాన్ని ఎవరు, ఎప్పుడు కట్టించారు?" అని అమిత్ అడిగాడు.

"దీనికి ఆద్యుడు ఘనశ్యామదత్త. మోక్షగాములకు ఆశ్రయం కల్పించాలనే ఆలోచన ఆయనకు కదిలింది. స్వామి ఈశ్వరానంద తీర్థ సమక్షంలో సన్యాసం స్వీకరించి... ఘనశ్యామానందతీర్థగా మారారు. బిర్లా కుటుంబానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రాజా బల్దేవదాస్ బిర్లాను ఆయన కలిసి... తన ఆలోచన పంచుకున్నారు. బల్దేవ్‌దాస్ అయిదెకరాల భూమిని వెంటనే దానం చేసి, దానిలో 150 గదులతో భవనాన్ని నిర్మించి ఇచ్చారు. అలా 1920లో కాశీ ముముక్షు భవన్ అవతరించింది" అని చెప్పారు మనీష్.

"ముముక్షువు అంటే ఏమిటి? కాశీలోనే ముముక్షు భవనాలు ఎందుకు ఉన్నాయి?" అని అడిగాను.



గులాబ్ బాయి అనే మహిళను కలిశాం. ఆమె మధ్యప్రదేశ్‌లోని ఇటార్సీ నుంచి వచ్చారు. వయసు తొంబై రెండేళ్లు. ముప్పై రెండేళ్ల కిందట భర్తతో కలిసి కాశీ చేరుకొని... అక్కడే నివసిస్తున్నారు. ఆమె భర్తకు అయిదేళ్ల క్రితం మోక్షం ప్రాప్తించింది. ఆయన మరణిస్తూ "నీ ప్రాణాలు పోయేవరకూ ఇక్కడే ఉండు" అని చెప్పారట. ఆయన సైన్యంలో పని చేసేవారు. పింఛన్ ద్వారా తన జీవితం గడుస్తోందనీ, తనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారనీ, వారు అప్పుడప్పుడు తనను కలవడానికి వస్తారనీ గులాబ్ బాయి చెప్పారు.

"సనాతన హిందూ ధర్మం ప్రకారం నాలుగు పురుషార్థాలున్నాయి... ధర్మార్థ కామ మోక్షాలు. వీటిని నాలుగు దశల్లో సాధించవచ్చు. అవి: బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం. వైదిక ధర్మాన్ని అనుసరించి మోక్షానికి సరైన మార్గం సన్యాసం. మోక్షాన్ని కోరుకొనే వ్యక్తిని 'ముముక్షువు' అంటారు. ప్రాచీన కాలంలో సన్యాస జీవితాన్ని అడవుల్లో గడిపేవారు. ఆధునిక కాలంలో అది అసంభవం. కాశీ దైవభూమి. మోక్షాన్ని పొందాలనుకొనేవారి కోరికను తీర్చే పవిత్ర భూమి. సంసారికి కూడా మోక్షాన్ని ప్రసాదించే పుణ్య క్షేత్రం. కొందరు సన్యాసాన్ని స్వీకరించకుండానే మోక్షాన్ని కోరుకుంటారు. దానికోసం వారు అంతరంగంలో ఉన్న సమస్త కోరికలను త్యజించాలి. కాశీ ప్రవాసంలో అంతరంగ సన్యాసం లభిస్తుందని హిందువుల ప్రగాఢ విశ్వాసం. కాశీవాసం మోక్షానికి సరళమార్గమని నమ్మకం. అందుకే కాశీలో ముముక్షు భవనాలు వెలిశాయి" అని అన్నారు మనీష్.

"కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుందా?" అని అడిగాడు అమిత్. అతను హెడ్ కానిస్టేబుల్. యూనిఫారంలో ఉన్నాడు. కానీ ధార్మిక విషయాల్లో అతనికి చాలా అభిరుచి ఉంది. ఆధ్యాత్మిక పుస్తకాలు బాగా చదువుతాడు.

అతనివైపు మేనేజర్ ఆశ్చర్యంగా చూశారు. తిరిగి నా వైపు చూశారు. 'నా ప్రశ్న కూడా అదే' అన్నట్టు ఆయనకు సూచించాను.

అప్పుడు ఆయన "కాశ్యాం మరణం ముక్తిః... అన్నారు పూర్వులు. కాశీలో చితాగ్ని నిత్యం... అహర్నిశలూ, అన్ని కాలాల్లో మండుతూనే ఉంటుంది. అది మరణ భయాన్ని పోగొడుతుంది. ఇక్కడ మరణం జీవనలీలగా మిగిలిపోతుంది. కాశీకి 'మహాశ్మశానం' అనే పేరు కూడా ఉంది. ఇక్కడ భస్మమయ్యేది శరీరం ఒక్కటే కాదు... శరీరంతో ముడిపడి ఉన్న అన్ని వాసనలూ భస్మమవుతాయి. దానితో కలిసి ఉన్న గుణాలన్నీ బూడిదవుతాయి. ఆ బూడిదే పరమశివుని నుదుట విభూతి అవుతుంది. అంటే శరీరం శివైక్యం చెందిందన్నమాట. ***మరణం మంగళం యత్ర విభూతిశ్చ విభూషణం - ఔషధం జాహ్నవీతోయం వైద్యో నారాయణో హరిః- కౌపీనం యత్ర కౌశేయం సా కాశీ కేన మీయతే...*** అంటే... ఎక్కడ మరణం మంగళమయమో, ఎక్కడ చితాభస్మం అలంకారమో, ఎక్కడ గంగాజలం ఔషధమో, ఎక్కడ వైద్యుడు నారాయణుడో, ఎక్కడ గోచీ పట్టువస్త్రంతో సమానమో... అటువంటి కాశీని దేనితో పోల్చగలం?.. అని అర్థం" అంటూ వివరించారు.

"మరి ముక్తి ఎలా సాధిస్తారు? సాధన ద్వారానా?" అని అడిగాను.

"కష్టపడి సాధించడానికి ముక్తి అనేది పదార్థమా? ముక్తి అంటే భవబంధాల నుంచి స్వేచ్ఛ పొందడం. అన్నిటితోనూ ఉంటూ... అన్నిటికీ అతీతంగా ఉండడం. సౌభాగ్యంలో వైరాగ్యం, వైరాగ్యంలో సౌభాగ్యం, సంసారంలో సన్యాసం. కాశీ మట్టి విలక్షణమైనది. ఇక్కడి వాళ్లలో నిశ్చింత కనిపిస్తుంది. కోట్లు గడించాలనే అత్యాస ఉండదు. ఆ రోజుకు దొరికితే తృప్తి. ఆ తరువాత రెట్టింపు ఇస్తానన్నా రిక్షావాడు కూడా కదలడు. సంపన్నులు సంగీత కార్యక్రమాల్లో, సామాన్యులు జానపద కళల్లో సాయంత్రం సంతోషంగా గడుపుతారు" అని ఆయన చెప్పారు.

"పాపాలు చేసి కాశీ వచ్చినవాళ్లకు మోక్షం వస్తుందా?" అని ప్రశ్నించాను.

ముముక్షు భవన్‌లో అన్నదాన సత్రం ఉంది. ఆయుర్వేద, హోమియో ఆసుపత్రులున్నాయి. రోజూ రెండువందలమందికి ఉచిత చికిత్స అందిస్తారు.ఆ తరువాత అక్కడి కళాశాలకు, సంస్కృత ప్రాథమిక పాఠశాలకు వెళ్లాం. సంస్కృత కళాశాలలో ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. వసతి గృహంలో అరవై మంది విద్యార్థులున్నారు. బయటినుంచి రెండువందల మంది విద్యార్థులు వస్తారు. అనంతరం ముముక్షు భవన్ ప్రాంగణంలోని యజ్ఞశాలను, గుడిని సందర్శించాం. కొందరు సన్యాసులు, వృద్ధులు భజనలు చేస్తూ, భక్తి పారవశ్యంలో ఉన్నారు.

"అవును. కాశీలో ప్రవేశించగానే పాపాలన్నీ ప్రక్షాళన అవుతాయని 'కూర్మపురాణం' చెబుతోంది. మనిషి పాపరహితుడవుతాడు" అన్నారు.

"కాశీలో ఉండి పాపాలు చేస్తే?" అని అడిగాడు అమిత్.

"***కామక్రోధేన్ లోభేన్ గ్రస్తా యే భువి మానవాః- నిష్క్రమంతేనరా దేవీ దండనాయక మోహితాః...*** అని 'మత్స్యపురాణం' చెబుతోంది. అటువంటి వారిని దండపాణి (కాశీ క్షేత్రంలోని ఒక దేవత) కాశీ నుంచి బహిష్కరిస్తాడు. అంటే ఏదో నెపం మీద వారిని కాశీ నుంచి వెళ్లగొడతాడు. లేదంటే కాశీలోనే అతణ్ణి శిక్షిస్తాడు. కాలభైరవుడు ఆ శిక్ష అమలు చేస్తాడు. వాటిని 'భైరవ యాతనలు' అంటారు. కాశీలో యముడికి అధికారం ఉండదు. పాపం చేసినవారికి శిక్ష పూర్తయ్యాక ముక్తి లభిస్తుంది" అని వివరించారు మేనేజర్. ఆయనకు ధన్యవాదాలు చెప్పి బయలుదేరాం.

● కిల్లాడ సత్యనారాయణ, లక్నో



విశ్వ సృష్టికర్త అయిన అల్లాహ్ సమస్త జీవరాశుల కోసం ఏడాదిలోని పదకొండు నెలలను కేటాయించాడు. ఒక్క రంజాన్ మాసాన్ని మాత్రం తనదిగా నిర్దేశించుకున్నాడు. అందుకే సంప్రదాయికమైన ఇస్లాం ఆరాధనల్లో అత్యధిక భాగాన్ని ఈ నెలలోనే నిర్వహించాల్సి ఉంటుంది. ఆత్మ ప్రక్షాళనకు రంజాన్ అవకాశం అందిస్తుంది. దైవారాధనలో పునరంకితం కావడానికి, వ్యక్తి తన జీవితంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రేరేపించుకోవడానికి, క్రమశిక్షణను అలవరచుకోవడానికి, దైవప్రసన్నతను, దేవుడి కరుణను పొందడానికి అనువైన మాసం ఇది. అలాగే విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని, విశ్వాసుల్లో పరస్పర ఆత్మీయతా భావాన్ని పెంపొందించే మాసం. ఈ నెలలో వయసుతో నిమిత్తం లేకుండా విశ్వాసులందరూ ఆరాధనల్లో నిమగ్నమవుతారు. దేవునిపై విశ్వాసాన్ని మరింత పటిష్టపరచుకుంటారు. పేదలకు ఉన్న హక్కును ధనవంతులకు గుర్తు చేసి... జకాత్, ఫిత్రా లాంటి ధర్మాలను నిర్వర్తింపజేసే నెల... రంజాన్. నిరుపేదల ఆకలి బాధను సంపన్నులకు అనుభవపూర్వకంగా... రోజాల (ఉపవాసాల) ద్వారా తెలియజేసే నెల. ఈ మాసం చివర్లో వచ్చే పర్వదినాన్ని 'ఈదుల్ ఫిత్ర్' అని వ్యవహరిస్తారు.


ఆత్మప్రక్షాళనకు అవకాశం

సందేశం

అంతిమ దివ్య గ్రంథమైన ఖుర్‌ఆన్ అవతరించి, మానవాళికి తన బోధనామృతాన్ని అందజేసిన మాసం రంజాన్. అది మానవాళి అందరికీ మార్గదర్శకమైన, సత్యాసత్య విచక్షణను కలిగించే గ్రంథం. ఇబ్రహీం ప్రవక్తకు సహీఫాలు, మూసా ప్రవక్తకు తౌరాత్ గ్రంథం, దావూద్ ప్రవక్తకు జబూర్ గ్రంథం, ఈసా ప్రవక్తకు ఇంజీల్ గ్రంథాలను ఆ దైవం ప్రసాదించిది కూడా ఈ మాసంలోనే.

అదే విధంగా రంజాన్ ఉపవాసాల నెల. స్వర్గానికి ఎనిమిది ద్వారాలు ఉంటాయనీ, వాటిలో ఒకటి కేవలం ఉపవాసులకే ప్రత్యేకించినదనీ పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. యంత్రానికైనా విరామం కావాలి. అప్పుడప్పుడు దాని భాగాల్లో పేరుకున్న మలినాలను తొలగించి, శుభ్రపరచాలి. మానవ శరీరంలోని జీర్ణవ్యవస్థకు విశ్రాంతి ఇచ్చి, దానికి క్రమబద్ధతను చేకూర్చే ఆరాధనే రోజా (ఉపవాసం). ఆ ఉపవాస విధిని ఆచరిస్తూ, దాన ధర్మాలు చేస్తూ... దైవచింతనలో విశ్వాసులు నిమగ్నం కావాలి. తోటివారితో సోదరభావాన్ని పెంపొందించుకోవాలి. దీనివల్ల అరిషడ్వర్గాలు అదుపులోకి వస్తాయి. జీవితం శాంతిమయమవుతుంది. భగవంతుని కటాక్షం లభిస్తుంది.

● మహమ్మద్ వహీదుద్దీన్



వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు

» రైతు రుణమాఫీ.. ఎమ్మెస్పీకి చట్టబద్ధత

» ఐదు 'కిసాన్ న్యాయ్' గ్యారెంటీలు ప్రకటించిన రాహుల్



నాసిక్, మార్చి 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వరుసగా హామీలు గుప్పిస్తున్నారు. మహిళలకు ఐదు గ్యారెంటీలు ప్రకటించిన మరుసటి రోజే రైతుల కోసం 'కిసాన్ న్యాయ్' పేరిట మరో ఐదు గ్యారెంటీలను ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో తమను గెలిపిస్తే రైతు రుణమాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయిస్తామని చెప్పారు. గురువారం జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌తో కలిసి ఆయన మహారాష్ట్ర నాసిక్‌లో రైతుల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ఎమ్మెస్పీ(కనీస మద్దతు ధర)కి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. రైతు రుణమాఫీ చేసేందుకు, రుణమాఫీ మొత్తాన్ని అంచనా వేసేందుకు శాశ్వత 'వ్యవసాయ రుణమాఫీ కమిషన్'ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పంట నష్టం జరిగితే 30 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో ఇన్సూరెన్స్ డబ్బు జమ అయ్యేలా పంట బీమా పథకంలో మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనార్థం కొత్త దిగుమతి- ఎగుమతి విధానాన్ని తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు.

18 ఓటీటీలపై నిషేధం

» అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న

» 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లపైనా కొరడా

న్యూఢిల్లీ, మార్చి 14: ప్రభుత్వ హెచ్చరికలను లెక్క చేయకుండా అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న ఆన్‌లైన్ వేదికలపై కేంద్రం కొరడా ఝుళిపించింది. 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలపై నిషేధం విధించినట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించింది. నిషేధిత యాప్‌ల్లో ఏడు గూగుల్ ప్లే స్టోర్‌లో, మరో మూడు యాపిల్ యాప్ స్టోర్‌లో ఉన్నాయి. సృజనాత్మక ముసుగులో అశ్లీలత, అసభ్య పదజాలం వంటి వాటిని ప్రసారం చేయకుండా నిషేధించాల్సిన బాధ్యత ఆయా వేదికలపై ఉందని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ వాటిలో మార్పు రాకపోవడంతో 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లతోపాటు పలు వెబ్‌సైట్లు, యాప్‌లను నిషేధించినట్టు ప్రకటించారు.

రాజ్యసభ సభ్యురాలిగా సుధామూర్తి ప్రమాణం

న్యూఢిల్లీ, మార్చి 14: రాజ్యసభకు ఎంపికైన ఇన్ఫోసిస్ మాజీ చైర్మన్ నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ తన చాంబర్‌లో సుధామూర్తితో ప్రమాణం చేయించారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, నారాయణమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు సుధామూర్తిని రాజ్యసభకు నామినేట్ చేసిన సంగతి తెలిసిందే.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/xqNPEutలో చదవండి.

2029లో జమిలి!

(మొదటి పేజీ తరువాయి)

కూడిన 18,626 పేజీల భారీ నివేదికను కోవింద్ గురువారమిక్కడ రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి అందజేశారు. ఆయన వెంట ప్యానెల్ సభ్యులైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కశ్యప్, రాజ్యసభలో మాజీ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్, కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్, న్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, మాజీ సీవీసీ సంజయ్ కొఠారీ కూడా ఉన్నారు. ఏకకాలంలో ఎన్నికలు జరపడం వల్ల అభివృద్ధి వేగమవుతుందని.. ప్రజాస్వామిక పునాదులను బలోపేతం చేస్తుందని కమిటీ తన నివేదికలో అభిప్రాయపడింది. 'ఇండియా అంటే భారత్' ఆకాంక్షలు నెరవేర్చడానికి తోడ్పడుతుందని తెలిపింది. దేశంలో ఏటా పలు ఎన్నికల కారణంగా ప్రభుత్వం, వ్యాపారాలు, ఉద్యోగులు, కోర్టులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులపైన.. అన్నిటికీ మించి పౌరసమాజంపైన పెనుభారం పడుతోందని పేర్కొంది. ఒక దేశం-ఒకే ఎన్నిక విధానం అమలు కోసం చేపట్టే ఏ రాజ్యాంగ సవరణకూ రాష్ట్రాల ఆమోదం తీసుకోవలసిన అవసరం లేదని స్పష్టం చేసింది. కమిటీ కీలక సిఫారసులివీ..

ప్రభుత్వం కూలిపోతే..

- సార్వత్రిక ఎన్నికల్లో త్రిశంకు సభ ఏర్పడి లేదా అవిశ్వాస తీర్మానం నెగ్గి ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి లేకపోయినా.. ఏ కారణంగానైనా ప్రభుత్వం కుప్పకూలినా కొత్తగా లోక్‌సభ ఎన్నికలు జరపాల్సి వస్తుంది. అప్పుడు దాని పదవీకాలం.. మునుపు ఎన్నిక లు జరిగిన లోక్‌సభటర్మ్ పూర్తయ్యే వరకే ఉంటుంది.
- రాష్ట్రాల శాసనసభలకు తాజా ఎన్నికలు జరిగితే.. (అవి రద్దయితే తప్ప) వాటి పదవీకాలం లోక్‌సభ పూర్తి టర్మ్ వరకు కొనసాగుతుంది. ఉదాహరణకు ఒక రాష్ట్రప్రభుత్వం తన రెండో ఏట అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయి కూలిపోతే వెంటనే ఎన్నికలు నిర్వహించి కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఆ ప్రభుత్వం మిగతా మూడేళ్లు మాత్రమే కొనసాగుతుంది.
- ఈ మార్పులకు సంబంధించిన నియమావళిని అమల్లోకి తీసుకురావడానికి రాజ్యాంగంలోని 83వ అధికరణ (పార్లమెంటు ఉభయ సభల పదవీకాలాన్ని నిర్వచిస్తుంది), 172వ అధికరణ (రాష్ట్రాల శాసనసభల పదవీకాలానికి సంబంధించినది)లను సవరించాల్సి ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు వీలుగా రాజ్యాంగంలో 82ఏ అధికరణను చేర్చాలి. అయితే స్థానిక ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున ఆ మేరకు చేసే సవరణకు రాష్ట్రాల అనుమతి తప్పనిసరి.



రాష్ట్రపతి ముర్మును కలిసిన రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని బృందం

ఒకే ఓటరు జాబితా..

- లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికలకు పౌరులందరికీ ఒకే ఓటరు జాబితా, ఓటరు గుర్తింపు కార్డు ఉండాలి. స్థానిక ఎన్నికలు నిర్వహించే రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లతో సంప్రదింపులు జరిపి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వీటిని తయారు చేయాలి. ఇందుకోసం 325వ అధికరణను సవరించాలి.
- ఏకకాలంలో అన్ని ఎన్నికలు జరిపే విధానం పునరుద్ధరణకు.. చట్టబద్ధమైన యంత్రాంగాన్ని/వ్యవస్థను ప్రభుత్వం రూపొందించాలి.
- 82ఏ అధికరణను తీసుకొచ్చిన తర్వాత ఏర్పడిన అసెంబ్లీల పదవీకాలం లోక్‌సభ పదవీకాలంతోనే ముగుస్తాయి. అంటే 2024 జూన్‌లో ఈ అధికరణ చేరిస్తే తర్వాత ఏ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా 2029లో లోక్‌సభ పదవీకాలంతోపాటే ఆ సభల పదవీకాలం ముగుస్తుంది. అంటే 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎన్నికలు జరిగే అసెంబ్లీల కాల పరిమితి ఐదేళ్ల పూర్తి కాలం ఉండదన్న మాట.
- సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగే తొలి పార్లమెంట్ సమావేశంలోనే 82ఏను చేర్చేందుకు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేయాలి. ఈ నోటిఫికేషన్ తేదీని అపాయింటెడ్ డేట్‌గా భావిస్తారు. ఈ తేదీ తర్వాత ఎన్నికలు జరిగే అసెంబ్లీల పదవీకాలం లోక్‌సభ పదవీకాలంతోనే ముగుస్తుంది. అప్పటి నుంచి దేశంలో లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలి.
- 82ఏ ప్రకారం సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏ అసెంబ్లీకైనా ఎన్నికలు నిర్వహించలేకపోతే ఆ అసెంబ్లీ ఎన్నికలను తర్వాతి తేదీలో నిర్వహించాలని ఎన్నికల కమిషన్ రాష్ట్రపతికి సిఫారసు చేయవచ్చు.

191 రోజులు విస్తృత సంప్రదింపులు..

2023 సెప్టెంబరు 2న కోవింద్ సారథ్యంలోని ప్యానెల్ ఏర్పాటైంది. నాటి నుంచి 191 రోజులపాటు నిర్విరామంగా నిపుణులు, సంబంధిత భాగస్వాములతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపిందని ఓ అధికార ప్రకటనలో పేర్కొన్నారు. లోతైన పరిశోధనలు చేపట్టినట్లు తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తితో.. సిఫారసులు చేసిందని.. చాలా తక్కువ రాజ్యాంగ సవరణలు చేసే విధంగా వాటిని రూపొందించిందని పేర్కొన్నారు. కాగా.. తమకు మొత్తం 21,558 ప్రతిస్పందనలు రాగా.. వాటిలో 80 శాతం మంది జమిలి ఎన్నికలను సమర్థించారని ప్యానెల్ తెలిపింది.

సమర్థన.. అభ్యంతరం..

సంప్రదింపుల సందర్భంగా 'ఒకదేశం-ఒకే ఎన్నిక' విధానాన్ని ఎవరెవరు సమర్థించారు.. ఎవరు వ్యతిరేకించారో ప్యానెల్ తన నివేదికలో పేర్కొంది. ఈ విధానాన్ని నలుగురు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు సమర్థించారని తెలిపింది. జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ యూయూ లలిత్ లిఖితపూర్వకంగా తమ అభిప్రాయాలను కోవింద్ ప్యానెల్‌కు అందజేశారు.హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తు(సీజే)లలో 9 మంది ఈ విధానం వల్ల ప్రయోజనాలను ప్రస్తుతించగా.. మూడు హైకోర్టుల మాజీ సీజేలు మాత్రం గట్టిగా వ్యతిరేకించారు. తమ తమ అభ్యంతరాలను ప్యానెల్‌కు తెలియజేశారు. లోక్‌సభ, శాసనసభలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల రాజకీయ జవాబుదారీతనాన్ని దెబ్బతీస్తుందని ఢిల్లీ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ ఏపీ షా అభిప్రాయపడ్డారు. పనితీరుపై సమీక్ష లేకుండా ప్రజాప్రతినిధులకు ఐదేళ్ల పదవీకాలాన్ని స్థిరపరిస్తే వారి పనితీరుపై సమీక్షకు ఆస్కారం ఉండదని.. ప్రజాస్వామిక విలువలనే ఇది సవాల్ చేస్తుందని తెలిపారు. 'ఒక దేశం-ఒకే ఎన్నిక' ఆలోచన ప్రజాస్వామిక విలువలకు అనుగుణంగా లేదని కలకత్తా హైకోర్టు మాజీ సీజే జస్టిస్ గిరీశ్ చంద్ర గుప్తా అన్నారు. ఈ పద్ధతి భారత సమాఖ్య స్వరూపాన్ని నాశనం చేస్తుందని మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీబ్ బెనర్జీ స్పష్టం చేశారు. తరచూ మధ్యంతర ఎన్నికల వల్ల ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. అయితే అవినీతిని, అసమర్థతను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ నిధులతో ఎన్నికలు నిర్వహించేలా సంస్కరణ తీసుకురావడం బాగుంటుందని ఆయన సూచించారు. ప్యానెల్ సంప్రదించిన నలుగురు భారత ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్లు కూడా ఏకకాలంలో ఎన్నికలకు మొగ్గుచూపారు. ప్రస్తుత, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల(ఎస్ఈసీ)లో ఏడుగురు సైతం దీనిని సమర్థించారు.

జర్మనీ/జపాన్ విధానం మేలు: కశ్యప్

ప్యానెల్ సభ్యుడైన సుభాష్ కశ్యప్ జర్మనీ విధానం మేలని సూచించారు. జర్మన్ పార్లమెంటు బుందస్టాక్ చాన్స్‌లర్ (ప్రధాని)ని నియమిస్తుంది. ఆయన/ఆమెపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం తెస్తే.. అదే బ్యాలెట్‌పై ప్రత్యామ్నాయ చాన్స్‌లర్‌గా తమ అభ్యర్థి ఎవరో సూచించాల్సి ఉంటుంది. దాని ఆధారంగానే దేశాధ్యక్షుడు చాన్స్‌లర్‌ను నియమిస్తాడు. జపాన్‌లో కూడా ప్రధాన మంత్రిని పార్లమెంటు (నేషనల్ డైట్) నియమిస్తుంది. తర్వాత చక్రవర్తి ఆమోదిస్తాడు. ఈ రెండు విధానాల్లో ఒకటి అనుసరించాలని, దీనివల్ల దేశానికి మేలు కలుగుతుందని కశ్యప్ సూచించినట్లు నివేదిక తెలిపింది.

ఏడు దేశాల విధానాల అధ్యయనం..

కోవింద్ ప్యానెల్ దక్షిణాఫ్రికా, జర్మనీ, స్వీడన్, బెల్జియం, ఇండొనేసియా, జపాన్, ఫిలిప్పైన్స్ దేశాల ఎన్నికల విధానాలపై అధ్యయనం చేసింది. 'దక్షిణాఫ్రికాలో జాతీయ అసెంబ్లీ, ప్రొవిన్షియల్ (ప్రాంతీయ) అసెంబ్లీలకు పౌరులు ఏకకాలంలో ఓటేస్తారు. అయితే ఈ దేశంలో మున్సిపల్ ఎన్నికలు మాత్రం విడిగా జరుగుతాయి. స్వీడన్‌లో దామాషా ఎలక్టొరల్ వ్యవస్థ అమల్లో ఉంది. పార్లమెంటు (రిక్స్‌డాగ్), కౌంటీ కౌన్సిళ్లు, మున్సిపల్ కౌన్సిళ్లకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతాయి. వివిధ రాజకీయ పార్టీలకు వచ్చిన ఓట్ల శాతం ఆధారంగా వాటికి పార్లమెంటు, మండళ్లలో సీట్లు కేటాయిస్తారు. ఈ ఎన్నికలు ప్రతి నాలుగేళ్లకు సెప్టెంబరు రెండో ఆదివారం జరుగుతాయి. మున్సిపల్ కౌన్సిళ్లకు మాత్రం ప్రతి ఐదేళ్లకోసారి సెప్టెంబరు రెండో ఆదివారం రోజే నిర్వహిస్తారు' అని నివేదికలో వివరించారు. దేశంలో ఏకకాలంలో ఎన్నికలు జరగాలన్న ప్రతిపాదనలు గతంలో పలు నివేదికలు, అధ్యయనాల్లో వెలుగుచూశాయని ప్యానెల్ తెలిపింది.

రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకే..: కాంగ్రెస్

జమిలి ఎన్నికలు నిర్వహించాలన్న సిఫారసుపై కాంగ్రెస్ మండిపడింది. 'ఒక దేశం-ఇక ఎన్నికలు ఉండవు' అని ఎద్దేవా చేసింది. జమిలి ఎన్నికలతో బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని సంపూర్ణంగా నాశనం చేయాలని మోదీ ప్రభుత్వం చూస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం నాశిక్‌లో విమర్శించారు. 'ప్రధాని మోదీ లక్ష్యం స్పష్టంగా ఉంది.. ఆయన ఎక్కడకు వెళ్లినా లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ.. అంటే 400 ఎంపీ స్థానాలతో స్పష్టమైన మెజారిటీ ఇవ్వాలని కోరుతున్నారు. ప్యానెల్ నివేదికతో రహస్యం బట్టబయలైంది' అని ధ్వజమెత్తారు.

ఏప్రిల్ నుంచి కాకినాడ ప్లాంట్‌లో పెన్సిలిన్ ఉత్పత్తి

- జూన్‌లోగా వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి షురూ
- అరబిందో ఫార్మా వెల్లడి



60 శాతం సొంత అవసరాలకే

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద అరబిందో ఫార్మా ఏర్పాటు చేస్తున్న పెన్సిలిన్ (పెన్-జీ) తయారీ ప్లాంటు ఉత్పత్తికి సిద్ధమవుతోంది. 'వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఈ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఈ ప్లాంటులో ఉత్పత్తి ప్రక్రియను స్థిరీకరించే పనిలో ఉన్నాం' అని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు. ఈ ప్లాంటులో వచ్చే నెలలో ప్రయోగాత్మక ఉత్పత్తి ప్రారంభించి జూన్‌లోగా వాణిజ్య స్థాయిలో, రెండో త్రైమాసికానికల్లా పూర్తి స్థాయి ఉత్పత్తి అందుకోవాలని కంపెనీ అధికార వర్గాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

చైనా దిగుమతులకు చెక్!

ప్రస్తుతం కీలకమైన పెన్సిలిన్ ఉత్పత్తిలో చైనాదే గుత్తాధిపత్యం. కొవిడ్ తర్వాత ఆ దేశం నుంచి పెన్సిలిన్ దిగుమతులకు ఆటంకం ఏర్పడింది. దీనికి తోడు సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగితే చైనా మన దేశానికి పెన్సిలిన్ ఎగుమతులను కట్టడి చేసే ప్రమాదం ఉందని ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో చైనా పెన్సిలిన్ దిగుమతులకు చెక్ పెట్టేందుకు దేశీయంగా ఈ కీలక ఔషధ ముడి పదార్థం తయారు చేసే కంపెనీలకు పీఎల్ఐ పథకం కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రోత్సాహకాలను దృష్టిలో ఉంచుకుని అరబిందో ఫార్మా కాకినాడ వద్ద రూ.2,400 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంటు ఏర్పాటు చేస్తోంది.

ఏటా 15,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ ప్లాంటు ఉత్పత్తిలో 60 శాతం ఉత్పత్తిని అరబిందో ఫార్మా సొంత అవసరాలకు వాడుకోనుంది. మిగతా 40 శాతం ఉత్పత్తిని దేశీయ ఫార్మా కంపెనీలకు, విదేశాలకు ఎగుమతి చేస్తామని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సంతానం సుబ్రమణియన్ చెప్పారు. చైనా కంపెనీలు అమ్మే ధరకే తమ పెన్సిలిన్ లభిస్తుందని కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ నిత్యానంద రెడ్డి తెలిపారు. 'మా పోటీ చైనాతోనే. మా ఉత్పత్తి ధర చైనా కంపెనీలతో సమానంగా ఉంటుంది' అన్నారు.



పేటీఎం.. ఇక థర్డ్ పార్టీ యూపీఐ యాప్

అనుమతించిన ఎన్‌పీసీఐ

ఎస్‌బీఐ సహా నాలుగు బ్యాంకుల ద్వారా యూపీఐ లావాదేవీల కొనసాగింపునకు ఓకే

ముంబై: పేటీఎం యాప్ ద్వారా వినియోగదారులు చెల్లింపుల లావాదేవీలను కొనసాగించేందుకు వీలుగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. పేటీఎం థర్డ్‌పార్టీ యాప్‌గా మారేందుకు అనుమతిస్తున్నట్లు ఎన్‌పీసీఐ గురువారం తెలిపింది. ఇందులో భాగంగా నాలుగు బ్యాంకుల (ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యస్ బ్యాంక్) ద్వారా యూపీఐ లావాదేవీలను కొనసాగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫిబ్రవరి 29 తర్వాత పీపీబీఎల్ తన ఖాతాదారుల అకౌంట్లు, వాలెట్ వంటి ప్రీ-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్స్‌లో డిపాజిట్లు, క్రెడిట్ లేదా టాప్-అప్ లావాదేవీలు నిర్వహించకుండా ఆర్‌బీఐ నిషేధం విధించింది. ఆ తర్వాత డెడ్‌లైన్‌ను మార్చి 15 వరకు పొడిగించింది. ఈ నెల 15 నాటికల్లా పీపీబీఎల్ కస్టమర్లు అందరూ ఇతర బ్యాంక్‌లకు మారాల్సిందిగా ఆర్‌బీఐ సూచించింది. "వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఓసీఎల్)కు మల్టీ బ్యాంక్ మోడల్‌లో భాగంగా థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్ (టీపీఏపీ)గా యూపీఐ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇస్తున్నట్లు" ఎన్‌పీసీఐ పేర్కొంది. 4 బ్యాంకులు ఓసీఎల్‌కు పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్ (పీఎస్‌పీ) బ్యాంక్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపింది. ఓసీఎల్ ప్రస్తుత, కొత్త యూపీఐ మర్చంట్ల కోసం యస్ బ్యాంక్ మర్చంట్ అక్వైరింగ్ బ్యాంక్‌గానూ వ్యవహరించనుంది. 'ఎట్ పేటీఎం' హ్యాండిల్‌ను కూడా యస్ బ్యాంక్‌కు అప్పగించనున్నట్లు వెల్లడించింది.

పీపీబీఎల్‌లో 20 శాతం ఉద్యోగాల కోత: ఆర్‌బీఐ నిషేధంతో సేవలు దాదాపుగా నిలిచిపోనున్న నేపథ్యంలో పీపీబీఎల్ 20 శాతం ఉద్యోగాలకు కోత పెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

హైదరాబాద్‌లో డబ్ల్యూఎన్ఎస్ డెలివరీ సెంటర్

హైదరాబాద్: మరో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ హైదరాబాద్‌లో కొలువు తీరింది. బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) సేవల్లో ప్రముఖ సంస్థగా పేరొందిన డబ్ల్యూఎన్ఎస్ హైదరాబాద్‌లో తన డెలివరీ సెంటర్ ఏర్పాటు చేసింది. కంపెనీ ఈ కేంద్రం ద్వారా షిప్పింగ్, లాజిస్టిక్స్ హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా, హైటెక్ రంగాలకు తన డిజిటల్ సొల్యూషన్స్ సేవలు అందించనుంది. 'నిపుణులైన ఉద్యోగుల లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహం హైదరాబాద్‌లో ఐటీ-బీపీఎం రంగ అభివృద్ధికి అద్భుత అవకాశాలు కల్పిస్తున్నాయి' అని డబ్ల్యూఎన్ఎస్ గ్రూప్ సీఈఓ కేశవ్ ఆర్ మురుగేశ్ తెలిపారు. డబ్ల్యూఎన్ఎస్‌కు ఇప్పటికే విశాఖపట్నంతో పాటు చెన్నై, బెంగళూరుతో సహా తొవిృది ప్రధాన నగరాల్లో బీపీఎం సేవల డెలివరీ కేంద్రాలు ఉన్నాయి. హైదరాబాద్ డెలివరీ కేంద్రం పదోది.

యూనికార్న్‌లతో ఐదు కోట్ల కొలువులు: సీఐఐ

న్యూఢిల్లీ: ఉద్యోగాల కల్పనలో యూనికార్న్ స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించబోతున్నాయి. 2030 నాటికి వీటి ద్వారా కొత్తగా ఐదు కోట్ల ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) గురువారం విడుదల చేసిన ఒక నివేదిక ఈ విషయం తెలిపింది. ఉద్యోగాలకు తోడు యూనికార్న్ స్టార్టప్స్‌లో ద్వారా 2030 నాటికి మన ఆర్థిక వ్యవస్థకు లక్ష కోట్ల డాలర్ల జీడీపీ జత అవుతుందని పేర్కొంది. వంద కోట్ల డాలర్ల కంటే ఎక్కువ విలువకు చేరిన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా వ్యవహరిస్తారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,110 ▲	60,600 ▲	80,000 ▲
ముంబై	65,523 ▲	60,019 ▲	73,781 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	418
15వ తేదీ		విశాఖపట్నం	425
చిత్తూరు	463	వరంగల్	392
గోదావరి	418	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	గోదావరి	106
వరంగల్	104	విజయవాడ	106
కరీంనగర్	104	గుంటూరు	110
మహబూబ్‌నగర్	104	ఒంగోలు	110
కర్నూలు	104	చిత్తూరు	116
విశాఖపట్నం	103		

వయాకామ్ 18లో పారామౌంట్ వాటా రిలయన్స్ చేతికి..

డీల్ విలువ రూ.4,286 కోట్లు

న్యూఢిల్లీ: భారత టెలివిజన్ చానళ్ల సంస్థ వయాకామ్ 18 మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో తనకున్న 13.01 శాతం వాటాను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు రూ.4,286 కోట్లకు విక్రయించేందుకు పారామౌంట్ గ్లోబల్ అంగీకరించింది. పారామౌంట్ గ్లోబల్‌కు చెందిన రెండు అనుబంధ సంస్థల నుంచి ఈ వాటాను కొనుగోలు చేసేందుకు విధిగా కట్టుబడి ఉండే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది. అలాగే, నియంత్రణ మండళ్ల అనుమతులతో పాటు ఇప్పటికే రిలయన్స్, వయాకామ్ కలిసి స్టార్ డిస్నీతో కుదుర్చుకున్న జాయింట్ వెంచర్ డీల్ పూర్తి అయ్యాక ఈ లావాదేవీ పూర్తవుతుందని పారామౌంట్ వెల్లడించింది.

● స్వల్పంగా తగ్గిన టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: దేశంలో టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) ఫిబ్రవరిలో 0.2 శాతం తగ్గింది. జనవరి నెలలో డబ్ల్యూపీఐ సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 0.27 శాతం ఉంది. ఆహార వస్తువుల ధరలు పెరిగినప్పటికీ ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గడం విశేషం. గత ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం ప్రతికూల స్థితిలోనే ఉంది. చివరికి నవంబరులో 0.26 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఇది 3.85 శాతం ఉంది.

● రికాన్ టెక్నాలజీస్ నుంచి మహీంద్రా పవరాల్ జెన్‌సెట్స్



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి మహీంద్రా పవరాల్ జెన్‌సెట్స్‌ను రికాన్ టెక్నాలజీస్ విడుదల చేసింది. రికాన్ టెక్నాలజీస్..మహీంద్రా పవరాల్ జెన్‌సెట్స్‌కు అధీకృత జనరేటర్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారుగా ఉంది. 625 కేవీఏ సామర్థ్యం వరకు గల ఈ జెన్‌సెట్స్‌ను తెలుగు రాష్ట్రాల మార్కెట్లకు తగ్గట్టుగా హైదరాబాద్ ప్లాంట్‌లో తయారు చేసినట్లు రికాన్ టెక్నాలజీస్ ఎండీ వేణు వినోద్ తెలిపారు.

మార్కెట్లో రికవరీ ర్యాలీ

- సెన్సెక్స్ 335 పాయింట్లు అప్
- 22,100 ఎగువ స్థాయికి నిఫ్టీ
- స్మాల్, మిడ్‌క్యాప్ సూచీల హైజంప్
- రూ.7.81 లక్షల కోట్లు పెరిగిన సంపద

ముంబై: బుధవారం సెషన్‌లో భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం ట్రేడింగ్‌లో కాస్త కోలుకున్నాయి. ఐటీ, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఒక దశలో 602 పాయింట్లకు పైగా పెరిగి 73,364 స్థాయికి చేరిన సెన్సెక్స్.. చివరికి 335.39 పాయింట్ల లాభంతో 73,097.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 148.95 పాయింట్ల వృద్ధితో 22,146.65 వద్ద క్లోజైంది. వరుసగా మూడు రోజుల పాటు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్న చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలోనైతే జోరుగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3.11 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.28 శాతం ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో సర్వీసెస్, టెలికాం, యుటిలిటీస్, ఆయిల్ అండ్ గ్యాస్ మూడు శాతానికి పైగా పుంజుకున్నాయి. రికవరీ ర్యాలీతో మార్కెట్ వర్గాల సంపద ఒక్కరోజులోనే రూ.7.81 లక్షల కోట్లు పెరిగి మొత్తం రూ.379.98 లక్షల కోట్లకు చేరుకుంది.

గోపాల్ స్నాక్స్ లిస్టింగ్.. ఫ్చ్

గోపాల్ స్నాక్స్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్లను నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.401తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 12.71 శాతం డిస్కౌంట్‌తో రూ.350 వద్ద లిస్టయింది. ఒక దశలో 14.71 శాతం నష్టంతో రూ.342 వద్దకు జారుకున్న షేరు.. చివరికి 10.21 శాతం నష్టంతో రూ.360.05 వద్ద స్థిరపడింది. సోమవారంతో ముగిసిన కంపెనీ ఐపీఓకు మాత్రం ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందనే లభించింది. ఇష్యూ సైజుకు 9.02 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

రూ.250 కోట్లతో శ్రీసిటీ ప్లాంట్ విస్తరణ : బ్లూస్టార్

కోల్‌కతా: హోమ్ అప్లయెన్సెస్ కంపెనీ బ్లూస్టార్ శ్రీసిటీలోని రూమ్ ఎయిర్ కండిషనర్ల తయారీ యూనిట్‌లో సామర్థ్యాల విస్తరణపై రూ.250 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ప్రస్తుతం శ్రీసిటీ ప్లాంట్ సహా వివిధ ప్లాంట్లలో రూమ్ ఏసీల వార్షిక తయారీ సామర్థ్యం 10 లక్షల యూనిట్లుంది. సమీప భవిష్యత్తులో రూమ్ ఏసీల తయారీ సామర్థ్యాన్ని 18 లక్షలకు పెంచాలన్నది తమ లక్ష్యమని కంపెనీ ఎండీ బీ త్యాగరాజన్ అన్నారు. ఇందులో భాగంగానే వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీసిటీ ప్లాంట్‌లో రూమ్ ఏసీల తయారీ సామర్థ్యం 3 లక్షల యూనిట్ల మేరకు పెంచాలనుకుంటున్నామని, ఇందుకు రూ.250 కోట్లు ఖర్చు చేస్తామని వెల్లడించారు.

నెల్లూరు జిల్లాలో భారీ ఇండస్ట్రియల్ హబ్

చెన్నాయపాలెం-అన్నెమడుగులో ఏర్పాటు

అమరావతి (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కావలి మండలంలో భారీ పారిశ్రామిక కేంద్రం రాబోతుంది. కావలి మండలం చెన్నాయపాలెం, అన్నెమడుగు గ్రామాల పరిధిలో 1211.64 ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం భూసేకరణ చేయాలని ఏపీఐఐసీ రెవెన్యూశాఖను కోరింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ చర్యలు చేపట్టింది. 1211 ఎకరాల భూమి సేకరించాలంటే 2013 నాటి కేంద్ర భూ సేకరణ చట్టం ప్రకారం ఆహారభద్రత, సామాజిక భద్రత వంటి అంశాలపై తొలుత సమగ్ర అధ్యయనం చేయాలి. ఆ తర్వాతే భూ సేకరణ చేపట్టాలి. అయితే, పారిశ్రామిక కేంద్రం ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేది కాబట్టి కేంద్ర భూ సేకరణ చట్టంలోని చాప్టర్ 2,3 లను ఈ ప్రాజెక్టుకు వర్తింపచేయకూడదని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు ఇండస్ట్రియల్ హబ్ భూ సేకరణను ఆ చాప్టర్ల నుంచి మినహాయించాలని నెల్లూరు కలెక్టర్ రెవెన్యూ శాఖను కోరారు. దీంతో చెన్నాయపాలెం-అన్నెమడుగు ఇండస్ట్రియల్ హబ్ భూసేకరణను మినహాయింపునిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ.. మార్కెట్లోకి త్రీ వీలర్ ప్యాసింజర్ వెహికల్ గ్రీవ్స్ ఎల్ట్రా సిటీ తీసుకువచ్చింది. 9.6 కిలోవాట్ మోటార్, 10.8 కేడబ్ల్యూహెచ్ లిథియం అయాన్ బ్యాటరీతో ఈ ఆటోను రూపొందించింది. ఒకసారి చార్జింగ్‌తో ఈ ఆటో 160 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. మూడేళ్ల వారంటీని అందిస్తోంది.

స్పోర్ట్స్



సింధు ఇంటిదారి..

- క్వార్టర్స్‌లో లక్ష్యసేన్
- సాత్విక్, అశ్విని జోడీలు అవుట్
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్‌లో గురువారం భారత్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. పురుషుల సింగిల్స్‌లో ఒక్క లక్ష్యసేన్ తప్ప అందరూ ఇంటిదారి పట్టారు. డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్, అశ్విని జోడీలు ఓటమిపాలయ్యారు. రెండో రౌండ్‌లో సింధు 19-21, 11-21తో డిఫెండింగ్ చాంప్, టాప్ సీడ్ అన్ సి యంగ్ (కొరియా) చేతిలో వరుస గేముల్లో చిత్తయింది. మరోవైపు స్ఫూర్తిదాయక ప్రదర్శనతో వరల్డ్ నెం:18 లక్ష్య సేన్ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ప్రీక్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 24-22, 11-21, 21-14తో 4వ సీడ్ ఆండ్రెస్ అంటాన్‌సెన్ (డెన్మార్క్)పై పోరాడి గెలిచాడు. గంటా 20 నిమిషాలపాటు సాగిన పోరులో కీలక సమయాల్లో ఒత్తిడికి గురికాకుండా సేన్ అద్భుత ఆటను ప్రదర్శించాడు.

వరుస తప్పిదాలతో..: కొరియా షట్లర్ అన్ సి యంగ్‌తో 42 నిమిషాలపాటు సాగిన పోరులో సింధు అటాకింగ్ గేమ్ ఆడే ప్రయత్నంలో పదేపదే తప్పులు చేయగా.. ప్రత్యర్థి మాత్రం విభిన్నమైన షాట్లు, ర్యాలీలతో ప్రత్యర్థిని ఇబ్బందిపెట్టింది. యంగ్ చేతిలో ఒక్క మ్యాచ్ కూడా నెగ్గని సింధుకు ఇది వరుసగా ఏడో పరాజయం కావడం గమనార్హం. తొలి గేమ్‌లో సింధు 16-17తో గట్టిపోటీ ఇచ్చేలా కనిపించింది. సింధు మూడు గేమ్‌పాయింట్లు కాచుకున్నా.. యంగ్‌ను అడ్డుకోలేక పోయింది. ఇక, రెండో గేమ్‌లో కొరియన్ ఆధిపత్యం ముందు సింధు ఏమాత్రం నిలబడలేక పోయింది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 21-11, 11-21, 11-21తో చైనాకు చెందిన జాంగ్ షు జియాన్-జంగ్ యు చేతిలో పరాజయం పాలైంది.

సాత్విక్ జంటకు షాక్..: డబుల్స్ వరల్డ్ నెం:1 సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి 16-21, 15-21తో ఇండోనేసియాకు చెందిన మహ్మద్ షోహిబుల్ ఫిక్రి-మౌలానా బగాస్ చేతిలో పరాజయం పాలయ్యారు. తొలి గేమ్ ఆరంభం నుంచే ఇరు జోడీలు హోరాహోరీగా తలపడడంతో ఆధిక్యం చేతులు మారుతూ సాగింది. 16-19 స్కోరు వద్ద తప్పిదాలు చేసిన సాత్విక్ జోడీ తొలి గేమ్‌ను చేజార్చుకొంది. ఇక, రెండో గేమ్‌లోనూ భారత జంట తడబడింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఇండోనేసియా జోడీ గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

హార్దిక్ కాదు.. రోహిత్‌నే ఉంచాల్సింది



న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ మార్పుపై టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. సారథిగా రోహిత్ శర్మను కొనసాగించాల్సి ఉండాల్సిందన్నాడు. 'ఐదుసార్లు ఐపీఎల్ నెగ్గిన రోహిత్‌ను సారథ్య బాధ్యతల నుంచి తప్పించడమనేది చాలా పెద్ద నిర్ణయం. ఈ సీజన్ వరకు అతడినే కెప్టెన్‌గా కొనసాగించి.. హార్దిక్ పాండ్యాను ఉప సారథిగా నియమించి ఉండాల్సింది. ఆ తర్వాత నాయకత్వ మార్పు చేసివుంటే ఎటువంటి సమస్యలూ ఉత్పన్నమయ్యేవి కావ'ని యువీ అభిప్రాయపడ్డాడు. ఇప్పుడు హార్దిక్‌పై ఎంతో ఒత్తిడి నెలకొనే అవకాశం ఉందన్నాడు. కాగా హిట్‌మ్యాన్ స్థానంలో పాండ్యాకు ముంబై పగ్గాలు అప్పగించడం ఎంతో వివాదాస్పదమైందని దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలీర్స్ అన్నాడు. కానీ, వాటి నుంచి బయటపడిన ముంబై.. భవిష్యత్‌పై దృష్టిసారించిందని చెప్పాడు.



ముంబై ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- 8 ఏళ్ల తర్వాత రంజీ టైటిల్
- 169 రన్స్ తేడాతో విదర్భ చిత్తు

ముంబై: రంజీల్లో ముంబై జట్టు నిరీక్షణ ఫలించింది. గురువారం ముగిసిన ఫైనల్లో విదర్భను 169 పరుగుల తేడాతో చిత్తు చేసిన ముంబై ఎనిమిదేళ్ల తర్వాత విజేతగా నిలిచింది. 2015-16 సీజన్‌లో జట్టు చివరిసారి టైటిల్ దక్కించుకుంది. ఓవరాల్‌గా ముంబైకిది 42వ రంజీ ట్రోఫీ కావడం విశేషం. అలాగే 2016-17, 2021-22 సీజన్లలో ఫైనల్ వరకు చేరినా రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. ఇక 538 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన విదర్భ ఆఖరి రోజున రెండో ఇన్నింగ్స్‌లో 368 పరుగులకు ఆలౌటైంది. అక్షయ్ వాడ్కర్ (102), హర్ష్ దూబే (65) రాణించారు. తనూష్‌కు నాలుగు, ముషీర్.. తుషార్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. గురువారం 248/5 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట ఆరంభించిన విదర్భ జట్టు విజయానికి మరో 290 పరుగుల దూరంలోనే ఉండడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే రెండో సెషన్‌నుంచి వికెట్లు పడిపోవడంతో విదర్భ పోరాటం పరిసమాప్తమైంది. అలాగే కెరీర్‌లో ఆఖరి మ్యాచ్ ఆడిన పేసర్ ధవల్ కులకర్ణి ప్రత్యర్థి చివరి వికెట్‌ను తీసి మ్యాచ్‌ను ముగించాడు. ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 224, విదర్భ 105 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 418 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ముషీర్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా తనూష్ కోటియన్ నిలిచారు.

విజేతకు రూ. 10 కోట్లు: రంజీ విజేతగా నిలిచిన తమ జట్టు ప్రైజ్‌మనీని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) రెట్టింపు చేసింది. దీంతో ఆటగాళ్లకు రూ.10 కోట్లు దక్కనుంది.

కంగ్రాట్స్ తమ్ముడూ.. : సర్ఫరాజ్



రంజీ ఫైనల్లో ముంబై తరఫున సెంచరీ బాదిన ముషీర్ ఖాన్‌ను అతడి అన్న, టీమిండియా సభ్యుడు సర్ఫరాజ్ ఖాన్ అభినందించాడు. ఈమేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలను పోస్ట్ చేశాడు. 2022 ఫైనల్‌లో ముంబై తరఫున సర్ఫరాజ్ 134 రన్స్‌తో అత్యధిక స్కోరు సాధించగా.. ముషీర్ ఆ రికార్డును 136 రన్స్‌తో అధిగమించాడు.

శరత్ మరో సంచలనం



సింగపూర్: వెటరన్ టేబుల్ టెన్నిస్ స్టార్ శరత్ కమల్ సింగపూర్ స్మాష్ టోర్నీలో జోరు కొనసాగిస్తున్నాడు. శరత్ తనకన్నా మెరుగైన ర్యాంక్ ఆటగాళ్లను ఓడిస్తూ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరాడు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 88వ ర్యాంకర్ శరత్... వరల్డ్‌నెంబర్ 22 ఒమర్ అస్సర్ (ఈజిప్ట్)పై 11-4, 11-8, 12-10 తేడాతో సునాయాసంగా గెలిచి మరో సంచలనం సృష్టించాడు. అంతకుముందు వరల్డ్‌నెంబర్ 13 డార్కో జోర్గిక్ (స్లొవేనియా)ను సైతం శరత్ మట్టికరిపించాడు. ఇక క్వార్టర్స్‌లో శరత్ ఫ్రాన్స్‌కు చెందిన ఫెలిక్స్ లెబ్రున్‌తో తలపడనున్నాడు. మరోవైపు ఈ ప్రదర్శనతో సింగిల్స్‌లో శరత్ ర్యాంకు మెరుగుకానుండడంతో ఒలింపిక్ అవకాశాలు కూడా పెరగనున్నాయి.

ముంబై, కాలికట్‌లకు విజయాలు



చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ సూపర్-5లో ముంబై మీటియర్స్ బోణీ చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 15-8, 13-15, 7-15, 16-14, 15-13తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కాలికట్ హీరోస్ 18-16, 16-14, 8-15, 11-15, 15-10తో బెంగళూరు టోర్పడోస్‌ను ఓడించింది.



హర్మన్‌ప్రీత్
మంధాన

ఫైనల్ చేరేదెవరు?

రాత్రి 7.30 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో...

నేటి ఎలిమినేటర్‌లో ముంబై × బెంగళూరు

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో సమవుజ్జీలైన ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్లు శుక్రవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకోన్నాయి. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు.. ఆదివారం జరిగే ఫైనల్లో ఢిల్లీతో తలపడనుంది. డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన ముంబై.. ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో ఆడలేదనే చెప్పుకోవాలి. అయితే, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ మంచి ఫామ్‌లో ఉండడం ఆ జట్టుకు పెద్ద ప్లస్. అమేలియా కెర్, బ్రంట్, షబ్నిం ఇస్మాయిల్ రాణిస్తున్నారు. మరోవైపు బెంగళూరు ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శనే చేస్తోంది. చివరి లీగ్ మ్యాచ్‌లో పెర్రీ ఆల్‌రౌండ్ షోతో ముంబైను చిత్తు చేసింది. సారథి స్మృతి మంధాన బ్యాట్‌తో మెరుస్తుండగా.. రిచా ఘోష్ ఆకట్టుకొంటోంది. బెంగళూరు పోరాడుతున్న తీరుచూస్తుంటే.. ముంబైకి గట్టిపోటీ ఇచ్చేలా కనిపిస్తోంది.



పడి.. లేచాడు

పంత్ కోలుకున్న తీరు అద్భుతం
డాక్టర్ల వెల్లడి





బెంగళూరు: రిషభ్ పంత్.. భారత క్రికెట్‌లోకి వేగంగా దూసుకొచ్చి వికెట్ కీపర్‌గా, విధ్వంసకర బ్యాటర్‌గా జట్టు విజయాల్లో కీలకంగా నిలిచాడు. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్‌లో అతడి ఆటతీరుతోనే భారత్ గట్టెక్కిన సందర్భాలున్నాయి. అలాంటిది.. ఓ ఘోర కారు ప్రమాదానికి గురై ఇక నడవడమే కష్టమనే పరిస్థితి నుంచి, నేడు మైదానంలో క్రికెట్ బ్యాట్ పట్టే వరకు చేరాడంటే పంత్ అసాధారణ మానసిక స్థితిని ప్రశంసించాల్సిందే. తనకు చికిత్స చేసిన డాక్టర్లు కూడా ఇదే మాట చెబుతున్నారు. తాము నిర్దేశించి సమయం కంటే మూడు నెలల ముందే కోలుకున్నాడని పంత్‌కు చికిత్స చేసిన డాక్టర్ దిన్షా పార్దివాలా కొనియాడాడు. 'ఆస్పత్రిలో చేరాక పంత్ కుడి మోకాలికి ఏకంగా మూడు ఆపరేషన్లు చేశాం. పాదం, మణికట్టు ఎముకలు కూడా విరిగాయి. వాస్తవానికి మోకాలి చిప్ప పక్కకు జరగడం చాలా తీవ్రమైందే. దీన్ని సాధారణ స్థితికి తీసుకురావడం డాక్టర్లకు సవాల్‌గా మారింది. అలాగే అటు పేషెంట్ కూడా ఈ సమయంలో మానసికంగా ధృడంగా ఉండాలి. ఈ విషయంలో మా బృందం అతడిని నిరంతరం ప్రోత్సహించింది. పంత్‌ను ఎప్పటిలాగే నడిచేట్టు చేస్తామని తన తల్లికి కూడా హామీ ఇచ్చాం. తొలి దశ ఆపరేషన్‌ను సక్సెస్ చేశాక, గాయపడిన భాగాన్ని బలోపేతం చేసి కదలికలు జరిగేలా చూశాం. ఈ దశలో సాధారణ స్థితికి చేరేందుకు 18 నెలల సమయం పట్టవచ్చని చెప్పాం. కానీ పంత్ మాత్రం ఏడాదిలోపే ఫిట్‌నెస్ సాధించి చూపిస్తానని ధీమాగా చెప్పాడు. అన్నట్టుగానే 15 నెలల్లోనే తిరిగి బ్యాట్ పట్టడం అద్భుతమనే చెప్పాలి' అని కోకిలాబెన్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ దిన్షా తెలిపాడు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ మంత్రులు ప్రత్తిపాటి, ఆలపాటి తదితరులు

చకచకా వేదిక నిర్మాణం

ఎల్లుండి బొప్పూడిలో కూటమి ఉమ్మడి సభ

చిలకలూరిపేట, మార్చి 14: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి వేదికగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో ఉమ్మడి సభ 17న నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి నుంచే ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈ సభకు దాదాపు 15లక్షల మంది హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. బొప్పూడి వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 200 ఎకరాల్లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇంకా రెండు రోజులే సమయం ఉండటంతో పనులు వేగవంతం చేశారు. వాహన పార్కింగ్ కోసం వేదికకు దగ్గరలోనే జాతీయ రహదారి పక్కన ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే రామరాజు, ఇతర టీడీపీ నేతలు ఏర్పాట్లను గురువారం పరిశీలించారు.

ఇండియా కూటమిదే అధికారం: రఘువీరారెడ్డి

మడకశిర, మార్చి 14: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోను, రాష్ట్రంలోను ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీ రాదని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారం చేపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తారని, ఒకవేళ ప్రధాని పదవిని రాహుల్ గాంధీ నిరాకరిస్తే కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని అవుతారని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 88 మంది ఎమ్మెల్యేలు అవసరమని, ఏ పార్టీకీ అన్ని సీట్లు వచ్చే అవకాశం లేదని అన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ సహకారంతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వస్తుందని అన్నారు.

ఏ సర్వే చెప్పినా ఇదే ఫలితం: లోకేశ్

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'ఇటీవల ఇండియా టుడే... నేడు ఏబీపీ, న్యూస్ 18... ఏ సర్వే గణాంకాలు వెల్లడైనా ఏపీలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమిదే తిరుగులేని విజయమని తేల్చేస్తున్నాయి' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అన్నారు. గురువారం ఎక్స్ వేదికగా సర్వేలపై స్పందించారు. 'ఏపీలో మెజారిటీ లోక్‌సభ స్థానాల్లో టీడీపీ, జనసేన విజయం సాధిస్తాయని గతంలో ఇండియా టుడే సర్వే వెల్లడించగా, ప్రముఖ జాతీయ మీడియా సంస్థ ఏబీపీ సర్వే ప్రకారం ఏపీలో 25 లోక్‌సభ స్థానాలకు 20 చోట్ల ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని తేలింది. ప్రజావ్యతిరేక తుఫాన్‌లో వైసీపీకి అంతిమ యాత్ర ఖాయం. వైసీపీ జెండా పీకి, శాశ్వతంగా గోతిలో పాతిపెట్టే సమయం ఆసన్నమైంది' అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

టీడీపీలో చేరిన కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్



అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ గురువారం టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంలో, ఆయన సమక్షంలో గురువారం సంజీవ్ కుమార్ పార్టీలో చేరారు. పసుపు కండువా కప్పి ఆయనను చంద్రబాబు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సంజీవ్‌కుమార్‌తో పాటు పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ పాలకుర్తి రమేశ్, వెంకాయపల్లి ఆలయ చైర్మన్ బేతం కృష్ణుడు, వాల్మీకి సంఘం నాయకులు ముండ్ల శేఖర్, తలారి కృష్ణ, ఎన్జీఓ మాజీ నాయకులు కుబేరస్వామి, నరసింహులు, శాంతకుమారి తదితరులు చేరారు.

ఓడిపోయినా పర్వాలేదు: ధర్మాన

శ్రీకాకుళం అర్బన్, మార్చి 14: రానున్న ఎన్నికల్లో తాను ఓడిపోయినా పర్వాలేదని మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. నగరంలోని టౌన్ హాల్‌లో మంత్రి ధర్మాన గురువారం వైశ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ఇప్పటికైనా వైశ్యులంతా నన్ను విశ్వసించడం ఆనందంగా ఉంది. నాకు ఓట్లు పడకపోయినా.. ఓడిపోయినా పర్వాలేదు' అని అన్నారు. కాగా, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొద్ది రోజులుగా శంకుస్థాపనల హడావుడిలో మునిగిపోయారు. గురువారం నగరంలో శంకుస్థాపనలు పూర్తయ్యాక.. రూరల్ మండలంలోని కిల్లిపాలెంలో రోడ్లు, డ్రైనేజీ పనుల శంకుస్థాపనకు పయనమయ్యారు. కిల్లిపాలెం చేరుకున్న తర్వాత.. శంకుస్థాపన స్థలం ఎక్కడో తెలియక.. మంత్రి సహా అంతా అయోమయంలో పడ్డారు. శంకుస్థాపన స్థలం రెడ్డికిల్లిపాలెంలోని ఎంపీపీ స్కూల్ దగ్గర అయితే.. మంత్రి మాత్రం కిల్లిపాలెం హైస్కూల్‌కు చేరుకోవడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఎక్కడ శంకుస్థాపన చేయాలో తెలియకుండానే మంత్రి వచ్చారంటూ గ్రామస్థులు చర్చించుకోవడం కనిపించింది.

చంద్రబాబుతో మోహనకృష్ణ భేటీ

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ గురువారం పార్టీ అధినేత చంద్రబాబుని కలిశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మోహనకృష్ణకు మంచి పేరే ఉన్నప్పటికీ సామాజికవర్గాల సమతుల్యంలో భాగంగా ఆ నియోజకవర్గం నుంచి బీసీ అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చంద్రబాబు చెప్పారు. పార్టీ అధికారంలోకి రాగానే మన్నవకు ఎమ్మెల్సీ గాని, గుంటూరు మేయర్ పదవి గాని ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

పట్టున్నవారికే పట్టం!

(మొదటి పేజీ తరువాయి)

'ఎక్స్' వేదికగా విడుదల చేశారు. కొన్నిచోట్ల మార్పుపై తర్జనభర్జనలు జరిగినా ప్రజల్లో సానుకూలత ఉందనుకున్న చోట సీనియర్లకే అవకాశం ఇచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరు దీనికి ఉదాహరణ. వయోవృద్ధుడైన మాజీ ఎమ్మెల్యే ఎన్.వరదరాజులురెడ్డి(81)కి టికెట్‌లభించింది. ఆయన వయసు రీత్యా బాగా సీనియర్. ఆయన కంటే ఆర్థికంగా బాగా స్థితిమంతులు, యువ నేతలు పోటీపడ్డారు. కానీ పార్టీ సర్వేల్లో ప్రజాదరణలో వరదరాజులురెడ్డికే ఎక్కువ మొగ్గు ఉన్నట్లు తేలింది. దీంతో ఆయనకే అవకాశమిచ్చారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత తనకు నియోజకవర్గ బాధ్యతలు వద్దంటూ వైదొలిగారు. అక్కడ బత్తుల తాతయ్యబాబును ఇన్‌చార్జిగా నియమించారు. రెండేళ్ల తర్వాత మళ్లీ రాజు పార్టీ పనికి ముందుకొచ్చారు. తాతయ్యబాబుతో వైరం పెట్టుకోకుండా కలిసి పనిచేశారు. ఇప్పుడు సర్వేలు చేస్తే ప్రజలు ఆయనవైపే మొగ్గు చూపారు. ఆర్థిక స్తోమత లేకపోయినా ప్రజాదరణ వల్ల ఆయనకు అవకాశం దక్కింది. మొదటి జాబితాలో నంద్యాల అసెంబ్లీ సీటును ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన టీడీపీ.. రెండో జాబితాలో గుంటూరు తూర్పు, మదనపల్లె సీట్లను ఆ వర్గానికే చెందిన మహమ్మద్ నజీర్, షాజహాన్ బాషాలకు కట్టబెట్టింది. ఒక టీవీ చానల్లో పాత్రికేయుడిగా పనిచేసిన డాక్టర్ మురళీమోహన్‌కు పూతలపట్టు (ఎస్సీ) స్థానం కేటాయించారు. రంపచోడవరం (ఎస్టీ)లో అంగన్వాడీ మాజీ కార్యకర్త శిరీషకు అవకాశం దక్కింది. గుంటూరు జిల్లా పెదకూరపాడు స్థానం రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త భాష్యం ప్రవీణ్‌కు దక్కింది.

ముప్పిడి ఇటూ ఇటూ

రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలో టీడీపీ దళిత నేత, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అంశం ఆసక్తికరంగా మారింది. ఆయన గతంలో గోపాలపురం(ఎస్సీ) ఎమ్మెల్యేగా చేశారు. ఆ నియోజకవర్గంలో ఒక వర్గం ఈసారి కూడా ఆయనకే టికెట్ ఇవ్వాలని కోరింది. అదే లోక్‌సభ స్థానం పరిధిలోని కొవ్వూరు (ఎస్సీ) నియోజకవర్గ టీడీపీ నేతలు సైతం అనూహ్యంగా ఆయన్ను తమ స్థానంలో నిలబెట్టాలని అధిష్ఠానాన్ని కోరడం విశేషం. ఒక దళిత నేత కోసం రెండు నియోజకవర్గాల నుంచి అభ్యర్థనలు రావడం అరుదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. చివరకు ముప్పిడిని కొవ్వూరు అభ్యర్థిగా ఎంపిక చేశారు.

కుటుంబ సభ్యులకు అవకాశం..

కొన్నిసీట్లలో ప్రస్తుత ఇన్‌చార్జుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం లభించింది. కడప జిల్లా కమలాపురంలో ప్రస్తుత ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి బదులు ఆయన కుమారుడు చైతన్యరెడ్డికి, తిరుపతి జిల్లా వెంకటగిరి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్థానంలో ఆయన కుమార్తె సాయి లక్ష్మీప్రియకు, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో మాజీ మంత్రి, ప్రస్తుత ఇన్‌చార్జి పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూర, అదే జిల్లా కదిరిలో ప్రస్తుత ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్ సతీమణి యశోదాదేవికి టికెట్లు ఇచ్చారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల రాజా ఆకస్మికంగా మరణించడంతో ఆయన సతీమణి సత్యప్రభకు టికెట్ ఇచ్చారు.

- కమలాపురం, కదిరిలో నేతల కుటుంబ సభ్యులకు అవకాశం
- బీసీ కోటాలో గుంటూరు పశ్చిమకు మాధవి
- మంత్రాలయంలో రాఘవేందర్ కూడా..
- వైసీపీ నుంచి వచ్చిన ఆనం, ఆదిమూలానికి సీట్లు
- పూతలపట్టులో పాత్రికేయుడికి చాన్సు
- రంప టికెట్ అంగన్వాడీ కార్యకర్తకు

● వైసీపీ నుంచి వచ్చిన ఇద్దరు సిటింగ్ ఎమ్మెల్యేలకు రెండో జాబితాలో టీడీపీ టికెట్లు లభించాయి. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు టికెట్ ఇవ్వగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.. అదే నియోజకవర్గానికి టీడీపీ టికెట్ పొందారు. టీడీపీలోకి వచ్చిన వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సతీమణి ప్రశాంతికి కోవూరు సీటిచ్చారు.

బీసీ కోణంలో..

గుంటూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఒక సీటు తప్పనిసరిగా బీసీ వర్గాలకు ఇవ్వాలన్న నిర్ణయంతో గుంటూరు పశ్చిమ సీటు పిడుగురాళ్ల మాధవికి దక్కింది. ఆ సీటుకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేరు పరిశీలించినా బీసీ కోణంలో ఆయనకు అవకాశం దక్కలేదు. మంత్రి విడదల రజనితో మాధవి తలపడనున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో సీనియర్ నేత తిక్కారెడ్డి అవకాశం కోల్పోయారు. అక్కడ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రాఘవేందర్‌కు టికెట్ దక్కింది.

ఇంటర్, ఆపైన 29 మంది

టీడీపీ అభ్యర్థుల తాజా జాబితాలో 29మంది అభ్యర్థులు ఇంటర్, ఆపైన చదివినవారే. ఇంటర్ చదివినవారు 8మంది కాగా గ్రాడ్యుయేట్లు-9, పీజీ-11, పీహెచ్‌డీ-1, టెన్త్‌లోపు చదివినవారు ఐదుగురు ఉన్నారు. 75 ఏళ్లు మించిన అభ్యర్థులు ఇద్దరు ఉన్నారు. వీరిలో వరదరాజులురెడ్డికి 81ఏళ్లు కాగా... గోరంట్ల బుచ్చయ్యచౌదరికి 77 ఏళ్లు. 25-35 ఏళ్ల మధ్య ఇద్దరు, 36-45 మధ్య 8, 45-60 మధ్య 19, 61-75 మధ్య ముగ్గురు అభ్యర్థులు ఉన్నారు. తాజా జాబితాలో టికెట్లు పొందిన 34 మందిలో ఏడుగురు మహిళలు ఉన్నారు.

16 స్థానాలు త్వరలోనే ఖరారు

మొత్తం 175 అసెంబ్లీ సీట్లకు గాను జనసేన, బీజేపీతో పొత్తులో భాగంగా టీడీపీ 144 స్థానాల్లో పోటీ చేయనుంది. వీటిలో ఇప్పటికి రెండు జాబితాల్లో కలిపి 128 సీట్లకు అభ్యర్థులను ప్రకటించగా.. ఇంకా 16 స్థానాలకు ఖరారు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు టీడీపీ ప్రకటించిన సీట్లలో బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు కలిపి 45శాతం (58సీట్లు) దక్కాయి. ఇందులో ఎస్సీలకు 27, బీసీలకు 24, ఎస్టీలకు 4, మైనారిటీలకు 3 లభించాయి. రెడ్డి సామాజిక వర్గానికి 28, కమ్మ-28, కాపు-8, క్షత్రియ-5, వెలమ-1, వైశ్యులకు రెండు, దక్కాయి.

నేడు టీడీపీ ఎంపీల జాబితా?

టీడీపీ ఎంపీ అభ్యర్థుల జాబితా శుక్రవారం విడుదలయ్యే అవకాశం ఉంది. మొత్తం 25 లోక్‌సభ సీట్లకు గాను పొత్తులో భాగంగా టీడీపీ 17 స్థానాల్లో పోటీచేయనుంది. టీడీపీ వర్గాల అంతరంగిక సమాచారం ప్రకారం ఇప్పటికి ఖరారైన అభ్యర్థులు.. శ్రీకాకుళం-కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విశాఖపట్నం-ఎం.భరత్, విజయవాడ-కేశినేని శివనాథ్ (చిన్ని), ఒంగోలు-మాగుంట రాఘవరెడ్డి, గుంటూరు-పెమ్మసాని చంద్రశేఖర్, నెల్లూరు-వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నరసరావుపేట-లావు శ్రీకృష్ణదేవరాయలు, చిత్తూరు (ఎస్సీ)-దగ్గుమళ్ల ప్రసాదరావు, రాజంపేట-సుగవాసి బాలసుబ్రమణ్యం, నంద్యాల-బైరెడ్డి శబరి. ఇంకా అమలాపురం(ఎస్సీ), బాపట్ల(ఎస్సీ), కర్నూలు, కడప, ఏలూరు, అనంతపురం, హిందూపురం స్థానాలకు అభ్యర్థులపై చంద్రబాబు కసరత్తు కొనసాగిస్తున్నారు.

టీడీపీ రెండో జాబితా ఇదీ..

నియోజకవర్గం	అభ్యర్థి	కులం
నరసన్నపేట	భగ్గు రమణమూర్తి	కొప్పుల వెలమ
గాజువాక	పల్లా శ్రీనివాసరావు	యాదవ
చోడవరం	కేఎస్ఎన్ఎస్ రాజు	క్షత్రియ
మాడుగుల	పైలా ప్రసాద్	కొప్పుల వెలమ
ప్రత్తిపాడు	వరుపుల సత్యప్రభ	కాపు
రామచంద్రాపురం	వాసంశెట్టి సుభాష్	శెట్టిబలిజ
రాజమండ్రిరూరల్	గోరంట్ల బుచ్చయ్యచౌదరి	కమ్మ
రంపచోడవరం(ఎస్టీ)	మిర్యాల శిరీష	ఎస్టీ
కొవ్వూరు(ఎస్సీ)	ముప్పిడి వెంకటేశ్వరరావు	మాదిగ
దెందులూరు	చింతమనేని ప్రభాకర్	కమ్మ
గోపాలపురం(ఎస్సీ)	మద్దిపాటి వెంకటరాజు	మాదిగ
పెదకూరపాడు	భాష్యం ప్రవీణ్	కమ్మ
గుంటూరు వెస్ట్	పిడుగురాళ్ల మాధవి	రజక
గుంటూరు ఈస్ట్	మహమ్మద్ నజీర్	ముస్లిం
గురజాల	యరపతినేని శ్రీనివాసరావు	కమ్మ
కందుకూరు	ఇంటూరి నాగేశ్వరరావు	కమ్మ
మార్కాపురం	కందుల నారాయణరెడ్డి	రెడ్డి
గిద్దలూరు	అశోక్‌రెడ్డి	రెడ్డి
ఆత్మకూరు	ఆనం రామనారాయణరెడ్డి	రెడ్డి
కోవూరు	వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి	రెడ్డి
వెంకటగిరి	కురుగొండ్ల లక్ష్మీప్రియ	కమ్మ
కమలాపురం	పుత్తా చైతన్యరెడ్డి	రెడ్డి
ప్రొద్దుటూరు	ఎన్.వరదరాజులురెడ్డి	రెడ్డి
నందికొట్కూరు(ఎస్సీ)	గిత్తా జయసూర్య	మాదిగ
ఎమ్మిగనూరు	జయనాగేశ్వరరెడ్డి	రెడ్డి
మంత్రాలయం	రాఘవేంద్రరెడ్డి	బోయ
పుట్టపర్తి	పల్లె సింధూరారెడ్డి	రెడ్డి
కదిరి	కందికుంట యశోదాదేవి	పద్మశాలి
మదనపల్లె	షాజహాన్ బాషా	ముస్లిం
పుంగనూరు	చల్లా రామచంద్రారెడ్డి (బాబు)	రెడ్డి
చంద్రగిరి	పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని)	కమ్మ
శ్రీకాళహస్తి	బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి	రెడ్డి
సత్యవేడు(ఎస్సీ)	కోనేటి ఆదిమూలం	మాల
పూతలపట్టు(ఎస్సీ)	డాక్టర్ కలికిరి మురళీమోహన్	మాల

సర్వేపల్లిలో సోమిరెడ్డి వారసులకు చాన్స్?

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి వారసులను నిలపడంపై ఆ పార్టీ అధిష్ఠానం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. తుని, కమలాపురం నియోజకవర్గాలకు అనుసరించిన ఫార్ములాను ఇక్కడా అమలు చేయాలని టీడీపీ నాయకత్వం భావిస్తున్నట్లు చెబుతున్నారు. తునిలో యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, కమలాపురంలో పుత్తా నరసింహారెడ్డి తనయుడు చైతన్యరెడ్డిని ప్రకటించారు. అదే మాదిరిగా సర్వేపల్లిలో కూడా సోమిరెడ్డి కొడుకు లేదా కోడలుకు అవకాశం ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం. దీనిపై ఒకటిరెండు రోజుల్లో తుది నిర్ణయం జరిగే అవకాశం ఉంది. అనంతపురం అసెంబ్లీ సీటుపై కూడా టీడీపీ నాయకత్వం తర్జనభర్జనలు పడుతోంది. ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభాకర్ చౌదరిని కొన్నివర్గాలు వ్యతిరేకిస్తుండటంతో ప్రత్యామ్నాయంకోసం అన్వేషిస్తున్నారు. ఎద్దులపాటి నిర్మల, దగ్గుబాటి ప్రసాద్, సుధాకర్ నాయుడు సతీమణి భావన పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఆలూరు అసెంబ్లీ సీటులో వీరభద్ర గౌడ్‌కు అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా గుంతకల్లు సీటుపై నిర్ణయం ఇంకా పెండింగ్‌లో ఉంది. మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం కుటుంబ సభ్యులను ఇక్కడ నిలిపే ఆలోచన ఉంది. రాజంపేటలో జిల్లా పార్టీ అధ్యక్షుడు జగన్మోహన రాజు, పార్టీ నేత పోలు సుబ్బారెడ్డి పేర్లు తుది పరిశీలనలో ఉన్నాయి. జగన్మోహన రాజువైపు మొగ్గు కనిపిస్తోంది. రాయలసీమలో ఎంపీ సీట్లలో ఇంకా కసరత్తు జరుగుతోంది. కడప ఎంపీ సీటుకు వివేకా సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కర్నూలు ఎంపీ సీటుకు బస్తిపాటి నాగరాజు, భాను శంకర్ పేర్లు తుది జాబితాలో చేరాయి. అనంతపురం ఎంపీ సీటుకు పూల నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ రాజేశ్ పేర్లు వినిపిస్తున్నాయి.

పిఠాపురం నుంచే పోటీ

ఎంపీగా పోటీపై త్వరలోనే నిర్ణయం: పవన్



అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): "సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయమని కొందరు, ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లాలని మరికొందరు కోరుతున్నారు. నాకు మాత్రం ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉంది. దత్తాత్రేయుడి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభుడు జన్మించిన పవిత్రమైన నేలగా పేరుగాంచిన పిఠాపురం నుంచి పోటీకి నిలబడుతున్నాను" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పవన్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్న ఉత్కంఠకు తెరదించారు. గురువారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన ఈ మేరకు ప్రకటించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరి కేంద్ర కార్యాలయంలో జనసేన సోషల్ మీడియా ప్రతినిధులతో పవన్ సమావేశమయ్యారు. ఎంపీగా పోటీ చేయాలని చాలామంది సూచిస్తున్నారని, దానిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. 2024 ఎన్నికల్లో జనసేన పోటీచేసే 21 స్థానాల్లో వంద శాతం స్ట్రైక్ రేట్ ఉండేలా ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలని పవన్ పిలుపునిచ్చారు. టీడీపీ, బీజేపీతో కూడిన పొత్తును అందరూ ఆశీర్వదించి, కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపిస్తామని, ఏ ఒక్క పథకం ఆగిపోకుండానే ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. "వచ్చే ఎన్నికల్లో మనం గెలుస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా ముందుకు సాగుతాం. జగన్ చేసిన తప్పులు కర్మల రూపంలో అనుభవించక తప్పదు. ఇంతమంది జనంతో కన్నీరు పెట్టించిన ప్రభుత్వం ఆ కన్నీటితోనే కూలిపోతుంది. జగన్‌ది అధికార దాహం, మదం. అధికారం కోసం ఎంతకైనా దిగజారే వ్యక్తి. ఎవరినీ వదిలేది లేదు. అప్పు చేసిన డబ్బులు పంచుకుంటూపోతే శ్రీలంక అధ్యక్షుడికి పట్టిన గతే ఈ ముఖ్యమంత్రికి కూడా పడుతుంది" అని పవన్ హెచ్చరించారు. 'జనసేనకు ఓట్లు పెరిగాయి, బలం పెరిగిందని ప్రత్యేక ఈగోతో వెళ్తే సీట్లు పెరిగేవి. కానీ సగటు మధ్యతరగతి మనిషి ఈ వైసీపీ ప్రభుత్వం పోవాలని బలంగా కోరుకునే కోరికకు అడ్డంకులు ఏర్పడేవి. ఐదు కోట్ల ఆంధ్రుల భవిత కోసం ఎన్నికల్లో పోటీచేసే సీట్లు కొన్ని త్యాగం చేయక తప్పలేదు' అని పేర్కొన్నారు.

కోవర్టులను వదలం

"నా చుట్టూ కోటరీ కట్టాలని చూస్తే దానిని ఎప్పటికప్పుడు బద్దలు కొడతాను. పైకి మెత్తగా కనిపిస్తాడు కదా ఆడేసుకుందాం అనుకుంటే, వాళ్లతో నేనే ఆడేసుకుంటాను. టీ, కాఫీలు అందించి ఎమ్మెల్యేలు అయిపోదాం అనుకుంటే కుదరదు. నన్ను బ్లాక్‌మెయిల్ చేయాలనుకుంటే దానికి తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. పార్టీలో ఉండి కోవర్టులుగా పనిచేసే వాళ్లను వదిలేది లేదు. పని చేసే వారిని ఎలా గుర్తిస్తానో, నా చుట్టూ ఉండి నమ్మక ద్రోహం చేసినవారిని వదిలిపెట్టను. ఒక సమూహాన్ని ప్రభావితం చేసే వ్యక్తి రాజకీయాల్లోకి వస్తే అప్పటికే రాజకీయాల్లో ఉన్నవారు వారి వికృత రూపాన్ని ఎలా చూపిస్తారో 2006లోనే అర్థమైంది. పొత్తులో బీజేపీ చేరడం వల్ల జగన్ తోక కత్తిరిస్తాం. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఈసారి పొత్తును గెలిపించండి. జనసేనను ఆశీర్వదించండి. మీకు బంగారు భవిష్యత్తు ఇచ్చే బాధ్యత తీసుకుంటాను" అని పవన్ హామీ ఇచ్చారు.

తిరుపతిలో 'ఆరణి' మంటలు

తిరుపతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన నుంచి చిత్తూరు సిటింగ్ వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు ఖరారు కావడంపై తిరుపతిలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు భగ్గుమన్నారు. గురువారం అత్యవసరంగా భేటీ అయిన ఇరు పార్టీల నాయకులూ ఈ అంశంపై తీవ్రంగా చర్చించారు. తిరుపతి నుంచి పోటీకి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానిస్తున్నామని, ఆయన కాకుంటే స్థానికులకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానికుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా బయటి వ్యక్తిని అభ్యర్థిగా నిర్ణయిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. చిత్తూరులో ఆరణి శ్రీనివాసులు అవినీతి, అక్రమాలపై చంద్రబాబు, లోకేశ్ బహిరంగ సభల్లో ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. చిత్తూరులో వైసీపీకే పనికిరాని వ్యక్తి తిరుపతిలో మనకెలా పనికొస్తాడని నిలదీశారు. అతడి కోసం పనిచేసేది లేదంటూ మూకుమ్మడిగా తేల్చిచెప్పారు. స్థానికేతరుడైన ఆయన్ను అసలు తిరుపతిలోనే అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు.

నాది ఉత్తుత్తి నొక్కుడే!

జగనే స్వయంగా సెలవిచ్చిన వైనం

- వారం తర్వాత ఖాతాల్లోకి ఈబీసీ నేస్తం డబ్బులు
- బనగానపల్లెలో బటన్ నొక్కుతూ సీఎం వెల్లడి

నంద్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మరో నాలుగురోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుంది. ఆ తర్వాత తమ ప్రభుత్వం వస్తుందో రాదోనన్న అనుమానం. ఈలోపు ప్రజలను ఎలా మభ్యపెట్టాలా అని ఆలోచించిన ముఖ్యమంత్రి జగన్.. ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు మూడో విడత బటన్ నొక్కే కార్యక్రమాన్ని ఎంచుకున్నారు. బనగానపల్లెలో గురువారం సభ ఏర్పాటు చేసి...రూ.629 కోట్లు జమ చేస్తున్నామంటూ ప్రచారం చేశారు. తన రోత పత్రికలో రూ.కోటిన్నర విలువైన ప్రకటనలు గుప్పిస్తూ ఇదే డబ్బా వాయించుకున్నారు. దీంతో జగన్ బటన్ నొక్కగానే ఖాతాల్లో డబ్బులు పడతాయని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూశారు. కానీ, లబ్ధిదారులకు ఆయన చావు కబురు చల్లగా చెప్పారు. ప్రస్తుతం బటన్ మాత్రమే నొక్కుతున్నానని, డబ్బులు మరో వారంరోజుల తర్వాత పడతాయని చెప్పారు. పేదలకు ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు ఉండవు. కానీ, తమవారికి మాత్రం ధారాళంగా కేటాయింపులు చేసేసుకుంటారు. నిన్నటికినిన్న డిజిటల్ కార్పొరేషన్‌కు నిధుల వరద పారించారు. ఇప్పటికే ఈ సంస్థకు రూ. 100కోట్లు మంజూరు చేశారు. ఇంకా కావాలని అడగడమే ఆలస్య పేటీఎం బ్యాచ్‌ను పోషిస్తున్న కార్పొరేషన్‌కు ఆగమేఘాలపై మరో రూ.20కోట్లు ఇచ్చేశారు. వీటిలో వేటికీ రాని నిధుల కొరత పేదల దగ్గరకు వచ్చేసరికే ఎందుకు తలెత్తుతున్నదని పలువురు లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. పైగా ఖాతాల్లో డబ్బులు పడని ఈ వారం రోజులూ ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికలు, చానళ్లు చూడవద్దంటూ జగన్ ఉచిత సలహా ఇచ్చారు. దీంతో జగన్ తీరును చూసి లబ్ధిదారులు ముక్కున వేలేసుకున్నారు. కాగా, ఈబీసీ నేస్తం పథకం ద్వారా 4,19,583 ఓబీసీ అక్కాచెల్లెమ్మలకు స్వావలంబన కలిగిస్తున్నట్టు చెప్పారు. గత 58 నెలల్లో 99 శాతం హామీలను అమలు చేశామంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. పైగా మళ్లీ తను అధికారంలోకి రాకపోతే ప్రస్తుతం వచ్చే పథకాలు, అందే డబ్బులు అన్నీ ఆగిపోతాయని ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేశారు. ఇక, సీఎం సభకు మహిళలను, ముఖ్యంగా డ్వాక్రా మహిళలను అధికారులు భారీగా తరలించారు. అయితే సభాస్థలం చిన్నది కావడం, సరైన వసతులు లేకపోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఓ వైపు సీఎం ప్రసంగిస్తుండగానే మరోవైపు మహిళలు బయటకు వెళ్లిపోయారు. ప్రతి సభలో వెళ్లిపోయేవారిని అడ్డుకునే పోలీసులు ఈసారి, అందుకు ప్రయత్నించలేదు.

హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ మల్లికార్జునరావు ప్రమాణం




జస్టిస్ చక్రవర్తి, జస్టిస్ మల్లికార్జునరావులతో ప్రమాణం చేయిస్తున్న సీజే



మధ్యప్రదేశ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ దుప్పల వెంకట రమణ

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి, జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ప్రమాణం చేశారు. మొదటి కోర్టు హాలులో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ శ్రీరామ్, ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకీ రామిరెడ్డి, పీపీ వై.నాగిరెడ్డి, హైకోర్టు రిజిస్ట్రార్లు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వెంటాడి....వేటాడి...!

▸▸ గ్రానైట్ ఫ్యాక్టరీలపై కక్ష సాధింపులకు దిగుతున్న వైసీపీ

బాపట్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కక్షసాధింపుల విషయంలో అధికార పార్టీ కొత్త రికార్డులను నెలకొల్పుతోంది. తాను లక్ష్యంగా చేసుకున్న వ్యక్తులను వేధించడానికి జిల్లాల సరిహద్దులను కూడా చెరిపేస్తోంది. తాజాగా ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఓ ఎంపీ వైసీపీని వీడి జనసేనలో చేరారు. దీంతో ఆయన ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడంపై వైసీపీ దృష్టి సారించింది. సదరు ఎంపీకి బాపట్ల జిల్లా మార్టూరు పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని కామేపల్లి లక్ష్మీప్రసాద్‌తో వ్యాపార సంబంధాలున్నాయి. అంతేగాకుండా అద్దంకి టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు బంధువు కూడా. ఈ వివరాలను సేకరించిన అధికార పార్టీ నేతలు.. అతని వ్యాపారాలను లక్ష్యంగా చేసుకుని రెండు టీంల అధికారులను అతని గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలపైకి ఉసిగొల్పింది. గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీల్లో నిబంధనల ఉల్లంఘనలను రెండు టీంలతో కూడిన అధికారులు తనిఖీ చేస్తారని గనుల శాఖ గతంలోనే తెలిపింది. కానీ మూడు రోజుల నుంచి మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలో సదరు అధికారులు చేస్తున్న తనిఖీలు అన్నీ ఆ యజమాని టార్గెట్‌గానే జరుగుతున్నాయి.

చీరలు వద్దు.. మంచినీళ్లివ్వండి చాలు

▸▸ వైసీపీ ఎంపీ ఇచ్చిన చీరలు దహనం చేసిన మహిళలు



రాజమహేంద్రవరం బెస్తావారి వీధిలో వైసీపీ ఎంపీ భరత్‌రామ్ ఇచ్చిన చీరలను దహనం చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 14: 'చీరలు వద్దు.. సురక్షితమైన మంచినీరు కావాలి' అంటూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బెస్తావారి వీధిలో గురువారం వైసీపీ ఎంపీ భరత్‌రామ్ ఇచ్చిన చీరలను మహిళలు దహనం చేశారు. ఖాళీ బిందెలు, కలుషిత నీటితో నింపిన బాటిళ్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రొక్కం వరలక్ష్మి మాట్లాడుతూ 'మాకు చీరలు అనవసరం లేదు. మా ప్రాణాలు కాపాడేందుకు సురక్షితమైన తాగునీరు కావాలి. ఇటీవల ఎంపీ భరత్‌రామ్ వస్తే కుళాయిలో ధార సక్రమంగా రావడంలేదని చెప్పాం. తాగునీరు అందించలేకపోయారు గానీ చీరలు పంచుతున్నాడు' అని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు మాట్లాడుతూ నాసిరకం చీరలు పంచుతూ మహిళలను అవమానిస్తున్నాడని విమర్శించారు.

జగన్‌కు క్రైస్తవులు ఓటేయక్కర్లేదు

▸▸ జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ ఛైర్మన్ జోసఫ్

చేబ్రోలు, మార్చి 14: క్రైస్తవులకు ఇచ్చిన వాగ్దానాల అమలులో జగన్‌రెడ్డి కనీసం పాస్ మార్కులు కూడా పొందలేదని, వచ్చే ఎన్నికల్లో ఆయనకు క్రైస్తవులు ఓటు వేయకూడదని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ ఛైర్మన్, సెయింట్ మేరీస్ చేబ్రోలు కళాశాల డైరెక్టర్ జోసఫ్ మోసిగంటి పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా చేబ్రోలులో గురువారం జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నేను మంచి చేస్తేనే నాకు ఓటు వేయండి లేకపోతే వద్దు అని జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆయన మేనిఫెస్టోలో క్రైస్తవులకు చేసిన వాగ్దానాలు కేవలం రెండు శాతమే అమలు చేశారు. దీనిపై క్రైస్తవ సమాజం ఆలోచించి జగన్ పార్టీకి ఓటు వేయొద్దు' అని క్రైస్తవులకు విజ్ఞప్తి చేశారు. బీజేపీతో టీడీపీ బహిరంగంగా పొత్తు పెట్టుకుంటే.. జగన్‌రెడ్డి అంతర్గతంగా పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. పబ్లిక్ పొత్తుకంటే అంతర్గత పొత్తు చాలా అపాయకరమని క్రైస్తవ సమాజం గుర్తించాలన్నారు. జగన్‌రెడ్డి కానీ, విజయమ్మ కానీ ఏనాడూ క్రైస్తవ సమస్యలపై స్పందించలేదన్నారు. డబ్బులు పంచేవారు కాకుండా క్రైస్తవుల సమస్యలు విని అండగా ఉండేవారిని కోరుకోవాలన్నారు. జగన్‌రెడ్డి సీఎం అయిన నాటి నుంచి క్రైస్తవ సమాజంపై దాడులు, నిబంధనలు పెరిగిపోయాయని విమర్శించారు.

వైసీపీ సర్పంచి భార్యపై సొంత గ్యాంగ్ ట్రోల్స్

▸▸ మండల నాయకుడి అనుచరుడి భూ ఆక్రమణను అడ్డుకున్నందుకు కక్ష

▸▸ నిజం మాట్లాడటమే నేరమా అంటూ బాధితురాలి ఆవేదన




నీలావతి

కుప్పం, మార్చి 14: తనపర భేదం లేదు. అక్రమాలను అడ్డుకునే ఎవరినైనా టార్గెట్ చేయడమే. మహిళలను సామాజిక మాధ్యమాల్లో నీచమైన తిట్లతో ట్రోల్ చేయడమే. అధికార వైసీపీ అనుసరిస్తున్న నీచమైన సంస్కృతి ఇదీ. అధికార పార్టీకి చెందిన ఒక సర్పంచి భార్యకూ ఈ దుస్థితి తప్పలేదు. మండల స్థాయి నేత అనుచరుడి ఆక్రమణలను ప్రశ్నించడం, అదే విషయంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వాహనాన్ని అడ్డుకుని నిరసన తెలపడమే ఆమె చేసిన నేరం. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం మొరసనపల్లెలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న 5 ఎకరాల భూమిని గతంలో కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేశారు. ఇందులో 64 సెంట్ల డీకేటీ భూమి కూడా ఉందని ఆరోపణలున్నాయి. ఆ డీకేటీ భూమిలో కొంత భాగాన్ని వైసీపీ మండల కన్వీనర్ దండపాణి అనుచరుడు ఒకరు కొనుగోలు చేశారని చెబుతున్నారు. అయితే, ఆ భూమిలో గొర్రెల సంత ఏర్పాటు చేయాలని మొరసనపల్లె సర్పంచి జగదీశ్ భావించారు. అప్పటికే ఆ భూమి ఆక్రమణకు గురైందని తెలుసుకుని గతేడాది సెప్టెంబరులో గ్రామస్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ నిరసనలో సర్పంచి భార్య నీలావతి ప్రముఖ పాత్ర పోషించారు. అదేనెలలో శాంతిపురం మీదుగా వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రాచమచంద్రారెడ్డి వాహనాన్ని సైతం ఆమె అడ్డుకుని నిరసన తెలిపారు. ఆ నిరసనలకు భయపడి ఎట్టకేలకు ఆ డీకేటీ భూమిని గొర్రెల సంత కోసం ఇచ్చేశారు. అప్పటి నుంచి నీలావతిపై అడపాదడపా సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. గురువారం ఇది శృతి మించింది. రమేశ్ వీవీ పేరుతో రాయలేని భాషలో ఆమెపై ట్రోల్స్ వీరవిహారం చేశాయి. దీనిపై నీలావతి సోషల్ మీడియాలో ఒక వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. 'నిజాన్ని నిర్భయంగా మాట్లాడడమే నా నేరమా? లిక్కర్ మాఫియా, క్వారీలను కొల్లగొట్టడం, ఇసుక దోపిడీ విచ్చలవిడిగా చేస్తున్నా నేను పట్టించుకోలేదు. అయితే పంచాయతీ స్థలాన్ని కబ్జా చేసినప్పటి నుంచే మండల అధికార పార్టీ నేతలకు వ్యతిరేకంగా పోరాడుతున్నా. సాయంత్రమైతే చిల్లరకోసం క్వార్టర్ మందుకు పడేవాళ్లను నాయకులుగా నమ్ముతున్నాం. ఇది మన దౌర్భాగ్యం' అని ఆ వీడియోలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

'గ్రూప్ 1'పై సీబీఐ విచారణ జరగాలి

▸▸ గౌతమ్ సవాంగ్, సీతారామాంజనేయులుపై కేసులు నమోదు చేయాలి: చంద్రబాబు



అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థల విధ్వంసానికి ఏపీపీఎస్సీ కూడా బలైందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. గురువారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన చేశారు. 'రాజ్యాంగబద్ధ సంస్థ సర్వీస్ కమిషన్‌ను కూడా రాజకీయ లబ్ధికి, అక్రమాలకు వేదిక చేసి, సీఎం జగన్ లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టారు. ఏపీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో ప్రభుత్వ పెద్దల వైఫల్యాలు, కుట్రలకు నిరుద్యోగ యువత బలైంది. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణలో మునుపెన్నడూ లేని వివాదాలు ఎందుకు తలెత్తాయి? వాటికి కారణాలు ఏంటో బహిర్గతం చేయాలి. డిజిటల్, మాన్యువల్ మూల్యాంకనం అంటూ మోసపూరిత చర్యలతో రాజకీయ మూల్యాంకనానికి పాల్పడ్డారు. తమ వారిని పోస్టింగుల్లో కూర్చోబెట్టేందుకు గ్రూప్ 1 పోస్టులను అమ్ముకుని అర్హులైన వారికి అన్యాయం చేశారు. ఏపీపీఎస్సీ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో అక్రమాలకు పాల్పడి సర్వీస్ కమిషన్ ప్రతిష్ఠను, విశ్వసనీయతను దెబ్బతీశారు. ఏపీపీఎస్సీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చి అక్రమాలకు పాల్పడటమే కాకుండా హైకోర్టును సైతం మూల్యాంకనం విషయంలో తప్పుదోవ పట్టించే ప్రయత్నం విస్మయం కలిగించింది. ఈ అక్రమాల వెనుక ఉన్న సర్వీస్ కమిషన్ పెద్దల పాత్ర నిగ్గుతేలాలంటే సీబీఐ విచారణ జరగాలి. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్న గౌతమ్ సవాంగ్, సంస్థకు కార్యదర్శిగా పనిచేసిన మరో ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులను తక్షణమే సస్పెండ్ చేసి, కేసు నమోదు చేసి విచారణ జరపాలి. ముమ్మాటికి ప్రభుత్వ పెద్దల అక్రమాల వల్లే పరీక్షల రద్దు జరిగింది. సీబీఐ విచారణ జరిపితే ఉన్నతాధికారుల పాత్రతో పాటు ప్రభుత్వ పెద్దల అక్రమాలు కూడా బట్టబయలు అవుతాయి. ప్రభుత్వానికి ధైర్యం ఉంటే దీనిపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలి. అటు జాబ్ కేలెండర్ రాక, ఇటు ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు లేక నిరాశలో ఉన్న యువత తాజా అక్రమాలతో పూర్తిగా నిస్పృహలోకి వెళ్లే ప్రమాదముంది. లక్షల మంది విద్యార్థులు ఏళ్ల తరబడి పడిన కష్టాన్ని, వారి ఆశలను జగన్ ప్రభుత్వం నాశనం చేసింది' అని బాబు మండిపడ్డారు.

150 కోట్ల అవినీతి: పట్టాభిరాం

ఐదేళ్లలో ల్యాండ్, శాండ్, వైన్, మైన్‌లో లక్షలాది కోట్లు దోచుకున్న జగన్ మాఫియా చివరకు గ్రూప్ 1 ఉద్యోగాల్లో సైతం అక్రమాలకు పాల్పడిందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం ఆరోపించారు. 'గ్రూప్1 ఉద్యోగాలు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుని హీనపక్షంగా రూ.150 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.2.50 కోట్లకు, డీఎస్పీ పోస్టును రూ.1.50 కోట్లకు అమ్ముకున్నారు. ఈ కుంభకోణం అంతా సీఎం జగన్, సజ్జల డైరెక్షన్‌లో ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు, ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ కనుసన్నల్లో జరిగింది.' అని పట్టాభి ఆరోపించారు.

వారికి ఎన్నికల బాధ్యతలు వద్దు: అచ్చెన్న

'2018 గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలి. ఆ నోటిఫికేషన్‌పై హైకోర్టు ఆదేశాలను పాటించేలా చర్యలు తీసుకోవాలి' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు.

'అనపర్తిలో ఓటర్లను ప్రలోభపెడుతున్నారు'

అనపర్తి వైసీపీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి నియోజకవర్గంలోని మహిళలకు లక్ష చీరలు పంచేందుకు సిద్ధమయ్యారని మండలి మాజీ ఛైర్‌పర్సన్ ఎంఏ షరీఫ్ ఫిర్యాదు చేశారు. రూ.3 కోట్ల విలువైన లక్ష చీరలు పంచే బాధ్యత వలంటీర్లకు అప్పగించారని ఆయన అన్నారు.

ఇంటర్వ్యూలోనే తిరకాసు!

▸▸ ఇప్పుడు కిక్కురుమనని ఏపీపీఎస్సీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాజ్యాంగబద్ధ సంస్థ ఏపీపీఎస్సీ ప్రతిష్ఠ మంటగలుస్తోంది. జగన్ హయాంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కమిషన్‌కు చెడ్డపేరు వచ్చింది. తాజాగా 2018 మెయిన్స్ పరీక్షలను రద్దుచేయడంతో ఏపీపీఎస్సీ పరువు మరింత దిగజారింది. గ్రూప్1 ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూల విషయంలో ఏపీపీఎస్సీ వెంటవెంటనే నిర్ణయాలు మార్చుకోవడం అనేక అనుమానాలను రేకెత్తించింది. ఒకసారి ఇంటర్వ్యూలు రద్దుచేయడం, ఏడాదిలోనే మళ్లీ పునరుద్ధరించడంపై గందరగోళం నెలకొంది. ఇంటర్వ్యూల వల్ల ఒకప్పుడు అవినీతి జరిగిందన్న జగన్ ప్రభుత్వమే, తిరిగి అదే విధానాన్ని ప్రవేశపెట్టడం వెనుక ఉద్దేశం ఏంటి? ఇప్పుడు అవినీతి జరిగినా పరవాలేదా? అసలు రద్దు చేయడం ఎందుకు, తిరిగి పునరుద్ధరణ ఉత్తర్వులు ఇవ్వడం ఎందుకు? ఇలా అనేక ప్రశ్నలు ఎదురవుతున్నా ఏపీపీఎస్సీ స్పందించడం లేదు.

సీఎం మాటకే దిక్కులేదు

గ్రూప్-1లో ఇంటర్వ్యూ విధానం ఉంటుంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి 750 మార్కులతో మెయిన్స్ నిర్వహిస్తారు. వారిలో నుంచి ఇంటర్వ్యూలకు 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూ 75 మార్కులకు జరుగుతుంది. అయితే ఈ ఇంటర్వ్యూ విధానం వల్ల కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చుకుంటున్నారని స్వయంగా సీఎం జగన్ ఆరోపించారు. దళారులు, సిఫారసుల విధానం పెరిగిందని, పారదర్శకంగా ఉద్యోగాలు దక్కట్లేదని విమర్శించారు. సీఎం అంతటి వ్యక్తి ఆరోపణలు చేయడంతో వెంటనే స్పందించిన ప్రభుత్వం 2021 జూన్ 26న ఇంటర్వ్యూలు రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆ తర్వాత 2022లో గ్రూప్1 నోటిఫికేషన్ జారీచేయాలని భావించింది. అయితే రద్దు చేసిన ఇంటర్వ్యూలను 2022 సెప్టెంబరు 22న పునరుద్ధరించింది. దీంతో ఏపీపీఎస్సీ తీరుపై అనుమానాలు పెరిగాయి. ఏ ఇంటర్వ్యూల వల్ల అయితే అవినీతి జరుగుతుందని సీఎం ఆరోపించారో, అదే ఇంటర్వ్యూలను తిరిగి ప్రవేశపెట్టడం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నట్లు అభ్యర్థులు అనుమానించారు. ఆ అనుమానాలను బలపరిచేలా గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన వారి మార్కులను ఏపీపీఎస్సీ రహస్యంగా ఉంచుతోంది. అభ్యర్థులు, మీడియా ఎన్నిసార్లు అడిగినా వాటిని బహిర్గతం చేయడం లేదు. దీంతో సీఎం మాటకే దిక్కు లేకుండా పోయిందన్న విమర్శలు వచ్చాయి. అయినా ఏపీపీఎస్సీ పట్టించుకోలేదు.

రెండోసారిపై అబద్ధాలు

2018 గ్రూప్-1 మెయిన్స్‌ను హైకోర్టు రద్దుచేయడంతో ఏపీపీఎస్సీపై మరిన్ని అనుమానాలు పెరుగుతున్నాయి. కొవిడ్ పేరుతో మెయిన్స్ ప్రశ్నపత్రాలను డిజిటల్ విధానంలో తొలిసారి మూల్యాంకనం చేశారు. దాన్ని సవాలు చేస్తూ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని కోర్టు ఆదేశించింది. అయితే.. కోర్టు ఆదేశాల మేరకు ఒకసారి కాకుండా రెండుసార్లు మాన్యువల్‌గా మూల్యాకనం చేసినట్టు అభ్యర్థులు ఆరోపించారు. ఏపీపీఎస్సీ మాత్రం ఒక్కసారే చేసినట్టు వాదించింది. రెండుసార్లు చేసినట్లు పిటిషనర్లు చేస్తున్న వాదనకు ఆధారాలు లేవని ఏపీపీఎస్సీ తన అఫిడవిట్‌లోనే పేర్కొంది. అయితే రెండుసార్లు మూల్యాంకనం జరిగిందని అభ్యర్థులు ఆధారాలు సమర్పించడంతో ఏపీపీఎస్సీ సమాధానం చెప్పలేకపోయింది.

ఈ బిల్లులు ఎందుకిచ్చారు..?

గ్రూప్1 ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి అవసరమైన సామగ్రి సమకూర్చే బాధ్యతను డేటాటెక్ మెథోడెక్స్ సంస్థకు అప్పగిస్తూ 2021 జూలై 27న అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ అంజనేయులు ఆర్డర్ ఇచ్చారు. ఆ తర్వాత మూల్యాంకనానికి అవసరమైన పత్రాల డిజైనింగ్, ముద్రణకు ఏపీపీఎస్సీ రూ.17,936 చెల్లించింది. గ్రూప్1 మెయిన్స్ మూల్యాంకనం గుంటూరు సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో చేయాలని ఏపీపీఎస్సీ నిర్ణయించింది. తగిన భద్రత కోరుతూ అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి గుంటూరు అర్బన్ ఎస్పీకి 2021 డిసెంబరు 3న లేఖ రాశారు. హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో హాల్ రెంట్, స్ట్రాంగ్ రూమ్, బోర్డు రూమ్ రెంట్, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, టీలు, సిబ్బంది అన్నిటికీ బిల్లులు చెల్లించారు. ఇంత స్పష్టంగా బిల్లులు ఉన్నా రెండుసార్లు మూల్యాంకనం చేయలేదని ఏపీపీఎస్సీ అడ్డగోలుగా వాదిస్తోంది.

అద్దంకిలోనూ 'ఫాం 7'ల కుట్ర!

▸▸ ఓట్ల తొలగింపులో పాలక పార్టీ కుయుక్తులు

▸▸ తుది జాబితా తర్వాత 1150 ఫాం7లు

▸▸ సెల్ఫ్ డిక్లరేషన్ పేరిట రద్దుకు అర్జీలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పర్చూరు నియోజకవర్గంలో ఫాం7ల విషయంలో అధికార పార్టీ కుట్ర పన్ని పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపుకు ప్రయత్నించి దొరికిపోయిన విషయం తెలిసిందే!. ఈ క్రమంలో కొంతమంది అధికారులు కూడా బలైన సంగతీ విదితమే!. ఫాం7 దొంగలపై పెద్ద ఎత్తున కేసులు పెట్టినా.. ఈసారి రూటు మార్చి ఒక్కొక్కటిగా సెల్ఫ్ ఫాం7లు దరఖాస్తు చేయడం వైసీపీ కపటబుద్ధికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఓటరు జాబితా తుది ప్రచురణ విడుదలయిన జనవరి 22 తర్వాత మళ్లీ ఆన్‌లైన్‌లో ఫాం7ల నమోదుకు ఈసీ అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. దీనిని ఆసరాగా తీసుకుని ఈ సారి అద్దంకిని కార్యక్షేత్రంగా ఎంచుకుని సాధ్యమైనన్ని టీడీపీ సానుభూతిపరుల ఓట్లను ఫాం7ల ద్వారా తొలగించడానికి వైసీపీ కుట్ర పన్నింది. తుది జాబితా విడుదలైన జనవరి 22 తర్వాత నుంచి ఇప్పటి వరకు అద్దంకిలో దాదాపు 1150 వరకు ఫాం7లు రాగా ఇవన్నీ విచారణ చేసే క్రమంలో అన్నీ బోగస్‌వేనని విషయం తేటతెల్లమవుతోంది. గంపగుత్తగా ఫాం7లు నమోదు చేయడం వల్ల పర్చూరులో దొరికిపోయిన అనుభవంతో.. ఈసారి రూటుమార్చి సెల్ఫ్ పేరిట ఫాం7ల పన్నాగానికి అధికార పార్టీ పాల్పడుతోంది. తమ ఓటు తొలగించాలని తామే ఎందుకు దరఖాస్తు చేసుకుంటామని ఓటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండల పరిధిలో వచ్చిన ఫాం7ల విచారణకు గురువారం ఆయా గ్రామాలకు వచ్చిన అధికారులకు ఓటర్ల నుంచి తాము దరఖాస్తు చేయలేదనే సమాధానం వచ్చింది. ఇవే కాకుండా అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న అక్రమాలపై జైభీమ్ పార్టీ నేత ఒకరు వినూత్న రీతిలో నిరసన తెలపడం చర్చకు దారి తీసింది. పంగులూరు పరిధిలో చనిపోయిన 14 మంది పేర్లు ఇంకా ఓటరు జాబితాలో కనబడుతున్నాయంటూ.. శ్మశానవాటికకు వెళ్లి సమాధులను ఓట్లు అభ్యర్థించి అవకతవకలను ఎండగట్టారు. ఇక, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి ఉన్న వెసులుబాటును ఆసరాగా చేసుకుని ఫాం7ల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, ఫలితంగా తమకు పనిభారం పెరుగుతోందని అధికార యంత్రాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. దీని వెనుక పాలక పార్టీ సానుభూతిపరులే కీలకంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాన్ని అంతర్గత సంభాషణల్లో ఉద్యోగులు సైతం వెలిబుచ్చడం విశేషం. కాగా, అద్దంకి నియోజకవర్గ పరిధిలోని ఫాం7ల విచారణ సమయంలో వెలుగు చూస్తున్న అంశాలతో ప్రతిపక్ష టీడీపీ నాయకులు అప్రమత్తమయ్యారు. దీనిపై ఎమ్మెల్యే రవికుమార్.. శ్రేణులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేస్తున్నారు. అవకతవకలను ఇప్పటికే ఆర్వో దృష్టికి తీసుకెళ్లిన టీడీపీ.. అవసరమైతే నేరుగా ఈసీకి ఆధారాలతో సహా ఫిర్యా దు చేయాలని నిర్ణయించింది. ప్రతి దరఖాస్తు పై క్షుణ్ణంగా విచారణ చేపట్టిన తర్వాతే తుది నిర్ణయానికి రావాలని ఎన్నికల సిబ్బందిని కోరుతోంది.

మేము అర్జీలు ఇవ్వలేదు!

▸▸ బీఎల్వోల విచారణలో బాధిత ఓటర్లు

▸▸ బల్లికురవలో 285 సెల్ఫ్ ఫాం7లు

బల్లికురవ, మార్చి 14: సార్వత్రి ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో టీడీపీ ఓట్లను ఎలాగైనా తొలగించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో కొత్త తరహా పోకడలకు పాల్పడుతున్నారు. తన ఓటు తొలగించాలని అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో 285 మంది దరఖాస్తు చేసిన్నట్లు ఆన్‌లైన్‌లో పెట్టారు. దీనిపై ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దార్ విచారణకు ఆదేశించారు. దీంతో బీఎల్వోలు, వీఆర్వోలు గురువారం మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో తొలగింపునకు వచ్చిన 27 దరఖాస్తులపై విచారణ చేపట్టారు. అయితే తాము తమ ఓట్లను ఎందుకు తొలగించమని దరఖాస్తులు చేస్తామని, ఇదంతా ఎవరో కావాలని చేశారని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి తమ ఓట్లు తొలగించాలని అర్జీలు పెట్టిన వారిపై చర్యలు చేపట్టాలని అధికారులకు విన్నవించారు. కాగా, అన్ని గ్రామాల్లోనూ కొందరు వైసీపీకి చెందినవారు స్వీయ ఫాం7లు పెట్టారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. టీడీపీని దెబ్బ తీసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని వారు కోరుతున్నారు.

'గీతాంజలి' కేసులో ఇద్దరు అరెస్టు

▸▸ విజయవాడ, ఉండికి చెందిన నిందితులు అదుపులోకి: ఎస్పీ తుషార్

గుంటూరు, మార్చి 14: తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ గురువారం తెలిపారు. ఈ కేసులో విజయవాడకు చెందిన పసుమర్తి రాంబాబు, పశ్చిమగోదావరి జిల్లా ఉండికి చెందిన పెనుమజ్జి వెంకట దుర్గారావును అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ నెల 4న తెనాలిలో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో తెనాలికి చెందిన గొల్తి గీతాంజలి దేవి జగనన్న ఇళ్ల పట్టా అందుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా అక్కడ ఓ యూట్యూబ్ చానల్‌కు ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారని తెలిపారు. అది గంటల్లోనే వైరల్‌గా మారిందన్నారు. దానిపై కొందరు అభ్యంతరకరమైన కామెంట్లు చేశారని చెప్పారు. సోషల్ మీడియాలో అలాంటి కామెంట్లు పెట్టిన రాంబాబు, వెంకట దుర్గారావును అరెస్ట్ చేశామని, వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు వివరించారు.

విజయవాడ వాసి అరెస్టు

తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్య కేసులో విజయవాడకు చెందిన పసుమర్తి రాంబాబును పోలీసులు అరెస్టు చేశారు. అజిత్‌సింగ్ నగర్‌లోని పీఅండ్‌టీ కాలనీకి చెందిన రాంబాబు.. తెనాలికి చెందిన గీతాంజలిపై 'ఎక్స్'లో అభ్యంతరకర కామెంట్లు పెట్టాడు. దీని ఆధారంగా తెనాలి పోలీసులు బుధవారం రాత్రి రాంబాబును అరెస్టు చేసి తీసుకెళ్లారు.

ఎస్పీ మీడియా సమావేశంలో 'ఐప్యాక్'

ఎస్పీ మీడియా సమావేశానికి ఐప్యాక్ సభ్యులు ఇద్దరు హాజరయ్యారు. మీడియా ప్రతినిధులు... మీరెవరు? అంటూ ప్రశ్నించారు. వారు సరైన సమాధానం చెప్పలేదు. నిలదీయడంతో తాము ఐ ప్యాక్ టీం అని తెలిపారు. దీంతో మీడియా ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే అప్పటికే ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు వేదిక దిగడంతో పోలీస్ సిబ్బంది వారిని బయటకు పంపారు.

టీడీపీ నేతలను అరెస్ట్ చేయాలని చూస్తున్నారు: వర్ల

గీతాంజలి కేసును అడ్డుపెట్టుకొని టీడీపీలో చురుకైన నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపాలని వైసీపీ ప్రయత్నిస్తోందని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీకి ఫిర్యాదు చేశారు. తెనాలి వన్‌టౌన్ సీఐ దశరథ రామారావు వైసీపీ నేతల ప్రలోభాలకు లొంగి గీతాంజలి కేసును అడ్డుపెట్టుకొని టీడీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసి రానున్న ఎన్నికలకు దూరం చేయాలని చూస్తున్నారని వర్ల ఆరోపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ప్రజాసేవకే రాజకీయాల్లోకి..

● టీడీపీ సీనియర్ నేత కేశినేని చిన్ని






మాట్లాడుతున్న కేశినేని శివనాథ్ (చిన్ని), చిత్రంలో బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, పటమటలో కుట్టు మిషన్లు అందజేస్తున్న గద్దె, చిన్ని, వాసు, ఊర్మిళానగర్‌లో ఉపకరణాల పంపిణీ, పెజ్జోనిపేటలో కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న కేశినేని చిన్ని, బుద్దా వెంకన్న

వన్‌టౌన్, మార్చి 14: ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం చిట్టినగర్ సెంటర్‌లో టీడీపీ 48వ డివిజన్ అధ్యక్షుడు పేరాబత్తుల రమణ ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ తరఫున తోపుడు బండ్లు, కుట్టుమిషన్లు, ఇస్త్రీ పెట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకే తాను క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చానన్నారు. మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్న మాట్లాడుతూ కేశినేని చిన్నిని పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించాలని కోరారు. బీసీ, మైనార్టీ నేత నాగుల్‌మీరా మాట్లాడుతూ ప్రజల మేలు కోరే నాయకుడు కేశినేని చిన్ని అని ఆయన్ను గెలిపించాలని కోరారు. పేరాబత్తుల రమణ, నల్లపాటి రాము, కామాదేవరాజ్, మహమ్మద్ ఫతావుల్లా, సగురుపిళ్ల రమేష్, కొట్టేటి హనుమంతరావు, పిల్లా అచ్చుతారావు, బెవర జోగేష్, మద్దినేని చెంచయ్య, ఈది పార్వతి, పిల్లా బంగారయ్య, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

గద్దె మెజారిటీపైనే దృష్టి

పటమట: తూర్పులో గద్దె రామ్మోహన్ గెలుపు తథ్యమని, మెజారిటీపైనే దృష్టిపెట్టడం జరిగిందని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 9వ డివిజన్ పటమటలంక చిన్న రామాలయం వద్ద కేశినేని చిన్ని రూ.2లక్షల 25వేలతో కొనుగోలు చేసిన 15 కుట్టుమిషన్లు, 15 ఇస్త్రీ పెట్టెలను రజక సోదరులకు అందజేశారు. గద్దె రామ్మోహన్, జనసేన నేత అమ్మిశెట్టి వాసు పాల్గొన్నారు. అనంతరం పటమటలంక ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ నగరంలో ఉంటూ రాజధాని వద్దంటున్న జగన్‌ను గెలిపించటానికి, ఆపార్టీలో పోటీ చేయడానికి కొందరు సిగ్గుపడటం లేదన్నారు. అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ మంచి ఆశయంతో కొనసాగుతూ పేదలకు సేవచేస్తున్న గద్దె రామ్మోహన్, కేశినేని చిన్నిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. చెన్నుపాటి గాంధీ కాంతిశ్రీ, దార్ల చంద్రశేఖర్, యలమంచిలి దేవేంద్ర, చెన్నుపాటి వజీర్, రావి సౌజన్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తా

భవానీపురం: 43వ డివిజన్‌లోని ఊర్మిళానగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని, ఎన్నికల్లో గెలిచినా, గెలవకపోయినా డివిజన్‌కు వస్తానని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) హామీ ఇచ్చారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు మోరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో కేశినేని ఫౌండేషన్ ద్వారా పేద రజకులు, టైలర్లకు రూ.2.50 లక్షల విలువైన ఇస్త్రీపెట్టెలు, కుట్టుమిషన్లు చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల పంపిణీ గురువారం ఘనంగా జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న, మైనార్టీ రాష్ట్ర నేత కె.నాగుల్ మీరాతో కలిసి శివనాథ్ ఉపకరణాల పంపిణీలో పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ పత్తి నాగేశ్వరరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వల్లభనేని ప్రసన్నలక్ష్మి, టీడీపీ ఉపాధ్యక్షురాలు ఆషా, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పెజ్జోనిపేటలో..

పాత రాజరాజేశ్వరిపేట: కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో 35వ డివిజన్ పెజ్జోనిపేటలోని డే విడ్ వీధిలో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కేశినేని చిన్ని, బుద్దా వెంకన్న రజకులకు ఇస్త్రీపెట్టెలు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. నాగూల్ మీరా పాల్గొన్నారు.

దుర్గమ్మకు కానుకగా వెండి గంగాళాలు, మూతలు

వన్‌టౌన్: దుర్గగుడిలో కొలువైన అమ్మవారికి 12 కిలోల 510 గ్రాముల వెండి గంగాళాలను, మూతలను నగరానికి చెందిన కృష్ణవంశీ, అఖిల్ కానుకగా అందజేశారు. గురువారం ఆలయానికి విచ్చేసిన వారు ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి ఆయా పాత్రలను దేవస్థానానికి అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు.

ఆర్టీసీ స్పేర్ సిబ్బందికి బలవంతపు సెలవులు తగదు

విజయవాడ, బస్‌స్టేషన్: బస్సులు లేక స్పేర్‌లో ఉంటున్న ఆర్టీసీ సిబ్బందికి బలవంతంగా సెలవులు రాసి ఆర్థికంగా నష్టం కలిగించే చర్యలు తగవని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం ఒక లేఖను ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావుకు ఇచ్చాయి. ఇటీవల తరచుగా ప్రభుత్వాధ్వర్యంలో జరుగుతున్న సభలకు గానీ, వేరే కార్యక్రమాలకు గానీ బస్సుల బుకింగ్ జరిగి వెళుతున్నప్పుడుగానీ, రిపేర్లతో బస్సులు లేని పరిస్థితుల్లోగానీ మెజారిటీ కండక్టర్లకు, డ్రైవర్లకు ట్రాఫిక్ సూపర్‌వైజర్లు బలవంతంగా సెలవులు రాస్తున్నారని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. డ్యూటీ కోసం సిబ్బంది డిపోలకు వచ్చిరా వారి పేర్లను చార్టులో చూపించకుండా, సంతకాలు చేయించకుండా బలవంతంగా సెలవులు రాస్తున్నందున డ్రైవర్లు, కండక్టర్లకు క్యాజువల్ లీవ్, ఎర్నెస్ట్ లీవ్‌లు నష్టం కలిగి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. కొంతమందికి సెలవులు లేకపోవడంతో జీతంలో కోతలు పెడుతున్నారన్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని కోరారు. స్పేర్ ఉద్యోగులను ముఖ్యమైన కూడళ్లు, ట్రాఫిక్ పాయింట్లలో ట్రాఫిక్ గైడ్స్ కింద వినియోగించుకుని లీవ్‌లు రాయకుండా చూడాలని కోరారు. ఈ లేఖలను ఈడీ, ఏఅండ్‌వో ఆఫీసర్లకు కూడా అందజేశారు. దామోదరరావు, ప్రధానకార్యదర్శి జీవీ నర్సయ్య పాల్గొన్నారు.

సీవీరెడ్డి చారిటీస్ ఎండోమెంట్ ఏసీగా గంగా శ్రీదేవి



వన్‌టౌన్: ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డీ జేఆర్ సత్రం, చలివేంద్రం స్పెసిఫిక్ ఎండోమెంట్‌లో గ్రేడ్-1 ఈవోగా పనిచేస్తున్న ఆర్ గంగా శ్రీదేవిని అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి నగరంలోని సీవీ రెడ్డి చారిటీస్‌కు బదిలీచేశారు. సీవీ రెడ్డి చారిటీస్ నిర్వహణ బాధ్యతలను ప్రస్తుతం దుర్గగుడి చూస్తోంది. ఇంతకు ముందు సీవీ రెడ్డి చారిటీస్‌కు ఈవోగా నియమితులైన సాయిబాబాను హెడ్ ఆఫీసులో రిపోర్ట్ చేయాలని దేవదాయ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు.

వెబ్‌సైట్‌లో ఫార్మసిస్ట్ గ్రేడ్-2 మెరిట్ లిస్ట్

కృష్ణలంక: జోన్-2 రాజమహేంద్రవరం పరిధిలోని ఫార్మసిస్ట్ గ్రేడ్-2 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయుటకు నోటిఫికేషన్ జారీ చేసి ఫిబ్రవరి 20 వరకు దరఖాస్తులు స్వీకరించినట్టు ప్రాంతీయ వైద్యారోగ్య సంచాలకులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా దరఖాస్తులు పరిశీలించి ప్రొవిజినల్ మెరిట్ లిస్టు జోన్-2 పరిధిలోని అన్ని జిల్లా వెబ్‌సైట్లలో పొందుపరిచామని, ప్రొవిజినల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలుంటే మార్చి 15 నుంచి 18న సాయంత్రం 5 గంటల వరకు ప్రాంతీయ వైద్యారోగ్య సంచాలకుల కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలని కోరారు. అభ్యంతరాలకు ఆఖరు తేదీ మార్చి 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉందని, తర్వాత వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబడవని స్పష్టం చేశారు.

రౌడీషీటర్ నుంచి 22 కేజీల గంజాయి స్వాధీనం

పాయకాపురం: గంజాయి విక్రయానికి ప్రయత్నించిన ఓ రౌడీషీటర్‌ను గురువారం నున్న రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 22 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కండ్రిక కాలనీకి చెందిన ఎస్‌కే హుస్సేన్ అలియాస్ చోటుపై నున్న రూరల్ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. గురువారం ఉదయం నున్న బైపాస్ రోడ్డులో పోలీసులు తనిఖీలు చేపడుతుండగా అటుగా వెళ్తున్న చోటు అనుమానాస్పదంగా తారసపడటంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని అతడి బ్యాగుల్లో గంజాయి ఉండటాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్టు విచారణలో తేలింది. నిందితుడు చోటుపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

ఈ ఎన్నికలు ధర్మానికి, అధర్మానికీ పోటీ

● జడ శ్రావణ్‌కుమార్

ధర్నాచౌక్: జై భీమ్‌రావ్ భారత్ పార్టీ తరఫున అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ఈ నెల 20న ప్రకటించి ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమవుతామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య పోటీగా అభివర్ణించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ఉన్నత విద్యనభ్యసించిన జగ్గారపు మల్లికార్జున పోటీలో ఉంటారన్నారు. అత్యధికంగా విద్యావంతులు, సమాజస్ఫూర్తిని కాంక్షించే వారు, రాజ్యాంగాన్ని గౌరవించేవారు అసెంబ్లీలో ఉండాలన్నారు.

బీజేపీని ఓడిస్తేనే వ్యవసాయ రంగం అభివృద్ధి

● లెనిన్ సెంటర్‌లో కార్మిక, కర్షక సంఘాల ఆందోళన



గవర్నర్‌పేట, మార్చి 14: బీజేపీని ఓడిస్తేనే దేశంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు పురోభివృద్ధి చెందుతాయని లేకుంటే వినాశనమేనని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో సంయుక్త కిసాన్ మోర్చా నిర్వహిస్తున్న మహాపంచాయతీని విజయవంతం చేయాలని కోరుతూ సంఘీభావంగా గురువారం లెనిన్ సెంటర్‌లో కార్మిక, కర్షక సంఘాలు ప్రదర్శన నిర్వహించాయి. రైతు సంఘం నేతలు ఆంజనేయులు, యలమందరావు అధ్యక్షత వహించారు. ఓబులేసు మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా రైతుల పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. కేంద్ర విద్యుత్ సంస్కరణల బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలు, షరతులు, విధానాలను వ్యతిరేకించాలని, తక్షణం డబ్ల్యుటీవో నుంచి వైదొలగాలని కోరారు. సీఐటీయూ నేతలు వి.ఉమామహేశ్వరరావు, సుబ్బరావమ్మ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏ రవీంద్రనాథ్, ఇఫ్టూ నేతలు కె.పోలారి, ఏ రవిచంద్ర, రైతు నేతలు వై.కేశవరావు, వివిధ కార్మిక, ప్రజా సంఘాల నేతలు జి.ఈశ్వర్, ప్రసాద్, వీరబాబు, భార్గవశ్రీ, కాసాని గణేష్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

వన్‌టౌన్, మార్చి 14: పరిశ్రమల స్థాపనకున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని జిల్లా పరిశ్రమల సంస్థ జీఎం ఎం సుధాకర్ అన్నారు. కేబీఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ ఆఫీస్ సౌజన్యంతో గురువారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమల స్థాపనలకు విస్తృతమైన అవకాశాలున్నాయని, సృజనాత్మకత ఉన్న యువకులు అవగాహనతో వస్తే ప్రభుత్వం అనేక సదుపాయాలు, ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ సెంటర్ ఆఫీసర్ ఎస్ఎల్ఎన్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకున్న అవకాశాలపై విద్యార్థులు అవగాహన చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి కల్పన చేసేవారిగా ఎదగాలని ఆకాంక్షించారు. విభాగాధిపతి హేమంత్ కుమార్ నిర్వహించారు.

హడావుడిగా ప్రారంభోత్సవాలు.. పాత తేదీలతో శిలాఫలకాలు



హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 14: ఎన్నికలు సమీపిస్తుండటంతో మండల వ్యాప్తంగా అరకొర పనులతో పూర్తి చేసుకున్న ప్రభుత్వ నిర్మాణాలను స్థానిక వైసీపీ నేతలు హడావుడి ప్రారంభిస్తున్నారు. వేలేరులో నిర్మించిన సచివాలయ సముదాయాన్ని గురువారం సర్పంచ్ సొది మెళ్ల సుందరమ్మతో కలిసి స్థానిక వైసీపీ నేతలు ప్రారంభించారు. కానీ శిలాఫలకంపై మాత్రం ఫిబ్రవరి 20నే ఎమ్మెల్యే వంశీ ప్రారంభించినట్టు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం వారు తయారు చేయించారు. ప్రారంభ సమయంలో ఏదైనా సమస్యలు వస్తాయనే ఉద్దేశంతో శిలాఫలకాన్ని పక్కగదిలోనే ఉంచారంటూ స్థానిక ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. వైసీపీ కార్యకర్తలే శిలాఫలకం లేకుండా ప్రారంభోత్సవం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయావకాశాలు సన్నగిల్లడం వల్లే హడావుడి ప్రారంభోత్సవాలు చేస్తున్నారంటూ టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళా ఉద్యోగులకు అండగా ఏపీ ఎన్జీవో

● రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి

కృష్ణలంక, మార్చి 14: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు సంఘం ప్రారంభం నుంచి ఏపీ ఎన్జీవో సంఘం అండగా ఉందని, ఇక ముందు కూడా ఉంటుందని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘం జిల్లా, రాష్ట్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఎన్జీవో సంఘ భవనంలో జరుగుతున్న మహిళా ఉద్యోగుల క్రీడాపోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై ఏపీ ఎన్జీవో సంఘం వేగంగా స్పందించి పోరాటాలకు రూపకల్పన చేసిందని గుర్తు చేశారు. మహిళా ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం సంఘ నాయకత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పాల్గొన్నారు. శుక్రవారం జరుగనున్న బహుమతి ప్రదానోత్సవానికి రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ జి.వాణిమోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు.

విద్యుత్ పొదుపుపై స్వర్ణకారులకు అవగాహన

గవర్నర్‌పేట, మార్చి 14: శ్రీ విశ్వకర్మ గోల్డ్‌క్లస్టర్‌లో గురువారం స్వర్ణకారులకు విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సు జరిగింది. రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్, కేంద్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ప్రసంగించిన వక్తలు స్వర్ణకారుల విద్యుత్ వాడకంలో ఆదాతో పాటు కార్బన్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రాజెక్టు ఎలా ఉపయోగపడుతోందో వివరించారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్వర్షేషన్ మిషన్ పీవో హేమంత్, శ్రీ విశ్వకర్మ గోల్డ్ క్లస్టర్ విజయవాడ చైర్మన్ ధనాలకోట శ్రీనివాసరావు, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సౌమిత్రి, కామాక్షి స్వర్ణ సంఘం ప్రధాన కార్యదర్శి కె. హేమసుందరం, కోశాధికారి అందే కృష్ణసాయి, వన్‌టౌన్ సంఘ కోశాధికారి ఎస్‌కే సలీం పాల్గొన్నారు.

గన్నవరాన్ని మొదటిస్థానంలో నిలబెడతా!

● టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ



రామవరప్పాడులో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వెంకట్రావు

గుణదల, మార్చి 14: ఈ సార్వత్రిక ఎన్నికల తర్వాత గన్నవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రామవరప్పాడులో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కార్యాలయ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కుప్పం నియోజకవర్గంతో పోటీపడేలా గన్నవరం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానన్నారు. గన్నవరంలో గడచిన ఐదేళ్లలో భూకబ్జాలు అధికమయ్యాయన్నారు. ఎయిర్‌పోర్టు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అడ్డుకున్న సంగతిని గుర్తుచేశారు. గన్నవరంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, నియోజకవర్గంలో టీడీపీకి వచ్చే మెజార్టీ విజయవాడ రూరల్ మండలం నుంచే ప్రారంభం కావాలని పార్టీ శ్రేణులకు యార్లగడ్డ పిలుపునిచ్చారు. జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామవరప్పాడులో కేక్‌కట్ చేసి జనసైనికులు, వీరమహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొల్లా ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 25 కుటుంబాలు యార్లగడ్డ సమక్షంలో పార్టీలో చేరారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, బీజేపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఫణి, కొల్లా ఆనంద్, దొంతు చిన్న, గుజ్జర్లపూడి బాబూరావు, పోలిశెట్టి రమణ, అద్దేపల్లి సాంబు, పరుచూరి నరేష్, నభిగాని కొండ, సర్నాల బాలాజి, తుపాకుల శివలీల, పట్టపు చంటి, కోనేరు సందీప్, అడ్డగిరి రామకృష్ణ, పొదిలి లలిత, కొంగన రవి, బొమ్మసాని అరుణ, కూనపరెడ్డి నాని, కళ్లేపల్లి నాగరాజు, నాయన హరికృష్ణ పాల్గొన్నారు.



గ్రూప్-1 అక్రమాలపై నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ, జనసేన బీజేపీ నేతలు

గ్రూప్-1 అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 14: రాజ్యాంగబద్ధ సంస్థ అయిన సర్వీస్ కమిషన్‌ను సీఎం జగన్‌రెడ్డి తన రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుని లక్షలామంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గురువారం ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఉద్యోగాలను అమ్ముకుని కుంభకోణానికి పాల్పడిన వైసీపీ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీపీఎస్సీ కూడా వారి విధ్వంసానికి బలైందన్నారు. ఇందులో రూ.150 కోట్ల కుంభకోణం జరిగిందని, సంతలో పశువుల్ని అమ్ముకున్నట్టు జగన్ ఏపీపీఎస్సీ ఉద్యోగాలను అమ్ముకున్నారన్నారు. ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.2.50 కోట్లకు, డీఎస్పీ పోస్టును రూ.1.50 కోట్లకు అమ్ముకున్నారన్నారు. సంప్రదాయబద్ధంగా వస్తున్న మాన్యువల్ మూల్యాంకనం కాకుండా తమ వారికి ఉద్యోగాలు కట్టబెట్టేందుకు ప్లాన్‌చేసిన వైసీపీ ప్రభుత్వం డిజిటల్ విధానంలో వాల్యూయేషన్ చేశారన్నారు. ఈ కుంభకోణానికి బాధ్యులైన ఏపీపీఎస్సీ సెక్రటరీ పీఎస్ఆర్ ఆంజనేయులు, చైర్మన్ గౌతం సవాంగ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రం ప్రజాకోర్టులో శిక్ష తప్పదన్నారు. అమ్మిశెట్టి వాసు, ముమ్మనేని ప్రసాద్, పోతంశెట్టి నాగేశ్వరరావు, భాగం సాయి, చందు శివరామకృష్ణ, ఫిరోజ్, గుండు శ్రీను, మాదల చిన్నతల్లి పాల్గొన్నారు.

వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు డీమ్డ్ యూనివర్శిటీగా గుర్తింపు

మొగల్రాజపురం, మార్చి 14: కానూరులోని వెలగపూడి సిద్ధార్థ ఇంజనీరింగ్ (వీఆర్ సిద్ధార్థ) ఇంజనీరింగ్ కళాశాలకు డీమ్డ్ వర్శిటీ హోదాను కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రకటించిందని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు చెప్పారు. స్థానిక అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ లక్ష్యసాధనలో భాగంగా వికసిత భారత్ - 2047, ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా వంటి వాటి ప్రేరణతో నూతన ఆవిష్కరణలు, స్టార్టప్, వ్యవస్థాపక అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆట్లూరి వెంకట రత్నప్రసాద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ నూతన విద్యావిధానం-2020 నిబంధనలను అనుసరించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి బోధన, పరిశోధనలను అందించవచ్చని చెప్పారు. ఈ హోదాతో అండర్ గ్రాడ్యుయేషన్, గ్యాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ డిగ్రీ స్థాయిల్లో నూతన ఆవిష్కరణకు దారి తీసేలా ఉన్నత విద్య అందించవచ్చన్నారు. ఈ ఏడాదికి వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రవేశాలు డీమ్డ్ టు బీ యూనివర్శిటీ పేరుతో యూజీసీ నిబంధనల మేరకు చేపడతామన్నారు. అకాడమీ ఉపాధ్యక్షుడు ప్రముఖ పారిశ్రామికవేత్త మలినేని రాజయ్య, ట్రెజరర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు డీన్స్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



వివరాలు చెబుతున్న డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్న ప్రసాద్

విద్యాసాగర్ నాయకత్వం స్ఫూర్తిదాయకం



విద్యాసాగర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

ధర్నాచౌక్, మార్చి 14: ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ జన్మదిన వేడుకలు గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో గురువారం జరిగాయి. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యాసాగర్ నాయకత్వం స్ఫూర్తిదాయకమని, ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటమే ఆయన బలమన్నారు. 3 దశాబ్దాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించారని ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.శివారెడ్డి తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తనకు సహకరించిన వారికి విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ సంక్షేమ విభాగం సలహాదారు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్జీవో సంఘం రాష్ట్ర నేతలు పురుషోత్తం నాయుడు, నాగభూషణం, రంగారావు, రమణ, జిల్లా నేతలు ఇక్బాల్, ఎం.రాజుబాబు, విశ్వనాథ్, మధుసూదనరావు, దిలీప్‌కుమార్, శ్రీరామ్, సంపత్‌కుమార్, వీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

దోపిడీ విధానానికి మార్క్సిస్టు సిద్ధాంతమే విరుగుడు

గవర్నర్‌పేట, మార్చి 14: సామ్రాజ్యవాదం, కార్పొరేట్ పెట్టుబడిదారుల దోపిడీ ఫాసిస్టు విధానానికి విరుగుడు మార్క్సిస్టు సిద్ధాంతమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్ల్ మార్క్స్ 141వ వర్థంతి సందర్భంగా మార్క్స్, ఎంగెల్స్ లెనిన్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హనుమాన్‌పేటలోని మార్క్స్ విగ్రహం వద్ద సంస్మరణ సమావేశం నిర్వహించారు. సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సీపీఎం సీనియర్ నేత వి.ఉమామహేశ్వరరావు, విగ్రహ కమిటీ కన్వీనర్ బి.జమీందార్ విగ్రహం వద్ద పూలరింగును ఉంచి నివాళులర్పించారు. సోషలిజం వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. అక్కినేని వనజ మాట్లాడుతూ సామాజిక అసమానతలు, శ్రమ దోపిడీ, పెట్టుబడిదారీ విధానాలు లేకుండా ఉండేందుకు దాస్ క్యాపిటల్, కమ్యూనిస్టు ప్రణాళిక వంటివి మార్క్స్ ప్రతిపాదించారన్నారు. వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మార్క్సిజం పెద్ద భూతంలాగా చూపించి అంతం చేయాలని సామ్రాజ్యవాద దేశాలు కుట్రలు చేశాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఇఫ్టూ నేతలు కె.పోలారి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, మహిళా సమాఖ్య కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, రైతు సంఘం సీనియర్ నేత కేశవరావు, ప్రోగ్రెసివ్ ఫోరం నేతలు అక్కినేని చంద్రారావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, మోతుకూరి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక సర్వీస్ నిబంధనలు ఏర్పాటు చేయాలి

అమరావతి జేఏసీ నేతలు, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిూస్ సంఘ నేతలు

విజయవాడ, వన్‌టౌన్, మార్చి 14: అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక సర్వీస్ నిబంధనలతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ హ్యూమన్ రీసోర్స్ ఆర్థిక కార్యదర్శి చిరంజీవి చౌదరికి అమరావతి జేఏసీ నేతలు, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిూస్ సంఘ నేతలు విజ్ఞప్తి చేశారు. గురువారం చిరంజీవిచౌదరితో సమావేశమైన నేతలు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక నిబంధనలను ఏర్పాటు చేయాలని కోరారు. అమరావతి జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కే సుమన్, ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్ మాట్లాడుతూ ఆప్కాస్ పరిధిలోకి ఫారెస్ట్, ఆర్టీసీ, గురుకులం, టూరిజం, ఇరిగేషన్ శాఖల ఉద్యోగులను తీసుకురావాలని కోరారు. ప్రత్యేక పరిస్థితుల్లో 30 రోజుల మెడికల్ లీవ్ ఇవ్వాలని కోరారు. ఒకే హోదాలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి వేతన వ్యత్యాసాన్ని సవరించి సమానంగా వేతనాలివ్వాలన్నారు. బీపీఎల్‌తో సంబంధం లేకుండా రైస్‌కార్డ్‌లిచ్చి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలన్నారు.

జీవో 7లో స్పష్టత లేక ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీనిపై చిరంజీవి చౌదరి సానుకూలంగా స్పందిస్తూ అన్ని విషయాలపై అధ్యయనం చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానన్నారు. ఇంకా పలువురు నేతలు పాల్గొన్నారు.

'స్థానికులతో 75శాతం ఉద్యోగాల భర్తీ'ని రద్దు చేయండి

▸▸ హైకోర్టులో వ్యాజ్యం.. ప్రభుత్వాలకు ధర్మాసనం నోటీసులు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పరిశ్రమలు, కర్మాగారాలలో 75శాతం ఉద్యోగాలను స్థానికులతో భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ వారికి నోటీసులు జారీ చేసింది. విచారణను మూడువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలోని పరిశ్రమలు, కర్మాగారాలలో 75శాతం ఉద్యోగాలను స్థానికులతో భర్తీ చేయాలని 2019లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్, వసంత ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి.

వెంకట్రామిరెడ్డిని నిలదీసిన సచివాలయ ఉద్యోగులు!

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా ఉండి ఇక్కడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా.. బయట ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారం చేయడం తగదని సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిని పలువురు ఉద్యోగులు నిలదీశారు. అమరావతి సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో సచివాలయ ఉద్యోగుల సంఘం(అప్సా) జనరల్ బాడీ సమావేశం వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ఉద్యోగులు బకాయిల గురించి, ఇతర సమస్యల పరిష్కారం గురించి వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుకూల ప్రచారంపై గిట్టని వాళ్లు తన పై ప్రచారం చేస్తున్నారని వెంకట్రామిరెడ్డి సమర్థించుకునే ప్రయత్నం చేయగా.. 'మీరు మాట్లాడిన వీడియోలు, వాయిస్‌లు ఉన్నాయి కదా' అంటూ ఉద్యోగులు నిలదీయడంతో కాకర్ల నీళ్లు నమిలినట్లు సమాచారం.

ఔట్ సోర్సింగ్‌కు ప్రత్యేక సర్వీస్ రూల్స్ ఉండాలి

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక సర్వీసు రూల్స్‌ను ఏర్పాటు చేయాలని, సీనియారిటీని బట్టి ప్రతి ఏటా వేతనాన్ని కనీసం ఐదు శాతం పెంచాలని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సుమన్, సురేష్ డిమాండ్ చేశారు. గురువారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ఆర్థికశాఖ కార్యదర్శి(హెచ్‌ఆర్) చిరంజీవి చౌదరి, ఆధ్వర్యంలో జరిగిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో పలు సమస్యలను బొప్పరాజు.. చిరంజీవి చౌదరి దృష్టికి తీసుకెళ్లారు.

జగన్ గిరిజన ద్రోహి: కొండా

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్ములను సైతం వారికి తెలియకుండా దోచుకున్న గిరిజన ద్రోహి జగన్ అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండా నరహరి వరప్రసాద్ విమర్శించారు. సెక్రటేరియట్ ఉద్యోగులకు 30 నుంచి 24 శాతానికి, ఇతర ఉద్యోగులకు 20 శాతం నుంచి 16 శాతానికి హెచ్‌ఆర్‌ను తగ్గించి ప్రభుత్వం ఉద్యోగులకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు.

గురుకులాల డైట్ బిల్లులు విడుదల చేయాలి

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకులాలు, గిరిజన సంక్షేమ వసతి గృహాలకు 4 నెలలుగా పెండింగ్‌లో ఉన్న డైట్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ చైర్మన్ అక్కులప్ప నాయక్ గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండేను కోరారు.

వలంటీర్ల ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు: షరీఫ్

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఓటమి భయంతోనే జగన్‌రెడ్డి వలంటీర్లతో ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నాడని టీడీపీ సీనియర్ నేత ఎంఏ షరీఫ్ ఆరోపించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... టీడీపీ అధికారంలోకి వస్తే, సంక్షేమ పథకాలు నిలిపివేస్తారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. వలంటీర్లు చెప్తున్నట్లు సంక్షేమ పథకాలు రద్దవుతాయని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

8 సహకార సంఘాలకు ఎన్సీడీసీ అవార్డులు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) రీజనల్ కోఆపరేటివ్ ఎక్స్‌లెన్స్, మెరిట్ అవార్డులు-2023కు రాష్ట్రంలోని 8 సహకార సంఘాలు ఎంపికయ్యాయి. కానూరు ఎల్‌పీసీఎస్, పులుగుర్త చేనేత సహకార సంఘం, జంగావారిపల్లె, కుప్పం మహిళా డెయిరీ సహకార సంఘాలు ఎక్స్‌లెన్స్ అవార్డులు పొందగా, తిమ్మసముద్రం, దిమిలి పీఏసీఎస్‌లు, రంగాయపాలెం, పెదభరణపల్లె మహిళా డెయిరీలకు మెరిట్ అవార్డులు దక్కాయని ఎన్సీడీసీ రీజనల్ డైరెక్టర్ వంశీ గురువారం తెలిపారు. మంగళగిరిలోని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య కార్యాలయంలో సహకార శాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు ఆయా సంఘాలకు ఈ అవార్డులను అందజేశారు.

ఆస్తుల జప్తునకు అనుమతి ఇవ్వండి

▸▸ ఫైబర్ కేసులో సీఐడీ పిటిషన్ దాఖలు

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ కేసులో నిందితులుగా ఉన్నవారి ఆస్తుల జప్తునకు అనుమతివ్వాలని సీఐడీ అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఏ1గా టీడీపీ అధినేత చంద్రబాబు ఉన్నారు. ఏ2గా వేమూరి హరికృష్ణ ప్రసాద్, ఏ5గా తుమ్మల గోపీచంద్, ఏ4గా టెర్రాసాఫ్ట్ కంపెనీ డైరెక్టర్, ఏ11గా వీఎల్ఎస్ విప్లవ్ కుమార్, ఏ13గా విజయ్‌కుమార్ రామ్మూర్తి, ఏ14గా రామ్‌కుమార్ మూర్తి, ఏ18గా కనుమూరి కోటేశ్వరరావు ఆస్తులను జప్తు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు.

షరతులతో గ్రేడ్-2 వీఆర్వోలకు ప్రొబేషన్

అమరావతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ సహాయకుడి (వీఆర్ఏ) నుంచి గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌ఓ)గా పదోన్నతి పొందిన వారి ప్రొబేషన్‌ను ప్రకటిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిలోగా సర్వే, ఇతర పరీక్షలు పాసవ్వాలని షరతు విధిస్తూ ప్రొబేషన్ ప్రకటించింది. సర్వే అంశాలపై రాత పరీక్షకు రెగ్యులర్ షెడ్యూల్ విడుదల చేయాలని సర్వేకమిషనర్‌ను ఆదేశించింది.

సాగు రంగంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ 20% పెంపుదల

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలల్లో 20రకాల పంటలకు 2024-25లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను 2023-24 కన్నా 20% పెంపుదలకు రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ ఆమోదం తెలిపింది. గురువారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ప్రధానంగా వచ్చే ఖరీఫ్‌లో వరికి రూ. 42,000-46,000 రబీలో వరికి రూ.45,000- 49,000, మొక్కజొన్నకు రూ.42,000- 45,000, పచ్చిమిర్చికి రూ.90,000-95,000, ఎర్రమిర్చి రూ.1,15,000-1,25,000, చెరకుకు రూ.90,000- 1,00,000, ఆయిల్‌పామ్‌కు రూ.70,000-75,000, హైబ్రిడ్ టమాటాకు రూ.95వేల నుంచి రూ.లక్షా15వేలు, ప్లాంటేషన్ అరటికి రూ.90వేల నుంచి రూ.లక్ష, టిష్యూ కల్చర్ అరటికి రూ.1,15,000- 1,30,000, మల్బరీకి రూ.1,00,000-1,10,000, తిలాపియా చేపల సాగుకు రూ.4,20,000-5,00,000, వనామీ రొయ్యలకు రూ.6 నుంచి రూ.7లక్షలు, వనామీ ప్రోత్సాహకం రూ.9నుంచి రూ.10లక్షలుగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ణయించారు.

వర్సిటీల్లో అంబుడ్స్‌పర్సన్లు ఎక్కడ?

▸▸ 228 విశ్వవిద్యాలయాలు ఇంకా నియమించలేదు

న్యూఢిల్లీ, మార్చి 14: ర్యాగింగ్ వంటి అంశాలు, విద్యార్థుల సమస్యలపై అంబుడ్స్‌పర్సన్లను నియమించాలని పదేపదే చెబుతున్నా.. పలు విశ్వవిద్యాలయాలు పట్టించుకోవడం లేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇంకా 228 వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించాలని పేర్కొంటూ.. బుధవారం ఆ జాబితాను విడుదల చేసింది. ఈ లిస్టులో 67 ప్రైవేటు, 159 రాష్ట్ర ప్రభుత్వ, రెండు డీమ్డ్ యూనివర్సిటీలున్నాయి. గత ఏడాది ఆగస్టులో జాదవ్‌పూర్ వర్సిటీలో ర్యాగింగ్, లైంగిక వేధింపుల కారణంగా ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డారు. నవంబరులోనూ ర్యాగింగ్, వేధింపులు ఓ పీజీ విద్యార్థి బలవన్మరణానికి కారణమయ్యాయి. దీంతో వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించుకోవాలంటూ యూజీసీ గెజిట్ జారీ చేసింది. జనవరి 17న సుమారు 421 వర్సిటీలు ఆ దిశలో చర్యలు తీసుకోలేదంటూ మందలించింది. తాజాగా ఇంకా 228 వర్సిటీలు అంబుడ్స్‌పర్సన్లను నియమించాల్సి ఉందని పేర్కొంటూ బుధవారం మరో జాబితాను విడుదల చేసింది. వెంటనే అంబుడ్స్‌పర్సన్లను నియమించుకుని, ఆ వివరాలను ఈమెయిల్ ద్వారా తెలియజేయాలని ఆదేశించింది. ఈ చిట్టాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆరు విశ్వవిద్యాలయాలున్నాయి. వీటిల్లో.. తెలంగాణకు చెందిన కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం, నిమ్స్, ఆర్జీయూకేటీ(బాసర), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ, క్లస్టర్ వర్సిటీ, శ్రీవేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయం ఉన్నాయి.

సీఏఏ వివక్షాపూరితం

ఐరాస, ఆమ్నెస్టీ, అమెరికా అభ్యంతరాలు

వాషింగ్టన్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ఐక్యరాజ్యసమితి, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, అమెరికా ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. సీఏఏ ప్రాథమికంగానే వివక్షతో కూడుకున్న చట్టమని, అంతర్జాతీయంగా భారత్ కట్టుబడి ఉన్న మానవహక్కుల ఒప్పందాలను ఇది ఉల్లంఘిస్తుందని.. 2019లో సీఏఏ చట్టాన్ని చేసినప్పుడే తమ ఆందోళనను వెలిబుచ్చామని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం ప్రతినిధి తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల చట్టానికి అనుగుణంగా సీఏఏ ఉందా? అన్నదానిని పరిశీలిస్తున్నామన్నారు. అమెరికా ప్రభుత్వ ప్రతినిధి స్పందిస్తూ.. సీఏఏను ఏ విధంగా అమలు చేయబోతున్నారన్న దానిని నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. మతం ఆధారిత వివక్షను చట్టబద్ధం చేసే సీఏఏను ఒక చట్టంగా తీసుకురావటం సరైనది కాదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అభిప్రాయపడింది. మరోవైపు, సీఏఏపై అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తొలిసారిగా స్పందిస్తూ.. చట్టం అందరికీ సమానంగా వర్తించాలని, సీఏఏ పరిధిలోకి ముస్లింలను కూడా తీసుకురావాలని పేర్కొంది. తమ దేశంలో హిందువులు, సిక్కుల వంటి మత మైనారిటీలపై ఎటువంటి వివక్ష, వేధింపులు లేవని తెలిపింది.

సీఏఏపై వెనక్కి తగ్గేది లేదు

▸▸ అమిత్‌షా వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సీఏఏను రాజ్యాంగ విరుద్ధం అంటూ విపక్షాలు చేస్తున్న వాదనలను ఆయన కొట్టివేశారు. ప్రజలను విపక్షాలు భయపెడుతున్నట్టు సీఏఏ నిబంధనల్లో నిర్బంధ శిబిరాల ప్రస్తావన ఎక్కడా లేదని గురువారం 'ఏఎన్ఐ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. విపక్షాలు పదేపదే ప్రస్తావించే ఆర్టికల్ 14కు భిన్నంగా సీఏఏ నిబంధనలను రూపొందలేదని పేర్కొన్నారు. "అధికారంలోకి వస్తే సీఏఏను రద్దు చేస్తామని అంటున్న 'ఇండియా' కూటమికి తాను అధికారంలోకి రాబోవడం లేదని స్పష్టంగా తెలుసు. సీఏఏను మోదీ ప్రభుత్వం తెచ్చింది. దానిని రద్దు చేయడం అసాధ్యం. ఎందుకంటే ఇది పూర్తిగా రాజ్యాంగ సహిత చట్టం. అందువల్లే సుప్రీంకోర్టు దీనిపై స్టే విధించలేదు" అని అమిత్‌షా పేర్కొన్నారు. సీఏఏను ముస్లిం వ్యతిరేక చట్టంగా ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ ఆక్షేపించడంపై స్పందిస్తూ... "అతని తర్కం ఏమిటి? పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ ఇస్లామిక్ దేశాలు. అక్కడ ముస్లింలపై వివక్షకు తావు లేదు. అందువల్లే ముస్లింలను సీఏఏ జాబితాలో చేర్చలేదు" అని తెలిపారు.

కర్నూలులో లా వర్సిటీకి శంకుస్థాపన

ఎన్నికల నోటిఫికేషన్ రానున్న సమయంలో జగన్ హడావుడి



లా వర్సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం జగన్

కర్నూలు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారున జగన్నాథ గట్టుపై జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (నేషనల్ లా యూనివర్సిటీ) నిర్మాణానికి సీఎం జగన్ గురువారం శంకుస్థాపన చేసి, పైలాన్ ఆవిష్కరించారు. 150 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,011 కోట్ల అంచనా వ్యయంతో దీన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. రెండు మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న సమయంలో హడావుడిగా పైలాన్ ఆవిష్కరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2019 డిసెంబరు 23న కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె సమీపంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి జగన్ భూమి పూజ చేసి టెంకాయ కొట్టారు. నాటి కార్యక్రమంలో జగన్ మాట్లాడుతూ 'ఎన్నికలకు 6నెలల ముందు చంద్రబాబు టెంకాయ కొడితే.. మన ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే నేను టెంకాయ కొట్టాను. ఇదీ విశ్వసనీయత అంటే! చంద్రబాబుది నమ్మకద్రోహం' అని విమర్శించారు. ఆ వ్యాఖ్యలను ఇప్పుడు న్యాయవాదులు గుర్తుచేసుకొంటున్నారు. 'ఇప్పుడు మీరు చేసింది ఏమిటి జగన్?' అని జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమంలో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం రాయలసీమలో, అందులోనూ కర్నూలులో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శ్రీబాగ్ ఒడంబడిక మేరకే హైకోర్టు ఏర్పాటు చేయబోతున్నామని, మంచి హైకోర్టు భవనం కడతామని తెలిపారు. మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ మంధాత సీతారామమూర్తి, లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి జి.సత్య ప్రభాకర్, ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమానికి తమను పిలిచి సముచిత గౌరవం ఇవ్వలేదని న్యాయవాదులు ఆందోళనకు దిగారు. సీఎం జగన్ అలా వచ్చి.. ఇలా వెళ్లిపోయారు. కార్యక్రమాన్ని అరగంటలో ముగించారు. ముఖ్యమంత్రి ముఖంలో ఉత్సాహం కనిపించలేదు.



మమతకు తీవ్ర గాయం

▸▸ ఇంట్లో పడిపోవడంతో నుదుటిపై చిట్లి రక్తస్రావం

కోల్‌కతా, మార్చి 14: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ గురువారం సాయంత్రం తన నివాసంలో పడిపోవడంతో ఆమెకు నుదుటిపై తీవ్ర గాయమైంది. ఆమెను వెంటనే ప్రభుత్వ ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తరలించారు. సీనియర్ వైద్యుల బృందం ఆమెకు చికిత్స అందిస్తోంది. కుట్లు వేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్టు ఆమె సోదరుడు కార్తీక్ బెనర్జీ తెలిపారు. నుదుటిపై గాయం నుంచి రక్తం కారుతున్న మమత ఫొటోను తృణమూల్ కాంగ్రెస్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. తమ చైర్‌పర్సన్‌కు తీవ్ర గాయమైందని, ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థించాలని కోరింది. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారని టీఎంసీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రే తెలిపారు.

సాగర్ మరమ్మతు పనులను అడ్డుకోవద్దు

▸▸ కృష్ణాబోర్డు, సీఆర్‌పీఎఫ్‌కు ఎన్డీఎస్ఏ ఆదేశం

▸▸ డ్యాం రిపేరుపై తెలుగు రాష్ట్రాలకు సూచనలు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు రక్షణ అంశంతో ముడిపడి ఉన్న పనులు, అత్యవసరంగా చేపట్టే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్‌ఎం) పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవద్దని కృష్ణాబోర్డు, సీఆర్‌పీఎఫ్ బలగాలను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) ఆదేశించింది. సాగర్ రక్షణను పరిశీలించడానికి వీలుగా కేంద్ర జలశక్తిశాఖ ఎన్డీఎస్ఏ కమిటీని వేయగా.. ఆ కమిటీ ఫిబ్రవరి 13న డ్యామ్‌ను పరిశీలించింది. కట్టను పరిశీలించే క్రమంలో ప్రధానంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఓ అండ్ ఎం పనులకు అడ్డంకులు ఏర్పడుతున్నట్లు గుర్తించింది. ఈ మరమ్మతులను అడ్డుకోవద్దని కృష్ణాబోర్డుతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలకు స్పష్టం చేసింది. వానాకాలంలోపే, ప్రాజెక్టుకు వరద వచ్చి చేరేలోపే ఓ అండ్ ఎం పనులన్నీ పూర్తిచేయాలని నిర్దేశించింది. గేట్లను ఎత్తడానికి వీలుగా ఉన్న గ్యాంట్రీ క్రేన్ రైల్ ట్రాక్ దెబ్బతిన్నట్లు గుర్తించిన ఎన్డీఎస్ఏ.. సత్వరం దాని పనులు పూర్తిచేయాలని స్పష్టం చేసింది. డ్యామ్ కట్ట భాగం.. కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాలతో పాటు పలు భాగాలను ఎన్డీఎస్ఏ పరిశీలించింది. నివేదికను గురువారం తెలుగు రాష్ట్రాలకు పంపించింది.

డ్యామ్ సేఫ్టీ కమిటీ సిఫారసులు..

- కౌంటర్ వెయిట్‌ల వద్ద పిల్లర్లలో కొన్ని పగుళ్లు ఉన్నాయి. అన్ని పిల్లర్లను సమగ్రంగా పరిశీలించాలి. స్పిల్‌వే(నీరు జారే ప్రాంతం)లో రంధ్రాలు ఉన్నాయి. వాటిని కాంక్రీట్‌తో నింపాలి. స్పిల్‌వే దిగువ భాగంలో రాళ్లు బయటికి తేలి కనిపిస్తున్నాయి. ఆ రాళ్లను సరిచేసి, మరమ్మతులు చేయాలి. స్పిల్‌వే నుంచి నీరు జారి కింద పడే ప్రదేశం(ఫ్లిప్ బకెట్)లో భారీగా గుంతలు ఉన్నాయి. వాటికి వానాకాలంలోపే మరమ్మతులు చేయాలి. కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో భారీగా ఉన్న సీపేజీ నివారణకు చర్యలు తీసుకోవాలి. కట్ట, కాలువల్లో గడ్డితో పాటు ఇతర వ్యర్థాలను తొలగించాలి. ఇంకా పలు సిఫారసులు చేసింది.

మాజీ మంత్రి ప్రత్తిపాటిపై జీఎస్టీ కేసు..

▸▸ కౌంటర్ దాఖలుకు సమయం కోరిన సీఐడీ

▸▸ అంతవరకు పిటిషనర్లను అరెస్ట్ చేయబోమని హామీ

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేత, బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులు మళ్లించారని ఆరోపిస్తూ నమోదు చేసిన కేసులో మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన సతీమణి వెంకాయమ్మ, కుమార్తె స్వాతి, కుర్రా జోగేశ్వరరావు, బొగ్గవరపు అంకమ్మరావు, బొగ్గవరపు నాగమణి, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఇండియా ఎండి బలుసు శ్రీనివాసరావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై సవివరంగా కౌంటర్ దాఖలు చేస్తామని సీఐడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైఎల్ శివకల్పనారెడ్డి గురువారం హైకోర్టుకు వివరించారు. విచారణను ఈ నెల 22కు వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్ల అరెస్ట్ చేయబోమని గతంలో ఇచ్చిన హామీని తదుపరి విచారణ వరకు పొడిగించవచ్చన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. కౌంటర్ దాఖలు చేసేందుకు సీఐడీకి సమయం ఇస్తూ విచారణను ఈనెల 22కి వాయిదా వేశారు. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఆదేశాలిచ్చారు. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఏ దశలో ఉంది?



▸▸ భూములేమైనా విక్రయించారా?

▸▸ వివరాలను కోర్టు ముందుంచండి

▸▸ ఆర్ఐఎన్ఎల్ సీఎండీకి హైకోర్టు ఆదేశం

▸▸ పరిశ్రమను కొనుగోలు చేస్తారా?

▸▸ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ధర్మాసనం

▸▸ భూములు అమ్మలేదు.. కౌంటర్ వేస్తాం: కేంద్రం

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): 'విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఏ దశలో ఉంది?. స్టీల్ ప్లాంట్‌కు చెందిన భూములు ఏమైనా విక్రయించారా? పరాధీనం చేశారా? విక్రయిస్తే ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు విక్రయించారు? తదితర వివరాలను కోర్టు ముందు ఉంచండి' అని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)ని హైకోర్టు ఆదేశించింది. మరోవైపు ప్లాంట్‌ను కొనుగోలు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఏమైనా ఉందా? అని ఏజీని ఆరా తీసింది. కర్మాగారానికి చెందిన భూములను ఇప్పటికే విక్రయించారని ఆరోపిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందుంచాలని పిటిషనర్‌ను ఆదేశించింది. కేసుకి సంబంధించిన వివరాలు తప్ప ఇతర విషయాలు ప్రస్తావించవద్దని పిటిషనర్ కేఏ పాల్‌ను హెచ్చరించింది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, విశ్రాంత ఐపీఎస్ అధికారి వాసగిరి లక్ష్మీనారాయణ వేర్వేరుగా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం హైకోర్టులో విచారణకురాగా పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా నిలువరించాలని కోరారు. ఇప్పటికే ప్లాంట్‌కు చెందిన వేల ఎకరాలను అమ్మేశారన్నారు. కేవలం 16వేల ఎకరాలు మాత్రమే మిగిలాయన్నారు. స్టీల్ ప్లాంట్ నష్టాలలో ఉందా? లేదా? అనే విషయాన్ని తేల్చేందుకు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీని వేయాలని కోరారు. ఎఫ్‌సీఆర్ఏ (ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) కింద ప్రత్యేక ఖాతాకు కేంద్రం అనుమతిస్తే సొమ్మును అందులో జమ చేస్తామన్నారు. స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఆస్తులు విక్రయించకుండా స్టే విధించాలని కోరారు. అడ్వకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.... స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. పరిశ్రమను నష్టాల నుంచి బయటపడేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయాలు సూచించిందన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన వారికి నష్టం జరగకూడదన్నదే తమ అభిప్రాయమన్నారు. పరిశ్రమ విక్రయం చివరి ఆప్షన్‌గా ఉండాలన్నారు. ధర్మాసనం కలగజేసుకుంటూ స్టీల్ ప్లాంట్‌ను కొనుగోలు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి ఏమైనా ఉందా? అని ఏజీని ఆరా తీసింది. ఏజీ సమాధానం ఇస్తూ ఈ వ్యవహారంపై ప్రభుత్వం నుంచి వివరాలు తెప్పించుకోవాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూములు విక్రయించామన్న పిటిషనర్ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

లిఫ్ట్ ఇస్తామని కారు ఎక్కించుకుని దారిదోపిడీ

▸▸ ఏపీకి చెందిన దంపతులు నల్లగొండ జిల్లాలో అరెస్టు

నల్లగొండ టౌన్, మార్చి 14: లిఫ్ట్ ఇస్తామంటూ ఒంటరి ప్రయాణికులను నమ్మించి కారులో ఎక్కించుకుని దారిదోపిడీకి పాల్పడిన ఏపీకి చెందిన దంపతులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఈ కేసు వివరాలను డీఎస్పీ కె.శివరాంరెడ్డి వెల్లడించారు. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన చిమట గోపీకృష్ణ తన మొదటి భార్యతో గొడవ పెట్టుకుని ఒంటరిగా ఉండేవాడు. కారు డ్రైవర్ అయిన అతడు సత్తెనపల్లికే చెందిన వితంతువు చింత మహేశ్వరిని ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. గోపీకృష్ణ, మహేశ్వరి దంపతులు తమ సంపాదన సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఒంటరిగా ప్రయాణం చేసే వారిని లిఫ్ట్ పేరుతో నమ్మించి కారులో ఎక్కించుకుని దారిలో వారిని దోచుకోవాలని పథకం వేసుకున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసముండే దుగ్గి కృష్ణారావు తన స్వస్థలం సత్తెనపల్లి మండలం బూరుగుపాడుకు ఈనెల 10న వచ్చి అదేరోజు రాత్రి తిరుగుప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా గమనించిన గోపీకృష్ణ దంపతులు.. అద్దె కారులో కృష్ణారావు వద్దకు వెళ్లి తామూ హైదరాబాద్ వెళుతున్నామని, లిఫ్ట్ ఇస్తామని నమ్మించి వాహనంలో ఎక్కించుకున్నారు. కారు నల్లగొండకు చేరుకోగానే దేవరకొండ రోడ్డులోని కొత్తపల్లి గ్రామ శివారుకు తీసుకెళ్లి ఆపారు. వెంటనే తమ వద్ద ఉన్న కత్తులను బయటకు తీసి కృష్ణారావును చంపేస్తామని బెదిరించి.. అతని వద్ద ఉన్న 15 గ్రాముల బంగారు గొలుసు తీసుకుని పరారయ్యారు. ఈ చోరీపై కృష్ణారావు 11వ తేదీన నల్లగొండ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కారును గుర్తించారు. మర్రిగూడ బైపాస్‌లో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి కారు, 15గ్రాముల బంగారు గొలుసు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

స్క్రాప్ విక్రయంతో రైల్వేకు 411 కోట్ల ఆదాయం

హైదరాబాద్/జహీరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24లో స్క్రాప్ విక్రయంతో రూ.411.39 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. నిరుపయోగ తుక్కు అమ్మకంలో రైల్వే బోర్డు నిర్దేశించిన లక్ష్యాన్ని జోన్ అధిగమించిందని రైల్వే అధికారులు తెలిపారు. గత ఏడాది 2022-23లో స్క్రాప్ అమ్మకం ద్వారా రూ.391 కోట్ల ఆదాయం లభించినట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఇ-వేలం ద్వారా అమ్మకాలను చేపట్టినట్టు వివరించారు.'మిషన్ జీరో స్క్రాప్' ప్రాజెక్ట్ లక్ష్యానికి అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే మెటీరియల్స్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఎప్పటికప్పుడు నిరుపయోగ వస్తువులను గుర్తించి ఎంపిక చేసిన ప్రాంతాలకు తరలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో వర్క్‌షాప్‌లు, వివిధ రైల్వే యూనిట్ల ప్రాంగణాలను శుభ్రంగా ఉంచడంతో పాటు స్క్రాప్ సామగ్రి అమ్మకం ద్వారా రైల్వే ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్లకు కొత్త కళ: రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

అమృత్‌భారత్ స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లకు కొత్త కళ సంతరించుకోనున్నదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ చెప్పారు. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని రైల్వేస్టేషన్‌ను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి పనులపై అయన సంతృప్తి వ్యక్తం చేశారు. జహీరాబాద్ ప్రాంతంలో రైల్వేశాఖ పరంగా తీర్చాల్సిన సమస్యలపై దక్షిణ మధ్య రైల్వేబోర్డు సభ్యుడు షేక్‌ఫరీద్ ఈ సందర్భంగా జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందించారు.

దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళానికి 'శక్తి టీం' పురస్కారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళానికి 'మహిళల రక్షణ కేటగిరి' కింద 'శక్తి టీం' పురస్కారాన్ని అందించింది. గురువారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క.. దక్షిణ మధ్య రైల్వే ఐజి కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌కు రూ.1 లక్ష నగదు, జ్ఞాపికను అందించి సత్కరించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్.. అరోమా సింగ్ ఠాకూర్‌ను అభినందించారు.

నారాయణ విషయంలో 41ఏ నిబంధనలు పాటిస్తాం

హైకోర్టుకు నివేదించిన పోలీసులు

అమరావతి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పొంగూరి కృష్ణప్రియ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి నారాయణ విషయంలో సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ) నిబంధనలు పాటిస్తామని పోలీసులు హైకోర్టుకు నివేదించారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు వ్యాజ్యంపై విచారణను మూసివేశారు. తనను వేధింపులకు గురిచేస్తున్నారంటూ మాజీ మంత్రి నారాయణ మరదలు పొంగూరి కృష్ణప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. నోటీసులు ఇచ్చేందుకు పిటిషనర్ పోలీసులకు అందుబాటులో లేరని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు నివేదించడంతో.. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, ఎన్నికల ప్రచారం కూడా నిర్వహిస్తున్నారని.. ఆయన అందుబాటులో లేరని పోలీసులు అసత్యాలు చెబుతున్నారని అన్నారు.

పునీత్ విషయంలో తొందరపాటు చర్యలు వద్దు

మరోవైపు పొంగూరి కృష్ణప్రియ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ నారాయణ అల్లుడు పునీత్ దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పునీత్ విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి వాయిదా వేశారు.

ప్రత్తిపాటి శరత్‌కు బెయిల్ మంజూరు

విజయవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఎగవేత కేసులో అరెస్టయిన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌కు విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. రిమాండ్ గడువు ముగియంతో శరత్‌ను ఉదయం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌ను పొడిగించారు. బెయిల్ పిటిషన్‌పై మధ్యాహ్నం తీర్పు వెలువరించారు. రూ.25 వేల పూచీకత్తు, ఇద్దరు జామీనుతో శరత్‌కు బెయిల్ మంజూరు చేశారు. దీంతో శరత్ జైలు నుంచి విడుదలయ్యారు.



ఒంటిపై పది కిలోల బంగారంతో శ్రీవారి దర్శనానికి వచ్చిన బంగారు బాబు అందరినీ ఆకట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ (బంగారు బాబు) గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనను భక్తులు ఆసక్తిగా చూశారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

టీఎస్ పీజీ ఈసెట్ నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ పీజీ ఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. దీని ద్వారా ఎంఈ/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎంఆర్క్/గ్రాడ్యుయేట్ లెవెల్ ఫార్మా-డీ(పీబీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ ఇంజనీరింగ్/ఫార్మసీ/ఆర్కిటెక్చర్ కళాశాలల్లో ముందుగా గేట్/జీప్యాట్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తరవాత మిగిలిన సీట్లను పీజీఈసెట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పార్ట్ టైం, స్పాన్సర్డ్ పీజీ ప్రోగ్రామ్‌లు ఈ టెస్ట్ పరిధిలోకి రావు.

విభాగాలు: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, నానో టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయో టెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, జియో ఇంజనీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఫార్మసీ.

అర్హత: ఇంజనీరింగ్/ఫార్మసీ విభాగాల్లో ద్వితీయ శ్రేణి మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు.

పరీక్ష వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అభ్యర్థి ఎంచుకొన్న విభాగం నుంచి మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఇస్తారు. విభాగానికి సంబంధించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 25 శాతం మార్కులు(30 మార్కులు) రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇది వర్తించదు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** మార్చి 16 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 14 నుంచి 16 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 28 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్
- **పీజీఈసెట్ 2024 తేదీలు:** జూన్ 6 నుంచి జూన్ 9 వరకు
- **వెబ్‌సైట్:** https://pgecet.tsche.ac.in

ఏపీ బీసీ గురుకులాల్లో అయిదోతరగతి ప్రవేశాలు



విజయవాడ-కానూరులోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 106 గురుకుల పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. విద్యార్థుల స్థానికత ఆధారంగా సంబంధిత జిల్లాకు చెందిన గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బాలురు, బాలికలకు విడివిడిగా పాఠశాలలు ఉన్నాయి. ప్రత్యేక కేటగిరీ కింద అనాథ పిల్లలకు, మత్స్యకారుల పిల్లలకు ప్రవేశాలు కల్పిస్తారు.

గురుకులాల ప్రత్యేకతలు: స్టేట్ సిలబస్ ప్రకారం డిజిటల్ తరగతులతో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. నాలుగు జతల యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు, సాక్స్, రెండు దుప్పట్లు ఇస్తారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు, ప్లేట్, గ్లాస్, సమీకృత పౌష్టికాహారం(వేరుశనగ చిక్కీ, గుడ్డు, చికెన్) అందిస్తారు. క్రీడలలో శిక్షణ ఇస్తారు. ఇక్కడ గ్రంథాలయాలు, ప్రయోగశాలలు ఉంటాయి. అయిదోతరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్ వరకూ ఇక్కడే చదువుకొనే అవకాశం ఉంది.

- కాస్మోటిక్ ఖర్చుల కింద అయిదు, ఆరు తరగతులు చదివే బాలురకు నెలకు రూ.125; ఏడు నుంచి ఇంటర్ వరకు చదివేవారికి నెలకు రూ.150లు ఇస్తారు. సెలూన్ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.50 ఇస్తారు. అయిదు నుంచి ఏడోతరగతి వరకు చదివే బాలికలకు నెలకు రూ.130; ఎనిమిది నుంచి ఆపై చదివే బాలికలకు నెలకు రూ.250లు చెల్లిస్తారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో మూడోతరగతి, 2023-24 సంవత్సరంలో నాలుగోతరగతి చదివి ఉండాలి. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000లు మించకూడదు.

ప్రవేశ పరీక్ష వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. తెలుగు నుంచి 10, ఇంగ్లీష్ నుంచి 10, లెక్కల నుంచి 15, పరిసరాల విజ్ఞానం నుంచి 15 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ నాలుగోతరగతి స్థాయిలోనే ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్న పత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. మొత్తం మార్కులు 50. విద్యార్థులు సొంత జిల్లాలోనే పరీక్ష రాయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **ప్రవేశ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 27
- **వెబ్‌సైట్:** mjpapbcwreis.apcfss.in



ఆశపోతు

ఒక ఊరిలో రంగయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అతనికి కోళ్లు, బాతులు, ఆవులు.. ఇలా మూగ జీవుల పెంపకం అంటే ఇష్టం. అతని దగ్గర కుక్కలతో పాటు పిల్లులూ ఉండేవి. జాగ్రత్తగా వాటికి గూళ్లు కట్టి కాపాడుకునేవాడు. ఈ పశుపక్ష్యాదులను పోషించటం వల్ల అతడు అదనంగా గుడ్లు, మాంసంతో డబ్బులు గడించేవాడు.


ఒక రోజు అతడు సంతకు వెళ్లాడు. ఓ తెల్లబాతు చూసి మురిసిపోయాడు. దాని వెల ఎంతయినా కొంటా అన్నాడు. కొన్న తర్వాత ఆ వ్యాపారి ఇలా అన్నాడు. 'ఈ బాతు బంగారు గుడ్లను పెడుతుంది' అన్నాడు. అవునా.. అదృష్టమే నాది అంటూ పొంగిపోయాడు. ఇంటికి తీసుకెళ్లాడు. ఆ బాతును ప్రత్యేకమైన గూటిలో ఉంచాడు.



కొన్ని నెలల తర్వాత ఆ బాతు గుడ్లకు వచ్చింది. ప్రతి రోజూ బంగారు రంగులో గుడ్డు పెట్టింది. ఆ గుడ్డును చూసి సంతోషించాడు. ఊరిలోని జనాలంతా వచ్చి ఆ గుడ్లను చూసి పొగిడారు. అసలు రంగయ్యకు రాని విద్యనే లేదు. ఈ బంగారు గుడ్లను అమ్మితే ధనవంతుడు అవుతాడని చెప్పారు. రంగయ్యకు మనసాగలేదు. ప్రతిరోజూ ఓ బంగారు రంగు గుడ్డు పెడుతోంటే.. ఆ గుడ్డును చూసి మురిసిపోయేవాడు. ఒక రోజు తన భార్యను తీసుకొచ్చి చూపించాడు. ఆమె కూడా సంతోషపడింది. డబ్బుకు కొదువే లేదు.. ఇలాంటి గుడ్లను అధిక ధరకు కొంటారని విన్నాను అన్నది. ఇద్దరూ మాదే అదృష్టం అనుకున్నారు.

ఒక రోజు ఆ బంగారు గుడ్లను చూశాక రంగయ్యకు ఓ బుద్ధి పుట్టింది. రోజూ ఒకటి ఎందుకూ.. ఒకేసారి అన్ని గుడ్లను తీసుకుంటే సరిపోతుంది అనుకున్నాడు. దురాశ, అత్యాశ వల్ల ఏమీ ఆలోచించలేదు. కళ్లు కనపడని ఆశ. దీంతో ఆ బాతును పొట్టకోసి చంపాడు. లోపల గుడ్లు లేవు. తన దురాశను చూసి అందరూ తిట్టారు. బంగారు బాతును చంపావని ఇంటిలోని వాళ్లూ తిట్టిపోశారు. ఆశపోతు రంగయ్యగా ఆ ఊరిజనాలంతా పిలిచారు. తన మూర్ఖత్వానికి అతనికి అతనే తిట్టుకున్నాడు. దుఃఖించినా ఉపయోగం లేకపోయింది.

జంతువులు ఎన్ని?





6 తేడాలను గుర్తించండి

జేఎన్‌సీఏఎస్ఆర్‌లో పీజీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు



బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (జేఎన్‌సీఏఎస్ఆర్)- పీజీ, రీసెర్చ్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ/ఇంటర్‌డిసిప్లినరీ బయోసైన్సెస్) ప్రోగ్రామ్‌లకు మినహా అన్నింటికీ ఫెలోషిప్ సౌకర్యం ఉంది. జేఎన్‌సీఏఎస్ఆర్/సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/ఇన్‌స్పయిర్ ఫెలోషిప్‌లు వర్తిస్తాయి.

రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు(పీహెచ్‌డీ/ఎంఎస్ ఇంజనీరింగ్/ఎంఎస్ రీసెర్చ్)

ఏడు స్పెషలైజేషన్ యూనిట్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి స్పెషలైజేషన్ యూనిట్‌కూ నిర్దేశించిన అర్హత వివరాలను వివరంగా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ ఆఫ్ మెటీరియల్స్: ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/కెమికల్/మేథమెటికల్/ఫిజికల్/మెటీరియల్స్ సైన్స్)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్)(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెటలర్జీ/ పాలిమర్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/నానో టెక్నాలజీ, కెమికల్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఇంజనీరింగ్ మెకానిక్స్: ఎమ్మెస్సీ(మేథమెటికల్/ఫిజికల్ సైన్సెస్)/(బీఈ/బీటెక్/బీఎస్/ ఎంఈ/ఎంటెక్) (ఏరోస్పేస్/మెకానికల్/మెటలర్జీ/ పాలిమర్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/కెమికల్/అట్మాస్పిరిక్ సైన్స్) పూర్తిచేసి ఉండాలి.

ఎవల్యూషనరీ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ: ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్/బయలాజికల్ సైన్సెస్/మేథమెటిక్స్/ఫిజిక్స్)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్)(బయోటెక్నాలజీ/బయలాజికల్ ఇంజనీరింగ్)/ఎంబీబీఎస్/ఎండీ/బీవీఎస్సీ/ఎంవీఎస్సీ పూర్తిచేసినవారు అర్హులు.

మాలిక్యులర్ బయాలజీ అండ్ జెనెటిక్స్: ఎమ్మెస్సీ(బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/కెమికల్/బయలాజికల్/లైఫ్ సైన్సెస్)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్)(బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్)/ఎంబీబీఎస్/ఎండీఉత్తీర్ణులై ఉండాలి.

న్యూ కెమిస్ట్రీ: ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్)/బీఈ/బీటెక్/బీఎస్ పూర్తిచేసి ఉండాలి.

న్యూరోసైన్స్: ఎమ్మెస్సీ(న్యూరోసైన్స్/బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/బయలాజికల్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/ఫార్మసీ)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్)(బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్)/ఎంబీబీఎస్/ఎండీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

థియరిటికల్ సైన్సెస్: ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/కెమికల్/మేథమెటికల్/ఫిజికల్/మెటీరియల్స్ సైన్స్)/(బీఈ/బీటెక్/బీఎస్/ఎంఈ/ఎంటెక్)(ఏరోస్పేస్/ఇంజనీరింగ్ ఫిజిక్స్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెటలర్జీ/కెమికల్/మెకానికల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.

- అన్ని స్పెషలైజేషన్‌లకూ గేట్/జెస్ట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. లేదా సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ఐసీఎంఆర్/ఇన్‌స్పయిర్ సంస్థల నుంచి జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ఫెలోషిప్: పీహెచ్‌డీ అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాత మూడేళ్లు నెలకు రూ.42,000ల ఫెలోషిప్ ఇస్తారు. ఎంఎస్ అభ్యర్థులకు నెలకు రూ.37,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. ట్రావెల్ గ్రాంట్ కింద పీహెచ్‌డీ అభ్యర్థులకు రూ.1,00,000; ఎంఎస్ అభ్యర్థులకు రూ.40,000 చెల్లిస్తారు.

ఎమ్మెస్సీ ఇన్ కెమిస్ట్రీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా కనీసం 55 శాతం మార్కులతో బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. జామ్ 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జామ్ 2024 స్కోర్/సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఎమ్మెస్సీ ఇన్ ఇంటర్ డిసిప్లినరీ బయోసైన్సెస్

స్పెషలైజేషన్‌లు: ఎపిజెనెటిక్స్-డిసీజెస్, న్యూరో సైన్సెస్, హ్యూమన్ డిసీజ్ జెనెటిక్స్, కెమికల్ బయాలజీ-డిసీజ్ బయాలజీ-డ్రగ్ డిస్కవరీ

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ(బయలాజికల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. జామ్ 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జామ్ 2024 స్కోర్ ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ

ఈ ప్రోగ్రామ్‌లో ఫిజికల్ సైన్స్- మెటీరియల్స్, కెమికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ అనే మూడు స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఫిజికల్ సైన్స్‌లో ప్రవేశానికి సైన్స్/ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్, మెటీరియల్స్ రీసెర్చ్ అంశాల్లో పరిజ్ఞానం ఉండాలి. కెమికల్ సైన్స్‌లో ప్రవేశానికి కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టుగా చదివి ఉండాలి. బయలాజికల్ సైన్స్‌లో ప్రవేశానికి డిగ్రీ (ఫిజికల్ సైన్స్/కెమికల్ సైన్స్/బయలాజికల్ సైన్స్/బయోటెక్నాలజీ/ఫార్మాస్యూటికల్స్/వెటర్నరీ సైన్సెస్/అగ్రికల్చరల్ సైన్సెస్) పూర్తిచేసి ఉండాలి. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్) 2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్స్ విభాగాలకు అకడమిక్ ప్రతిభ, జామ్ 2024 స్కోర్ ద్వారా; బయలాజికల్ విభాగానికి ఆన్‌లైన్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు.

ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.19,000; తరవాతి రెండేళ్లు నెలకు రూ.37,000; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000ల ఫెలోషిప్ ఇస్తారు. ట్రావెల్ గ్రాంట్ కింద రూ.1,00,000 చెల్లిస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ మెటీరియల్ సైన్స్

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఏ స్పెషలైజేషన్‌తోనైనా ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంపిక: అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** www.jncasr.ac.in

ఎన్‌హెచ్‌పీసీలో ట్రెయినీ ఇంజనీర్లు

ఫరీదాబాద్(హరియాణా)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్.. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 280

పోస్టుల వివరాలు

1. ట్రెయినీ ఇంజనీర్(సివిల్): **95 పోస్టులు**
2. ట్రెయినీ ఇంజనీర్(ఎలక్ట్రికల్): **75 పోస్టులు**
3. ట్రెయినీ ఇంజనీర్(మెకానికల్): **77 పోస్టులు**
4. ట్రెయినీ ఇంజనీర్(ఈఅండ్‌సీ): **4 పోస్టులు**
5. ట్రెయినీ ఇంజనీర్ అండ్ ట్రెయినీ ఆఫీసర్(ఐటీ): **20 పోస్టులు**
6. ట్రెయినీ ఆఫీసర్(జియాలజీ): **3 పోస్టులు**
7. ట్రెయినీ ఇంజనీర్ అండ్ ట్రెయినీ ఆఫీసర్(ఎన్విరాన్‌మెంట్): **6 పోస్టులు**

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఈఅండ్‌సీ, ఐటీ, జియాలజీ, ఎన్విరాన్‌మెంట్

అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ ఎంసీఏ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్-2023 స్కోర్ సాధించి ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. **జీతం:** నెలకు రూ.50,000 - రూ.1,60,000

ఎంపిక ప్రక్రియ: గేట్ 2023 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.708. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మాజీ సైనికులు/మహిళలకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 26

వెబ్‌సైట్: https://www.nhpcindia.com/

డీఆర్‌డీవోలో జేఆర్ఎఫ్

న్యూఢిల్లీలోని డీఆర్‌డీవో- సైంటిఫిక్ అనాలసిస్ గ్రూప్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

మొత్తం ఖాళీలు: 19

పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోరు సాధించి ఉండాలి.

వేతనం: నెలకు రూ.37,000


వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు

దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: saghr.sag@gov.in

ఇంటర్వ్యూ తేదీ: మార్చి 18

ప్రదేశం: మెయిన్ గేట్, రిసెప్షన్, మెట్కాఫ్ హౌస్, డీఆర్‌డీవో-ఎస్ఏజీ, ఢిల్లీ.

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/



బామర్‌లో డిప్యూటీ మేనేజర్లు

కోల్‌కతాలోని బామర్ లారీ అండ్ కో లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- డిప్యూటీ మేనేజర్(సేల్స్ అండ్ మార్కెటింగ్): 2 పోస్టులు

అర్హత: ఫుల్ టైం ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ లేదా రెండేళ్ల ఎంబీఏ లేదా మేనేజ్‌మెంట్‌లో పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణత.

వయోపరిమితి: 32 సంవత్సరాలు మించరాదు

వేతనం: నెలకు రూ.50,000 - రూ.1,60,000

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 29

వెబ్‌సైట్: https://www.balmerlawrie.com/

దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 255

1	8	4	3	6		9		2
	5		1				8	
2					8	7		
	9				4	6		
		7	8		9	1		
		1	6				4	
		2	4					5
	1				5		3	
3		5		8	1	2	9	6

సుడోకు - 254 సమాధానం

9	3	6	2	4	7	1	5	8
5	7	8	1	6	9	3	4	2
1	4	2	8	5	3	7	6	9
3	6	9	7	2	1	4	8	5
7	1	5	9	8	4	2	3	6
2	8	4	6	3	5	9	7	1
6	2	7	3	9	8	5	1	4
4	9	3	5	1	6	8	2	7
8	5	1	4	7	2	6	9	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.